ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-3-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 31 పేజీలు: 12 వెల: 6.50

ఆరుకు చేరిన కల్తీపాల మృతులు 2

పురుగుల మందు తాగి ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

# జోరుగా వార్



ఇజ్రాయెల్- అమెరికా బాంబు దాడికి ఇరాన్‌లో ఎగిరిపోతున్న శాంతికపోతాలు

## మూడో రోజున దాడులు ముమ్మరం

ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ సతీమణి మృతి

హర్మొజ్ మూసివేతతో చమురు ధరలకు రెక్కలు


ఇజ్రాయెల్- అమెరికా దాడులతో ఇరాన్‌లో నేలకూలిన భవనాలు, ఎగసిపడుతున్న పొగలు

కువైట్‌లో మూడు అమెరికా యుద్ధవిమానాలు కూల్చివేత

70 హెజ్బొల్లా స్థావరాలు టార్గెట్‌గా ఇజ్రాయెల్ దాడులు

యుఎస్ బేస్‌లపై ఇరాన్ ప్రతీకార దాడులు

తాత్కాలిక సుప్రీం కమాండర్ కూడా దాడుల్లో మరణించినట్లు కథనాలు, ఖండించిన ఇరాన్

**టెహ్రాన్, మార్చి 2:** ఇరాన్ అణ్వాయుధ తయారీని నిలిపివేయాలని, ఒప్పందానికి నిరాకరించడంతో సైనిక చర్యలుచేపట్టిన అమెరికా, ఇజ్రాయెల్ దాడులు మూడోరోజు కూడా కొనసాగాయి. సుదూర లక్ష్యాలుఛేదించగలిగే క్షిపణులతో >>2



## యుద్ధం మరో నాలుగైదు వారాలు తప్పదు

ఇరాన్ మిసైల్ వ్యవస్థను నాశనం చేస్తాం: ట్రంప్

# అన్ని శాఖల్లో ఎఐ

డ్రోన్, సిసిటివి, శాటిలైట్ డేటా సమీకృతం చేసే మెకానిజం

బాణాసంచా పేలుళ్ల నివారణకు శివకాశి విధానాలపై అధ్యయనం

బస్ స్టేషన్లలో వేసవి సౌకర్యాలు

ఆర్టీజీఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు


సోమవారం అమరావతిలో ఆర్టీజీఎస్‌పై సమీక్షలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి2,ప్రభాతవార్తప్రతినిధి:** అన్ని ప్రభుత్వ శాఖల్లో కృతిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) వినియోగించుకోవడం ద్వారా పాలనలో సమర్థత మరింత పెంచుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌పై క్యాంపు కార్యాలయంలో అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... వివిధ అంశాలపై చర్చించారు. డ్రోన్, సీసీ టీవీ కెమేరాలు, శాటిలైట్ సమాచారాన్ని సమీకృతం చేసి. వినియోగించుకునేలా ఒక మెకానిజం తీసుకురావాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు, పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై తమిళనాడులోని శివకాశికి వెళ్లి అధ్యయనం చేయాలని సీఎం స్పష్టం చేశారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్‌స్టేషన్లలో మంచి నీటికి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా జరిగేలా పరిస్థితులు ఉండాలన్నారు.ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా... ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలి అన్నారు. పుంగనూరు, వెంకటగిరి, పెనుకొండ, ప్రొద్దుటూరు, ఎమ్మిగనూరు, శ్రీకాళహస్తి బస్ స్టేషన్‌లో తాగునీరు, టాయిలెట్స్, ఫ్యాన్స్, సీటింగ్ ఏరియాపై ప్రయాణికుల నుంచి అసంతృప్తి.. మొత్తం రాష్ట్రంలోని అన్ని బస్టేషన్‌లో టాయిలెట్స్ మరమ్మతులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి... రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై శివకాశీకి వెళ్లి అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది ప్రవర్తనపై సంతృప్తి >>2

సిఎంఒ ఎక్స్ అఫిషియో స్పెషల్ సిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన కె. విజయానంద్ 3

# భారత్‌కు కెనడా యురేనియం

ఉభయదేశాల మధ్య రూ.23 వేల కోట్ల ఒప్పందం

కొత్త అణుసాంకేతికతపై కలిసి పనిచేస్తామన్న ప్రధాని మోడీ, కెనడా ప్రధాని మార్క్ కెర్నీ


న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో సోమవారం ప్రధాని మోడీతో భేటీ అయిన కెనడా ప్రధాని మార్క్

**న్యూఢిల్లీ, మార్చి 2:** మధ్యప్రాచ్యంలో ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ భారత్‌కు కీలకమైన దౌత్య, ఇంధన రంగానికి సంబంధించి శుభవార్త అందింది. భారత్, కెనడా మధ్య సుమారు 2.6 బిలియన్ డాలర్ల (రూ.23,000 కోట్లు) విలువైన దీర్ఘకాలిక యురేనియం సరఫరా ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా భారత శాంతియుత అణుశక్తి కార్యక్రమానికి స్థిరమైన ఇంధన భద్రత లభించనుంది. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కెనడా ప్రధాని మార్క్ మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం ఈ ఒప్పందం ప్రకటించారు. 2026 చివరి నాటికి సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సిఇపిఎ)ను పూర్తి చేయాలని రెండు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడుతూ "దీర్ఘకాలిక >>2

## గల్ఫ్ బాధితులను వెంటనే రప్పించండి

ప్రభుత్వానికి జగన్ విజ్ఞప్తి

**విజయవాడ మార్చి 2 ప్రభాతవార్త ప్రతినిధి:** గల్ఫ్‌లో చిక్కుకున్న ప్రవాసాంధ్రులను వెంటనే వెనక్కి రప్పించాలని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.



మధ్య పాశ్చ్య దేశాల్లో యుద్ధ వాతావరణం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు జగన్ గల్ఫ్ దేశాల్లో వేలాది మంది ఆంద్రులు ఉద్రిక్త పరిస్థితుల్లో ఇరుక్కు పోయారని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, గల్ఫ్ దేశాల్లో వేలాది మంది ఆంధ్రులు ఉపాధి కోసం పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత >>2

# గల్ఫ్‌లో చిక్కుకున్న తెలుగువారికి పూర్తి సాయం



అక్కడ మన పౌరులు సురక్షితంగా ఉండడానికి తగిన ఏర్పాట్లు: సిఎం చంద్రబాబు

**విజయవాడ మార్చి 2,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధం నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న రాష్ట్ర ప్రజలు సురక్షితంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దీనిపై ఆర్టీజీఎస్ అధికారులు, ఎపీఎన్ఆర్టీ ప్రతినిధులతో క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ తదితర దేశాల్లోని రాష్ట్ర ప్రజలు యుద్ధంకారణంగా ఎలాంటి ఇబ్బందులు పడకుండాచూడాలన్నారు. ఇందుకోసంకేంద్రంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అక్కడ చిక్కుకుపోయిన వారిని సంప్రదించి, తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం నిర్దేశించారు. సహాయక చర్యల విషయంలో ఏపీ ఎన్ఆర్టీ, ఆర్టీజీఎస్ కలిసి పనిచేయాలని, నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులకు సీఎం చెప్పారు. కేంద్రం ద్వారా ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి, అందరూ సురక్షితంగా ఉండేలా చూడాలని చెప్పారు. వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన రాష్ట్ర ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఎయిర్ పోర్టులు మూసివేయడం, విమాన సర్వీసుల రద్దుతో వెంటనే రాష్ట్రానికి తిరిగి వచ్చే పరిస్థితులు లేనందున, పరిస్థితులు చక్కబడేవరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, దీనికి ఏపీ ఎన్ఆర్టీ సహకరిస్తుందని సీఎం చెప్పారు.

**హెల్ప్ లైన్ నెంబర్ 08632340678..**

గల్ఫ్ దేశాల్లో రాష్ట్ర ప్రజల రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ఎన్ఆర్టీతో కలిసి చర్యలు చేపట్టింది. వారికి సహాయం కోసం 08632340678 హెల్ప్ లైన్ నెంబర్, 85000 27678 వాట్సప్ నెంబర్‌ను 24 గంటలు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏపీ ఎన్ఆర్టీ కో ఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి కల్పిస్తున్నారు. ప్రవాసాంధ్రులు సంప్రదించిన వెంటనే ఏపీ ఎన్నార్టీ వారికి తక్షణం సహాయ, సహకారాలు అందించేలా ఏర్పాట్లు చేసింది. హెల్ప్ లైన్ నెంబర్లతో పాటు హెల్ప్‌లైన్ ఈ మెయిళ్లు,వెబ్సైట్‌ను కూడా సంప్రదించవచ్చు. ఈ సమీక్షలో ఆర్టీజీఎస్ అధికారులు, ఎన్ఆర్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.




ఐపిఎస్ అధికారి సునీల్ నాయక్‌కు హైకోర్టులో చుక్కెదురు 2

5వ తేదీలోగా విచారణకు హాజరు కావాలని ఆదేశం

03-03pg2exHMNWJQE 2_03-03pg2exHMNWJQE.qxd 03/Mar/26 12:01 AM Page 1





వికారాబాద్‌లో డిసిసి అధ్యక్షుల సమావేశానికి వెళ్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, తెలంగాణ సిఎం రేవంత్, ఎపి పిసిసి చీఫ్ షర్మిల

# గల్ఫ్ బాధితులను వెంటనే రప్పించండి

>> ఉద్రిక్త పరిస్థితుల వల్ల వారి భద్రతపై తీవ్ర ఆందోళన నెలకొన్నదన్నారు. విమాన సర్వీసుల రద్దు, విమానాశ్రయాల్లో ఆంక్షలు విధించడంతో అనేక మంది అక్కడికక్కడే ఇరుక్కుపోయారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు వైఎస్ జగన్. అవసరమైతే ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేసి ప్రవాసాంధ్రులను సురక్షితంగా స్వదేశానికి తరలించాలని సూచించారు. అలాగే గల్ఫ్ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని, రాష్ట్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్ నంబర్లను ప్రకటించాలని కోరారు. అక్కడి పరిస్థితులపై వారి కుటుంబాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ఈ సంక్షోభ సమయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రవాస ఆంధ్రుల భద్రత మరియు సురక్షిత ప్రయాణం రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యంగా ఉండాలని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి చెందిన వారందరినీ సురక్షితంగా ఇక్కడికి తీసుకురావడంలో ప్రభుత్వం చొరవ చూపాలని, ఈ విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుని, ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా వారందరి నీ తరలించాలని కోరారు. ఇంకా గల్ఫ్ దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలతో కూడా సమన్వయం చేసుకుని, ప్రవాస ఆంధ్రుల పరిరక్షణకు చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా అక్కడి వారి పరిస్థితిని ఎప్పడికప్పుడు, వారి కుటుంబాలకు తెలియజేసే విధంగా ఇక్కడ ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి, హెల్ప్‌లైన్ నెంబర్లు కూడా అందుబాటులోకి తేవాలని జగన్ సూచించారు. ప్రవాసాంధ్రుల భద్రత, వారి సురక్షిత ప్రయాణం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్న జగన్, ఈ సంక్షోభ సమయంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం పని చేయాలని ఆయన పదే,పదే విజ్ఞప్తి చేశారు. అటు కేంద్రం సైతం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేసింది. ఈ ఉద్రిక్తతల సమయంలో దేశంలో ముందస్తు చర్యల పైన హెచ్చరిక లు చేసింది. దేశంలో ఎక్కడా సామాజిక, మత పరమైన ఉద్రిక్తతలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచిస్తూ లేఖ రాసింది. శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా పూర్తి అప్రమత్తత తో వ్యవహరించాలని నిర్దేశించింది.

## ఇజ్రాయెల్, ఇరాన్ గల్ఫ్‌దేశాల భారతీయుల భద్రతపై సమీక్ష

### ప్రధాని మోడీ అధ్యక్షతన అత్యవసర భేటీ

**న్యూఢిల్లీ, మార్చి 2:** ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చడంతో పశ్చిమాసియా మొత్తం అల్లకల్లోలంగా మారింది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ప్రధాని మోదీ అధ్యక్షతన అత్యున్నత స్థాయి భద్రతా కేబినెట్ కమిటీ సమావేశం జరిగింది. రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు పర్యటన ముగించుకుని న్యూఢిల్లీకి చేరుకున్న కాసేపటికే ప్రధాని మోదీ ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో దేశ భద్రత, వ్యూహాత్మక విషయాలపై ప్రధానంగా చర్చించారు. పశ్చిమాసియాలో నివసిస్తున్న సుమారు 9 మిలియన్ల మంది భారతీయుల భద్రతపై సిసిఎస్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ముఖ్యంగా ఇజ్రాయెల్‌లోని 40,000 మంది, ఇరాన్‌లోని 10,000 మంది భారతీయుల పరిస్థితిని సమీక్షించారు. యుద్ధ ఉద్రిక్తతల వల్ల విమాన సేవలు నిలిచిపోయి, దుబాయ్ వంటి విమానాశ్రయాలలో చిక్కుకుపోయిన వందలాది మంది భారతీయులను సురక్షితంగా తరలించే అంశంపై చర్చించారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల అనంతరం ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరణంతో తలెత్తిన తాజా పరిస్థితులను ఉన్నతాధికారులు కమిటీకి వివరించారు. ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లతో పాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ పాల్గొన్నారు. భారత చమురు వాహక సంస్థలకు ప్రధాన మార్గమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం వల్ల చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రమాదంపై కూడా కమిటీ చర్చించింది. పశ్చిమాసియాలోని భారత రాయబార కార్యాలయాలు స్థానిక భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని, హెల్ప్‌లైన్‌లను అందుబాటులో ఉంచామని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## బీ అలర్ట్!

### మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు

### ప్రత్యేక నిఘా పెట్టండి: రాష్ట్రాలకు హోంశాఖ లేఖ

**న్యూఢిల్లీ, మార్చి 2:** మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. కొన్ని శక్తులు ఇరాన్‌లో కొనసాగుతున్న పరిస్థితిని వినియోగించుకుని దేశవ్యాప్తంగా హింసను రెచ్చగొట్టడానికి చూస్తాయని నిఘా సంస్థలు సంకేతాలు ఇచ్చిన నేపథ్యంలో కేంద్రం ఈ సమాచారం అందించింది. అమెరికా- ఇజ్రాయెల్ సైనిక చర్యలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతి చెందిన నేపథ్యంలో ఈ మేరకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఎ) సోమవారం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖ రాసింది. ప్రదర్శనల నుండి తలెత్తే ఏవైనా శాంతిభద్రతల సమస్యల పట్ల జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇరాన్‌కు మద్దతుగా లేదా వ్యతిరేకంగా నిర్వహించే ఏవైనా నిరసనలను నిశితంగా పరిశీలించాలని, అటువంటి సమావేశాలు ప్రజా క్రమాన్ని దెబ్బతీయకుండా చూసుకోవాలని హోంశాఖ తన లేఖలో రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది. ఏవైనా అవాంఛనీయ సంఘటనలను నివారించడానికి తగిన నివారణ చర్యలు తీసుకోవాలని, నిఘా సమాచారాన్ని నిశితంగా పరిశీలించాలని మంత్రిత్వ శాఖ నొక్కి చెప్పింది. కొన్ని అంశాలు అశాంతిని ప్రేరేపించడానికి పరిస్థితిని ఉపయోగించుకోవడానికి ప్రయత్నించవచ్చనే ఆందోళనల ఆధారంగా ఈ సలహా ఇవ్వబడింది.

## ఐపిఎస్ అధికారి సునీల్ నాయక్‌కు హైకోర్టులో చుక్కెదురు

### 5వ తేదీలోగా విచారణకు హాజరు కావాలని ఆదేశం

**విజయవాడ,మార్చి2,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ వ్యవహారంలో ఈ కేసు దర్యాప్తు చేస్తున్న అధికారి ముందు హాజరు కావాలని బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్‌ను హైకోర్టు ఆదేశించింది. మార్చి 5వ తేదీ లేదా అంతకంటే ముందు దర్యాప్తు అధికారి ఎదుట హాజరు కావాలని జారీ చేసిన ఆ ఆదేశాల్లో నాయక్‌కు హైకోర్టు స్పష్టం చేసింది. ఎలాంటి కఠిన చర్యలకు పాల్పడకుండా చట్టంలోని నిబంధనలను లోబడి సునీల్ కుమార్ నాయక్‌ను విచారించాలని దర్యాప్తు అధికారికి ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు సూచించింది. ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సోమవారం ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు పై విధంగా స్పందించింది. ఇక మార్చి 9వ తేదీకి సునీల్ కుమార్ ప్రధాన బెయిల్ పిటిషన్ విచారణను హైకోర్టు వాయిదా వేసింది. ఈ సందర్భంగా రాజకీయ కారణాలతో తన పిటిషనర్‌ను నిందితుడిగా చేర్చారంటూ సునీల్ తరఫు సీనియర్ న్యాయవాది పరమేశ్వర్ వాదనలు వినిపించారు. ఈ కస్టోడియల్ టార్చర్‌తో సునీల్ నాయక్‌కు సంబంధం లేదని కోర్టు దృష్టికి ఈ సందర్భంగా పరమేశ్వర్ తీసుకెళ్లారు. సునీల్ నాయక్ వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని పోలీసుల తరఫు సీనియర్ న్యాయవాది సిద్దార్ధ్ లూథ్రా కోర్టుకు వివరించారు. అలాగే సునీల్ నాయక్ ముందస్తు బెయిల్ కోరుతూ వేసిన పిటిషన్‌ను గుంటూరు కోర్టు గతంలో కొట్టి వేసిందంటూ హైకోర్టు దృష్టికి సిద్ధార్థ్ లూథ్రా తీసుకెళ్లారు.

పోలీసుల మొదట నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేరు లేదనే కారణంతో పిటిషనర్ దర్యాప్తు నుంచి తప్పించుకో లేరని హైకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఎఫ్ఐఆర్‌లో అందరి నిందితుల పేర్లు చేర్చాల్సిన అవసరం లేదని.. ఈ కేసు దర్యాప్తు సాగుతున్నకొద్ది మరికొంతమంది నిందితులను చేర్చే అవకాశం ఉంటుందని హైకోర్టు పేర్కొంది. దర్యాప్తునకు సహకరించాల్సిన చట్టబద్దమైన విధి పిటిషనర్‌కు ఉందని హైకోర్టు తెలిపింది. ఈ కేసు విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.

## వారం - వర్జ్యం

03-03-2026, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
○పౌర్ణమి సా.5.11, మఖ ఉ.7.32
వర్జ్యం : మ.3.34-సా.5.11
దు.ఉ.8.47-9.34, రా.11.00-11.47
శుభసమయం:ఉ.6.30-7.30, సా.6.30-7.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగంలో నూతన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పై అధికారుల ప్రశంసలు పొందుతారు. ధన లాభం.

**వృషభం:** సంతానం విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తారు. నూతన వరిశ్రమలను ప్రారంభిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**మిథునం:** విధుల నిర్వహణలో వ్యాపార రంగాలలో అభివృద్ధి కనిపిస్తుంది. విదేశీ యానాలు చేయాలనే ఆలోచనలు బలపడతాయి.

**కర్కాటకం :** బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** అనుకోని అతిథుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి.వస్త్రలాభం.

**కన్య:** ఉద్యోగాలలో మంచి మార్పులు వుంటాయి. శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుంది. భూముల కొనుగోలు చేస్తారు.

**తుల :** సన్నిహితుల నుండి ఆశ్చర్యకరమైన వార్తలు అందుకుంటారు. చాకచక్యంగా వ్యవహరించి ముందుకు సాగుతారు.

**వృశ్చికం:** నూతన ఉద్యోగానికై చేసే దరఖాస్తులు, సంప్రదింపులు, పర్యటనలు లాభిస్తాయి. క్రయవిక్రయాలలో లాభాలు.

**ధనుస్సు:** ఆస్తి తాలూకా వివాదాలను సాధ్యమైనంత తొందరగా పరిష్కారం చేసుకోవడమే మంచిదని భావిస్తారు.

**మకరం:** ఋణ యత్నం ఫలిస్తుంది. ఆరోగ్యం సాధారణంగా వుంటుంది. పనులు నెమ్మదిగా పూర్తిచేస్తారు.

**కుంభం:** పెట్టుబడులకు తొందరపాటు వద్దు. భూముల విషయంలో నెలకొన్న వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**మీనం :** నూతన ఒప్పందాలలో జాగ్రత్తలు పాటించండి. కుటుంబ సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. ప్రయాణాలు లభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అన్ని శాఖల్లో ఎఐ

>> వ్యక్తమైందని వివరించిన అధికారులు. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలని చెప్పిన సీఎం అటు పెన్షన్ల పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా అట్టడుగు స్థానంలో ఉన్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే, ప్రభుత్వం దగ్గరున్న సమాచారం కాకుండా, అదనపు సమాచారం కోసం మాత్రమే ఇకపై సర్వేలు జరపాలి తప్ప, పదేపదే ఒకేరకమైన సమాచారం కోసం ప్రజలను, ప్రభుత్వ సిబ్బందిని ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. మరోవైపు రాష్ట్రంలో వాట్సప్ మనమిత్ర సేవలను మరింత విస్తృతం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వాట్సప్ సేవల సంఖ్యను 953కి పెంచినట్టు తెలిపారు. అయితే వీటన్నింటినీ సులభంగా వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎం చెప్పారు.

ముఖ్యమంత్రి అంటే పెత్తందారు కాదు. ప్రజా సేవకుడు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోంది. తల్లికి వందనం కింద ఏడాదికి రూ.10,090 కోట్లు 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేస్తున్నాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కోసం స్త్రీ శక్తి పథకం తీసుకువచ్చాం. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల ఉచితంగా అందిస్తున్నాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరుల వద్దకే ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. సంజీవని కార్యక్రమం ద్వారా ఐదు కోట్ల ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాం. పేదరికం లేని రాష్ట్రం లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు ఆడబిడ్డలతో తెలుగుదేశం పార్టీ అనుబంధం ఈ నాటికి కాదు. ఆనాడు ఎన్టీఆర్ మగవారితో సమానంగా మహిళలకు ఆస్తిహక్కు కల్పించారు. మహిళల కోసం తిరుపతిలో పద్మావతీ యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. నేను ముఖ్యమంత్రి అయ్యాక డ్వాక్రా సంఘాల ద్వారా మహిళకు ఆర్థిక భరోసా కల్పించాను. రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల్లో 89 లక్షలమంది, మెప్మా సంఘాల్లో 24 లక్షల మంది సభ్యులున్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే బ్యాంకులు మరిన్ని రుణాలు ఇస్తాయని నేను చెప్పిన మాటను పొదుపు మహిళలు తూచా తప్పకుండా పాటించి ఆర్థిక ప్రగతి సాధించారు. 202425లో రూ. 46 వేల 590 కోట్ల రూపాయి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. నేనిచ్చిన ఐటీ పిలుపుతో ఎంతోమంది దేశ విదేశాల్లో ఆర్థికంగా ఉన్నతంగా స్థిరపడ్డారు. ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 93 వేలమంది మైక్రో, ఎంఎస్ ఎంఈ ఎంట్రప్రెన్యూర్లు అయ్యారు. డ్వాక్రా మహిళలు విదేశాలు కూడా వెళ్లి ఎంతోమందికి ట్రైనింగ్ ఇచ్చారు. డ్వాక్రా సంఘాలను మరింత సమర్థవంతంగా తయారుచేసే బాధ్యత నాదని సీఎం చంద్రబాబు అన్నారు.



న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో సోమవారం ప్రధాని మోడీ, కెనడా ప్రధాని మార్క్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకొంటున్న ఇరు దేశాల విదేశాంగ మంత్రులు

# భారత్‌కు కెనడా యురేనియం

>> యురేనియం సరఫరాలపై కీలక ఒప్పందానికి చేరుకున్నాం. చిన్న మాడ్యులర్ రియాక్టర్లు, కొత్త అణు సాంకేతికతలపై కలిసి పనిచేస్తాం" అని తెలిపారు. ఈ ఒప్పందాన్ని రెండు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యంలో పెద్ద ముందడుగుగా కార్నీ అభివర్ణించారు. ఈ సమావేశంలో ముఖ్యమైన ఖనిజాలు, పునరుత్పాదక శక్తి, సాంస్కృతిక మార్పిడి రంగాల్లో అనేక అవగాహన ఒప్పందాలపై కూడా సంతకాలు జరిగాయి. విదేశాంగ మంత్రి జయశంకర్, కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ సమక్షంలో పత్రాలు మార్పిడి చేశారు.

2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 50 బిలియన్ డాలర్లకు పెంచాలని రెండు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. పునరుత్పాదక ఇంధనం, ఎఐ, క్వాంటం టెక్నాలజీ, సెమీకండక్టర్లు, సూపర్‌కంప్యూటింగ్ వంటి రంగాల్లో సహకారాన్ని పెంచాలని మోడీ నొక్కిచెప్పారు. విద్యా రంగంలో కూడా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎఐ, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం వంటి రంగాల్లో కొత్త విశ్వవిద్యాలయ భాగస్వామ్యాలు ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. కెనడియన్ విశ్వవిద్యాలయాలు భారత్‌లో క్యాంపస్‌లు ప్రారంభించేందుకు కూడా అంగీకారం కుదిరింది. కాగా, విద్యుత్, టెక్నాలజీ రంగాల్లో సహకరించుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, అడ్వాన్స్‌డ్ రియాక్టర్ల తయారీలోనూ ఇరు దేశాలు కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. అంతర్జాతీయ సౌరశక్తి కూటమిలో చేరాలని కెనడా నిర్ణయించింది. గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమిలో చేరాలని కెనడా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. కెనడా నిర్ణయాన్ని ప్రధాని మోడీ స్వాగతించారు.

## ఇరాన్‌పై యుద్ధం మేం ప్రారంభించిందికాదు..!

### నియంతృత్వపాలనను అంతంచేసాం: అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్

**వాషింగ్టన్, మార్చి 2:** ఇరాన్‌తో యుద్ధం మేం ప్రారంభించలేదని, అయితే జరుగుతున్న యుద్ధాన్ని మేమేముగిస్తామని అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్ అన్నారు. మిలిటరీ ఆపరేషన్‌ను ఆపరేషన్ ఎపిక్‌ఫ్యూరీగా ప్రారంభించామని, జాతినిర్మాణంపైన కానీ, మిలిటరీ సత్తాను చూపించుకోడానికో చేసింది కాదని, ఇరాన్‌అణు తయారీని పూర్తిగా నిర్మూలించాలని, క్షిపణుల, నౌకా దళ ఆస్తులు, అణ్వాయుదతయారీని నిలిపివేసేందుకే ఈ దాడులు చేస్తామని రక్షణ మంత్రి పేర్కొనడం గమనార్హం. ఇరాన్ ప్రజలకు ఇదొక మంచి అవకాశమని ఖమైనీ నియంతృత్వ పాలన అంతం చేసామని, ప్రజాస్వామ్య స్రవంతిలోకి వచ్చేందుకు ఇరాన్‌పౌరులు సిద్ధం కావాలని అన్నారు. ఇరాన్‌లో అత్యధికశాతం ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ఇదే చక్కటి అవకాశం అని ట్రంప్ ఇచ్చిన అవకాశం చేజార్చుకోకూడదని అన్నారు. ప్రభుత్వాన్ని కూలదోసే లక్ష్యంతో ఈ దాడిజరగలేదన్నారు. కేవలం ఇరాన్ క్షిపణులు ధ్వంసంచేయడమే మా లక్ష్యమని ఇరాన్ అణ్వాయుధాలను కూడా ధ్వంసంచేస్తామని అన్నారు. మెరుపుదాడులతో వాటిని తుదముట్టించామని హెగ్సెత్ చెప్పారు. గతంలో మధ్యప్రాచ్యంలో అమెరికా సైనికచర్యకు ఇరాన్‌పై దాడులకు చాలా తేడా ఉందని, ఇదేమీ ఇరాక్‌కాదని, ఇదొక ముగింపులేని యుద్ధం కానేకాదని అన్నారు. ఈ దాడుల్లో ఐదుగురు అమెరికన్ దళ సభ్యులుచనిపోయారని, మరింతగా సైనిక నష్టం ఉండవచ్చుచని ట్రంప్ ఇప్పటికేప్రకటించిన సంగతి తెలిసిందే. జాయింట్‌చీఫ్స్ ఆఫ్‌స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కైన్ మాట్లాడుతూ ఈ దాడుల్లో అమెరికాకు కొంత నష్టం ఉంటుందని ముందుగానే అంచనావేసామన్నారు. సుదీర్ఘకాలంగా అమెరికాపై ఇరాన్ దాడులకు పాల్పడుతోందని అమెరికాపై ఏకపక్ష యుద్ధానికి ఇరాన్ తెగబడిందని మంత్రి అన్నారు. ప్రస్తుత ఆపరేషన్ ఈప్రాంతంలో అమెరికా, మిత్రపక్షాల శ్రేయస్సుకోసమేనని పేర్కొన్నారు.

# జోరుగా వార్

>> ఇజ్రాయెల్, అమెరికాలు దాడులు చేసాయి. ఇరాన్‌లోని నాటాంజ్ అణు స్థావరంపై ఇజ్రాయెల్ అమెరికా దాడులు చేసాయని ఇరాన్ ప్రతినిధి అంతర్జాతీయ అణుధార్మిక ఏజెన్సీకి ఫిర్యాదులుచేసారు. ఒక్కదెబ్బకే 48 మందిని ఖతంచేసామని ప్రకటించిన అమెరికా దాడులు మరోనాలుగు వారాలు కొనసాగుతాయని స్పష్టంచేసింది. ట్రంప్‌సైతం ఇదే నిర్ణయం ప్రకటించారు. దాడుల క్రమంలో ఇకపై అమెరికాతో చర్చలు లేవని ఇరాన్‌ప్రకటిం చింది. ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నివాసంపై దాడులుచేసామని ఇరాన్‌ప్రకటించినా ఇజ్రాయెల్ కొట్టివేసింది. అమెరికాకు చెందిన మూడు యుద్ధవిమానాలు కువైట్‌లో కుప్పకూలాయి. అమెరికా మాత్రం ఇవి ఫ్రెండ్లీఫైర్‌లో కూలిపోయాయని సమర్థించింది. ఇజ్రాయెల్ మిలిటరీ కూడా ఈజిప్టుపై దాడులు ముమ్మరంచేసింది. ఉత్తర, తూర్పు లెబనాన్‌లో జరిపిన వైమానిక దాడుల్లో హెజ్‌బొల్లా ఇంటెలిజెన్స్ కమాండర్ మహ్మద్‌రాడ్‌ను ఖతంచేసామని ఇజ్రాయెల్‌ప్రకటించింది. ఇదిలా ఉంటే శనివారం ఖమైనీ నివాసంపై జరిపిన దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఖమైనీ సతీమణి మన్సూ రేఖోజాస్తే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. 78 ఏళ్ల ఆమె అమరవీరుల హోదా పొందారని ఇరాన్ అదికారికంగాప్రకటించింది. ఇదిలా ఉంటే ఇరాన్ తాత్కాలిక సుప్రీం కమాండర్ అలీరెజాను కూడా అంతంచేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించినా ఇరాన్ మాత్రం ఈ వార్తను ధృవీకరించలేదు. ఇదిలా ఉంటే సౌదీలోని అతిపెద్ద చమురు రిఫైనరీ కేంద్రాలపై ఇరాన్ క్షిపణి దాడులుచేయడంతో రెండింటినీ మూసివేసారు. దీనితోప్రపంచ దేశాలకు చమురుసరఫరాలో తీవ్ర ఆటంకాలు ఎదురయ్యాయి. దీనికితోడు చమురురవాణాకు అత్యంత కీలకమైన హర్మోజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో చమురురవాణా మొత్తం స్తంభించిపోయింది.

**ఇరాన్ భీకర ప్రతిదాడులు**

తమ దేశంపై వైమానిక దాడులతో తమ సుప్రీం నేతను హతమార్చిన అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించిన ఇరాన్ తన దాడుల వ్యూహం కూడా మార్చింది. సుమారు పది గల్ఫ్‌దేశాల్లో ఏర్పాటుచేసిన అమెరికా స్థావరాలపై దాడులుచేసిన ఇరాన్ తాజాగా తన వ్యూహం మార్చి పౌరనివాసాలు, ఆకాశహర్మ్యాలను టార్గెట్‌చేసింది. పదిదేశాల్లోని ఎయిర్‌పోర్టులు కూడా ఈ దాడులతో మూసివేసారు. అత్యంత రద్దీ ఎయిర్‌పోర్టులు అయిన అబూదాబి, దుబాయి, దోహా ఎయిర్‌పోర్టుల్లో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. సుమారు 3400కిపైగా విమానాలు ఎక్కడికక్కడ నిలిచిపోయినట్లు గల్ఫ్‌దేశాలుప్రకటించాయి. గల్ఫ్‌దేశాల్లో అమెరికా స్థావరాలకు అనుమతించడంవల్లనే ఇరాన్‌పై దాడులుచేస్తోందని ఆరోపిస్తున్న ఇరాన్ దుబాయిలోని బుర్జ్‌ఖలీఫా సమీపంలో దాడులుచేయడంతో అత్యంత ఎత్తయిన ఈ ఖలీఫాను ఖాళీచేయిస్తున్నారు. అలాగే దుబాయి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుపైనా టార్గెట్‌గా దాడులుచేయడంతో సౌదీ ప్రభుత్వం తక్షణ చర్యలుచేపట్టింది. బహ్రెయిన్, ఖతార్, యుఎఇ, ఒమన్ వంటి దేశాల్లో ఉన్న వైమానిక స్థావరాలను కూడా ఇరాన్ టార్గెట్‌చేయడంతో ఆదేశాల్లో వణుకు బయలుదేరింది. కువైట్‌లోని అమెరికా ఎంబసీపైనా ఇరాన్ వైమానిక దాడులుచేసింది. అలాగే కువైట్‌లోనే మూడు అమెరికా యుద్ధవిమానాలను కూల్చివేసినట్లు ఐఆర్జీసీ ప్రకటిస్తే ఇది ఫ్రెండ్లీ ఫైర్‌లోనే కూలిపోయాయని అమెరికా సర్దుబాటుచేసుకుంది.



ఇజ్రాయెల్- అమెరికా బాంబు దాడులతో టెహ్రాన్‌లోని ఇళ్ల మధ్య ఏర్పడిన గొయ్యి

**మూడురోజుల్లో 555మంది ఇరానీయులు మృతి**

సోమవారం కూడా మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు అలాగే కొనసాగాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాలు సంయుక్తదాడులు కొనసాగుతుంటే అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్ యుద్ధం తాముప్రారంభించిందికాదని, కానీ ముగింపు మేమే ఇస్తామని ప్రకటించడం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ సైతం నాలుగు వారాల్లోనేయుద్ధం ముగించేస్తామనిప్రకటించడం చూస్తుంటే రానున్న రోజుల్లో మరింత భీకర దాడులుచేయవచ్చన్న అంచనాలు పెరిగాయి. మరోపక్క హెజబొల్లా ఇరాన్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై దాడులుచేస్తున్నదన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఇజ్రాయెల్ బీరూట్, లెబనాన్‌లోని తూర్పు ఇతర ప్రాంతాలపై భీకర దాడులు జరిపింది. లెబనాన్‌లోని ఖుద్స్ బ్రిగేడ్ టాప్‌కమాండర్‌ను అంతంచేసినట్లు ఇజ్రాయెల్‌ప్రకటించింది. అధమ్ అద్నన్ అల్‌ఒథ్‌మాన్ తమ దాడుల్లో హతమయ్యారని ప్రకటించింది. లెబనాన్‌లోని 70 హెజ్‌బొల్లా కేంద్రాలను టార్గెట్‌గా ఇజ్రాయెల్ దాడులుచేసింది. కాగా అబూదాబి, బహ్రెయిన్, ఖతార్ దేశాలు తాము ఇరాన్‌డ్రోన్లను అడ్డుకున్నామని, కొన్నింటినికూల్చివేసినట్లుప్రకటించినా ఇరాన్‌ప్రతీకార దాడులు మాత్రం భీకరంగానే ఉన్నాయి.

## ఆరుకు చేరిన కల్తీపాల మృతులు

### విషమంగానే పలువురి ఆరోగ్యం

### ఇప్పటికీ అధికారులకు అందని రిపోర్టులు

### రాజమండ్రి కల్తీ పాల ఘటనలో మరికొంతమంది ఇంకా వెంటిలేటర్ పైనే

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో మార్చి 2 ప్రభాతవార్త:** రాజమహేంద్రవరంలో జరిగిన కల్తీ పాలు ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. మృతుల సంఖ్య సోమవారం ఐదు నుండి 6గురికి చేరింది. దీంతో, 20 మంది కల్తీపాల బాధితుల్లో.. మరో 14 మంది ఇంకా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. ఈ కల్తీపాల వ్యవహారంలో ప్రభుత్వం సీరియస్ గా ఉండడంతో.. యంత్రాంగం బాధితుల వైద్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. వైద్య నిపుణులను రంగంలోకి దించడంతోపాటు, ఆధునిక వైద్య పరికరాలను కూడా ఇక్కడకు రప్పించారు. వారి పర్యవేక్షణలో వైద్య పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ వారందరినీ ఆరోగ్యవంతులుగా చేయడానికి తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. అయితే ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో వీరికి వైద్య సేవలు ఆరంభించే సమయానికి వాళ్ల పరిస్థితి విషమంగా ఉండడంతో.. కొందరు ఇప్పటికీ కోలుకోవడం లేదు. దీంతో వారి ఆరోగ్యంపై ఇప్పటికీ తీవ్ర ఉత్కంఠ కనిపిస్తూనే ఉంది. ముఖ్యంగా కల్తీ పాలు సేవించి అనారోగ్యం పాలైన వారి వైద్య పరీక్షల్లో రక్తంలో యూరియా సీరమ్ క్రియాటినిన్ స్థాయిలు పెరిగినట్లు వైద్యులు గుర్తించారు. మరో పక్క బాధ్యత కుటుంబాల్లో ఇప్పటికి ఆందోళన విషాదఛాయలు కొనసాగుతూనే ఉన్నాయి. 15 మంది బాధితులలో 11 మంది వెంటిలేటర్లపై ఉండే, డయాలసిస్ చికిత్స పొందుతున్నారు. మరో నలుగురు డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీరిలో సోమవారం వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్న బాధితుడు సత్యనారాయణ అనే వ్యక్తి మృతి చెందాడు. దీంతో.. మృతుల సంఖ్య ఆరుకు చేరింది. మిగిలిన వారికి యధాతధంగా వైద్య సేవలు కొనసాగుతున్నాయి.

## పురుగుల మందు తాగి ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

**కోవూరు (నెల్లూరు), మార్చి 2, ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు గ్రామంలో సోమవారం విషాద చాయలు చోటు చేసుకున్నాయి. ఈ గ్రామానికి చెందిన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పాటూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు పవన్‌సాయి(19) గంగవరం గ్రామంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున పవన్‌సాయి తన ఇంటిలోనే గడ్డిమందు సేవించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

03-03Pg3exHMNWJQEPC 3 OV_03-03Pg3exHMNWJQEPC.qxd 02/Mar/26 11:14 PM Page 1





## సిఎంఒ ఎక్స్ అఫిషియో స్పెషల్ సిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.విజయానంద్

**విజయవాడ,మార్చి2,ప్రభాతవార్తప్రతినిధి:**సియంఒ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కె.విజయానంద్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఫిబ్రవరి 28న సిఎస్‌గా పదవీ విరమణ చేసిన విజయానంద్‌ను ప్రభుత్వం ముఖ్య మంత్రి వర్యుల ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో సోమవారం రాష్ట్ర సచివాలయం మొదటి భవనంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం మరియు టిటిడి వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు అనంతరం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు విజయానంద్ కు తదితరులు విజయానంద్ కు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు చర్యలు

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయవాడ,మార్చి2,ప్రభాతవార్తప్రతినిధి:** గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ ఎన్ఆర్ఐ సాధికారిత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఏపీ ఎన్నార్టీ కో ఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని కోరారు. సోమవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. ఇజ్రాయిల్ ఇరాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం కారణంగా, గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయని చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారి క్షేమం కోసం నిరంతరం తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పుకొచ్చారు. వారిని తిరిగి రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఆయా దేశాల్లో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా కొన్ని విమానాశ్రయాల్లోని ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, తాము ఎప్పటికప్పుడూ పరిస్థితులను పర్యవేక్షి స్తున్నా మని అన్నారు. ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్నార్టీ) ద్వారా ఇబ్బందుల్లో ఉన్న ప్రవాసాంధ్రులకు అవసరమైన సహాయం చేసేందుకు గానూ చర్యలు చేపడుతున్నామని వివరించారు. గల్ఫ్ దేశాల్లోని ఏపీ ఎన్నార్టీ కోఆర్డినేటర్లను అప్రమత్తం చేసి, స్థానికంగా ఉన్న తెలుగు కుటుంబాల సహకారం తీసుకోవాలని సూచించారు. వారి ద్వారా తాత్కాలిక వసతి, భద్రత, అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఏపీ ఎన్నార్టీ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని మానిటర్ చేస్తూ, కోఆర్డినేటర్లతో సంప్రదింపులు జరుపుతున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వివరించారు. స్థానికంగా ఉన్న ఇండియన్ ఎంబసీ సేవలను, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించు కోవాలని సూచించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు తమ వివరాలను ఏపీ ఎన్నార్టీఎస్ 24/7 హెల్ప్‌లైన్ 0863 2340678, వాట్సాప్: +91 85000 27678 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. వీటితో పాటు ఈ మెయిల్ అత్య వసర పరిస్థితుల్లో ఉన్న వారు వెంటనే సంప్రదించి స హాయం పొందాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ఇరాన్ యుద్ధంతో కోనసీమ జిల్లా వాసుల్లో తీవ్ర ఆందోళన చేపట్టారు. గల్ఫ్ దేశాల్లో సుమారు 2 లక్షల మంది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వాసులు ఉపాధి పొందు తు న్నారు. వారిలో సఖినేటిపల్లి, మలికిపురం, రాజో లు, అల్లవరం, ఉప్పలగుప్తం, కమలాపురం వాసు లు ఉన్నారు. అక్కడ యుద్ధవాతావరణం నెలకొన డంతో స్థానికంగా తీవ్ర ఆందోళన చెందు తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు తమ వాళ్లకు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

# రాజధాని నిర్మాణ పనులు ఆలస్యం - కాంట్రాక్టు సంస్థలపై మంత్రి నారాయణ ఆగ్రహం

**విజయవాడ,మార్చి2,ప్రభాతవార్తప్రతినిధి:**రాజధాని నిర్మాణ పనులు ఆలస్యం చేస్తున్నారంటూ కాంట్రాక్టు సంస్థలపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో పర్యటించిన అయన నేలపాడులో నిర్మిస్తున్న గెజిటెడ్ అధికారుల క్వార్టర్స్, గ్రూపు డి ఉద్యోగుల క్వార్టర్స్ తో పాటు వివిధ నిర్మాణాలు పరిశీలించారు. పని చేయలేకపోతే వెళ్లిపోవాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులపై అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుండా షాపూర్ జీ పల్లోంజీ కన్స్ట్రక్షన్ నిర్మాణ సంస్థకు చెందిన ఇద్దరు ప్రతినిధులను పంపించేయాలని మంత్రి నారాయణ ఆదేశించారు. సంస్థ యాజమాన్యం సీఎం చంద్రబాబుకు పనుల ఆలస్యంపై సంజాయిషీ ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పుడు అందుకు తగ్గట్టు నిర్మాణ సంస్థలు పని చేయాలని తెలిపారు. అలా పనులు చేయకుంటే ప్రభుత్వపరంగా గట్టిగా అడిగి తీరుతామని వివరించారు. వైఎస్సార్సీపీ అమరావతిపై చేసే విమర్శలు అర్ధరహితమన్న మంత్రి నారాయణ, నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితిల్లో లేరని ఎద్దేవా చేశారు. ఉద్యోగులకు నిర్మిస్తున్న 4,026 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టామని, గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడకుండా ఉంటే ఈ పాటికి అన్నీ అందుబాటులోకి వచ్చేవని విమర్శించారు.గత 3 నెలలో రాజధానిలో నిర్మాణం పనులు వేగం పుంజుకున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. ఏపీ రాజధాని అమరా వతిలో ఏపీ జ్యుడీషియల్ అకాడమీ కార్యాలయ నిర్మాణ పనులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేతులమీదుగా శంకుస్థాపన జరిగింది. ప్రస్తుతం హైకోర్టుకు సమీపంలో నిర్మించనున్న ఏపీ హైకోర్టు అతిథి గృహం, క్లబ్ భవనాల నిర్మాణాలకు సైతం శంకుస్థాపన చేశారు. రాబోయే 3 ఏళ్లలో పరిపాలనకు సంబంధించిన భవనాలు అందుబాటులోకి తెస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. రహదారులు పనులు 3 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి అన్నారు. ఈసారి వర్షాకాలంలో నిర్మాణ పనులకు ఇబ్బంది లేకుండా భూగర్భ పనులను ముందుగానే పూర్తి చేస్తామని నారాయణ స్పష్టం చేశారు.



నేలపాడులో నిర్మిస్తున్న వివిధ నిర్మాణాలు పరిశీలించిన మంత్రి నారాయణ

# రేపు ఎస్పీడిసిఎల్ జాబ్ మేళా..

### - సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి,మార్చి 2ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో 4వ తేదీ బుధవారం(రేపు) జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సోమవారం తెలిపారు.ఎస్పిడిసిఎల్ పరిధిలో పొరుగుసేవల కింద ఉద్యోగాల కోసం అభ్యర్థుల ఒత్తిడి ఎక్కువగా వున్న నేపథ్యంలో వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ నియామకాలకై ఎస్పీడీసీఎల్ అభ్యర్థన మేరకు రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఉద్యోగ నియామక ప్రక్రియను చేపట్టేందుకు ముందుకు వచ్చిందన్నారు. తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో రేపు ఉదయం 8:30 గంటల నుండి జరిగే జాబ్ మేళాలో వివిధ ప్రైవేటు సంస్థల ప్రతినిధులతో అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించి, అభ్యర్థులను ఎంపిక చేసుకోవడం జరుగుతుందన్నారు. 10వ తరగతి, ఐటిఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ/బి.టెక్., పాసైన అభ్యర్థులు ఈ ముఖాముఖికి హాజరై కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందవచ్చన్నారు.



## ఆటోనగర్‌లో అగ్నిప్రమాదం

### - రూ. 10 లక్షల ఆస్తి నష్టం

**నెల్లూరు క్రైమ్, మార్చి 2, ప్రభాతవార్త:** నగరంలోని ఆటోనగర్‌లో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే. రంగనాయకుల పేటకు చెందిన పఠాన్ అక్బర్ ఖాన్ ఆటో నగర్ ఫేజ్ 1లో ప్లాస్టిక్ చెత్త దుకాణం నిర్వహిస్తుంటాడు. సోమవారం తెల్లవారుజామున దుకాణంలో మంటలు చెలరేగాయి. మంటలు చూసిన చుట్టు పక్కల వారు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ వాకా శ్రీనివాసరెడ్డి, వేదయపాలెం పోలీస్ స్టేషన్ సిఐ కే శ్రీనివాసరావు సంఘటనా స్థలా నికి చేరుకుని ప్రమాద నివారణ చర్యలను పర్య వేక్షించారు. ఆకుతాయిలు సిగరెట్ తాగి విసిరి వేయడంతో ఈ ప్రమాదం జరిగినట్లు అధి కారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ ప్రమాదంలో రూ. 10 లక్షల విలువ చేసే ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొ న్నారు.

## త్వరలో బిసిల భారీ సదస్సు

**విజయవాడ, మార్చి 2, ప్రభాతవార్త :** బీసీల ప్రధాన డిమాండ్లపై ఉద్యమ కార్యాచరణను రూపొందించేందుకు, త్వరలో రాష్ట్రస్థాయి భారీ సదస్సు ను విజయవాడలో నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. సోమవారం విజయవాడ టిక్కెల్ రోడ్డులోని ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా బీసీల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పలు విజ్ఞాపనలిచ్చామని, బీసీ విద్యార్థుల, నిరుద్యోగుల, వివిధ కుల సంఘాల కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజలందరి సంక్షేమంఅభివృద్ధి కోరుతూ అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించామని, రాష్ట్రస్థాయిలో 50 ఏళ్లు నిండిన బీసీలందరికీ వృద్ధాప్య పెన్షన్, ప్రత్యేక రక్షణ చట్టం నుండి కేంద్ర లో ప్రత్యేక మంత్రిత్వ శాఖబీసీ సబ్ ప్లాన్ మేరకు బడ్జెట్లో నిధుల కేటాయింపులతో పాటు స్థానిక సంస్థల నుండి చట్టసభల వరకు బీసీలకు రిజర్వేషన్లు జనాభా దామాషా మేరకు కేటాయించాలన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం

### - సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి,మార్చి 2ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ఎస్పీడీసీఎల్ కృషి చేస్తుందని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 56 వినతులు అందినట్లు తెలిపారు. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యతనివ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, ఆర్. పద్మ, కె. ఆదిశేషయ్య, ఎం. ఉమాపతి, యం. మురళీ కుమార్, యం. కృష్ణా రెడ్డి, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, జనరల్ మేనేజర్లు చక్రపాణి, సురేంద్రరావు, భాస్కర్ రెడ్డి, లత పాల్గొన్నారు.

# బాణాసంచా పేలుడులో 25కు చేరిన మృతులు

## ముగ్గురు పరిస్థితి ఇంకా విషమం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మార్చి2 (ప్రభాతవార్త):** వేట్లపాలెం బాణాసంచా పేలుడు ప్రమాదంలో మృతులు సంఖ్య 25 కు చేరింది. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఇటువంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా భద్రతా చర్యలు చేపడుతుందని సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రులతో కలిసి బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మృతి చెందిన బాధితుల కుటుంబాలకు బాణాసంచా పేలుడు లో 25కు చేరిన మృతులు.... ముగ్గురు పరిస్థితి విషమం, వేట్లపాలెం బాణాసంచా పేలుడు ప్రమాదంలో మృతులు సంఖ్య 25 కు చేరింది. విషాదంతో నిండిన కుమ్మర వీధి.. సంఘటనా ప్రదేశంలో ఇద్దరు సజీవదహనం చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతి ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి పట్టణ పరిధిలో కుమ్మరవీదిలో ఎంఆర్‌పీఎస్‌కు చెందిన మాదిగలు ఎక్కువగా నివాసం ఉంటారు. ఆ ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు ఏ రోజు కూలి పని ఆ రోజు చేసు కొంటూ జీవనం గడుపుతారు. ఈ మేరకు వారికి తెలిసిన విద్య బాణా సంచాతయారీ కావడంతో వేట్లపాలెంలోని సూర్యశ్రీ ఫైర్ వర్క్స్‌లో పని చేయడానికి వెళ్లిన కుమ్మర వీదికి చెందిన నలుగురు మృతి చెందడం, ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో ఆ ప్రాంతం విషాదంలో మునిగి పొయింది. కుటుంబ సభ్యులు, బంధువుల ఆర్తనాదాలతో స్థానికుల హృదయాలను కదలించి వేసింది. శనివారం జరిగిన సంఘటనలో బాణా సంచా ప్రదేశంలో కుమ్మర వీధికి చెందిన దర్శిపాటి నాని, ఏడిద శ్యామ్‌కుమార్‌లు సజీవ దహనం అయిన విషయం తెలిసిందే. కాగ ఆదివారం ఉదయం అదే ప్రాంతానికి చెందిన దర్శిపాటి లోవరాజు, దర్శిపాటి రాజులు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. దర్శిపాటి రాజు మృత దేహం సోమవారం మహాప్రస్థానం వాహనంలో తీసుకు రాగ ఒక్కసారిగా కుటుంబ సభ్యులు గుండెలు బాదుకొంటూ చేసిన రోధనలతో ఆ ప్రాంతం అర్త నాదాలతో హోరెత్తింది. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఇటువంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా భద్రతా చర్యలు చేపడుతుందని సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రులతో కలిసి బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మృతి చెందిన బాధితుల కుటుంబాలకు మట్టి సహాయం నిమిత్తం రూ. 25 వేలు ఖననం ఖర్చులకు ప్రభుత్వం సాయం అందించింది.

వేట్లపాలెం లో మృతి చెందిన దళితులందరి మృతదేహాలను శివాలయం రోడ్ వద్ద సామూహికంగా ఖననం చేశారు.

## ఈతకెళ్లి యువకుడు మృతి

**దగదర్తి (నెల్లూరు), మార్చి 2, ప్రభాతవార్త :** చెరువులో ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన దగదర్తి మండలం సున్నపుబట్టి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. యశ్వంత్ ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి సున్నపుబట్టి చెరువులో ఈతకు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం రోజు ఎంత గాలించిన యశ్వంత్ జాడ తెలియలేదు. సోమవారం రోజు దగదర్తి పోలీసులు రిస్కోటీం సున్నపుబట్టి యువకుల సాయంతో సాయంత్రం 3గంటల సమయంలో యువకుడు మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. సున్నంబట్టి గ్రామ ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు బెల్లంకొండ సీనమ్మకు ఇద్దరు కుమారులు. ఆమె పెద్ద కుమారుడైన యశ్వంత్(19) డిగ్రీ చదువుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆదివారం స్నేహితులతో కలిసి చెవరుకు ఈతకు వెళ్లాడని, చెరువులో దిగిన స్నేహితులు తిరిగి ఒడ్డుకు చేరారని యశ్వంత్ తిరిగి రాలేదని స్నేహితులు గ్రామంలోకి వచ్చి వారి బంధువులకి చెప్పడంతో,

వారు వెళ్లి గాలించిన యశ్వంత్ జాడ తెలియలేదని చివరికి యశ్వంత్ మృతదేహం కనిపించిందని తెలిపారు.

యశ్వంత్ మృతదేహాన్ని పోస్టుమార్టంకై నెల్లూరు జీహెచ్‌సీకి పంపించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపని కుమార్ తెలియజేశారు.

# తిరుమల సమాచారం

## నేడే సంపూర్ణ చంద్రగ్రహణం!

### - నేడు తిరుమల ఆలయం మూత - ఉదయం 9గంటల నుండి సాయంత్రం 7.30గంటల వరకు దర్శనాలు నిలుపుదల



**తిరుమల,మార్చి 2ప్రభాతవార్తప్రతినిధి:** సంపూర్ణచంద్రగ్రహణం కారణంగా నేడు మంగళవారం ఉదయం 10.30గంటలు పాటు తిరుమలేశుని ఆలయాన్ని మూసి వేస్తున్నారు. నేటి సాయంత్రం 3.20 గంటల గంటలకు గ్రహణం ప్రారంభమై సాయంత్రం 6.47గంటలకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణ సమయానికి ఆరుగంటలు ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. మంగళవారం ఉదయం చంద్రగ్రహణం ప్రభావంతో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 7.30గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేసి అన్ని దర్శనాలను రద్దుచేశారు. సాయంత్రం 7.30గంటలకు ఆలయం తలుపులు తెరచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 8.30గంటలకు శ్రీవారి భక్తులకు స్వామివారి దర్శనం పున:ప్రారంభమవుతుంది. ఆరోజు ఆలయంలో జరగాల్సిన అష్టదళపాదపద్మా రాధనసేవ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది. అలాగే తిరుపతిలోని స్థానిక ఆలయాలను కూడా పూర్తిగా మూసివేసి భక్తులకు దర్శనాలు రద్దుచేశారు.

## తెప్పపై మలయప్పస్వామి అభయం



**తిరుమల,మార్చి 2ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో పవిత్ర మైన పుష్కరిణిలో జరుగుతున్న శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. చివరగా ఐదవరోజు సోమ వారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామివారు తెప్పపై భక్తులకు అభయమిచ్చారు. అంతకు ముందు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు ఉత్సవమూర్తులు ఆశీనులై పుష్కరిణిలో ఏడుచుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల వేదపారాయణం, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తనల మధ్య తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ తెప్పోత్సవంలో పెద్దజీయర్‌స్వామి,,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

## భక్తులకు చక్కటి దర్శనం అద్భుతం

### - స్వామివారి ప్రసాదాలు నాణ్యత బావుంది - పలువురు సినీప్రముఖులు



**తిరుమల,మార్చి 2ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో తీసుకున్న మార్పులతో ప్రముఖులేగాక సామాన్యభక్తులు కూడా చక్కటి దర్శనం చేసుకుని ఆ దేవదేవుడ్ని తనివితీరా వీక్షిస్తున్నారని పలువురు సినీప్రముఖులు తెలిపారు. మరింతగా త్వరిగతిన దేవుడి దర్శనం చేసుకునేలా చూస్తుండటంతో టిటిడి అధికారులు ప్లానింగ్‌తో పనిచేస్తున్నారని అర్థమవుతుందన్నారు. భక్తులందరికీ సంతోష దర్శనం చేయించడం, స్వామివారి అన్నప్రసాదాల నాణ్యత బావుందన్నారు. అందరికీ ప్రసాదాలు పంపిణీ చేసి ఆ దేవుని అనుగ్రహం కలిగిస్తుండటం ఆనందంగా ఉందని విశ్వాసం వెలిబుచ్చారు. స్వామివారి అనుగ్రహంతోనే అంతా మంచి జరుగుతుందని ఆకాంక్షించారు. సోమవారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో కర్నాటక మంత్రి దినేశ్‌గుండూరావు, ఎంపీ అంబికా జి లక్ష్మీ ్మనారాయణ,క్రికెటర్ వెంకటేష్ అయ్యర్,చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను,సినీనటి జెనీలియా,నటుడు శ్రీవిష్ణు తదితరులు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అదికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఫిబ్రవరి నెల హుండీ ఆదాయం రూ. 107కోట్లు

**తిరుమల,మార్చి 2ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణంగానే పిబ్రవరి నెలకు 28రోజులు కావున ఏడుకొండల స్వామి హుండీ ఆదాయంపై కూడా తగ్గుదలరోజుల ప్రభావం చూపుతుంది. పిబ్రవరి నెలలో కానుకల ద్వారా హుండీ ఆదాయం 107.36కోట్లు రూపాయలు లభించింది. నూతన ఏడాది ఆరంభంలోనూ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్యను గమనిస్తే గణాంకాలు మాత్రం భక్తుల సంఖ్యతోబాటు వెంకన్న హుండీ ఆదాయం కూడా పెరిగింది. భక్తులు తమతమ మొక్కుబడుల్లో భాగంగా హుండీకి సమర్పించిన కానుకలు మొక్కుబడుల రూపంలో హుండీలో సమర్పించిన ఆదాయం 107.36 కోట్ల రూపాయలు చేకూరింది. వెంకన్నను దర్శనం చేసుకున్న భక్తుల సంఖ్య 20,04,968 మంది .భక్తులకు సత్వర సంతోషదర్శనాలు చేయించడంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ,ఆలయ అదికారులు ఎఐ అమలుచేస్తూన్నారు. పిబ్రవరిలో వరుసగా 23వతేదీ 4.66కోట్లు, 1న 4.57కోట్లు, 17న 4.20కోట్లు, 16న 4.42కోట్లు, 25న 4.48కోట్లు, 26న 4.21కోట్లు, 10న 4.23కోట్లు, 11న 4.31కోట్లు 27న 4.1కోట్లు ఆదాయం హుండీకి చేకూరింది. మిగిలిన రోజుల్లో సరాసరి 3.50కోట్ల రూపాయల నుండి 3.90కోట్ల రూపాయలవరకు కానుకల రూపంలో ఆదాయంలభించింది. ఇక భక్తులు కూడా సరాసరి రోజువారీగా 70వేలనుండి 80వేలమంది వరకు తిరుమలకుచేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు.

# 40కిలోల గంజాయి స్వాధీనం

### - 8మంది అరెస్ట్ : డిఎస్పీ పార్ధసారథి - ఒడిశా నుంచి కేరళకు తరలింపు - నిందితులు పశ్చిమబెంగాల్ వాసులు !



గంజాయితో పట్టుబడిన నిందితుల అరెస్ట్ చూపుతున్న డిఎస్పీ

**కుప్పం, మార్చి 2 ప్రభాతవార్త** :ఒడిషా రాష్ట్రం నుంచి కేరళకు అక్రమంగా తరలిస్తున్న నలభై కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎనిమంది అంతరాష్ట్ర నిందితులను అరెస్ట్ చేసినట్లు కుప్పం డిఎస్పీ పార్ధసారథి తెలిపారు. సోమవారం స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో అర్బన్ సిఐ శంకరయ్యతో కలసి వివరాలను ఆయన వెల్లడించారు. ముందస్తుగా రాబడిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాలతో ఆపరేషన్ వజ్ర పహార్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఫ్లైఓవర్ వంతెన వద్ద సోమవారం కుప్పం అర్బన్ సిఐ శంకరయ య్, ఎస్సై బాబు సిబ్బందితో కలసి విస్తృత తనిఖీలను చేపట్టారన్నారు. ఈ సమయంలో ఎనిమంది యువకులు అనుమానాస్పద రీతిలో ఉండగా వారిని అదుపులో తీసుకుని వారి వద్ద ఉన్న నలభై కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన నిందితులు పశ్చిమబంగా (పశ్చిమబెంగాల్) రాష్ట్రం ముర్షియాబాద్ జిల్లాకు చెందిన హాసిబుల్ (23), నామిజుల్ (20), సౌమిక్ మండల్ (23), సుమన్ దాస్ (20), హానినూర్ సమాన్ (31), ముత్తకిమ్ మాలిత (23), కిరణ్ మండల్ (27), మోజమ్ మండల్ (54)లు ఉన్నారన్నారు. ఒడిషా నుంచి కేరళకు తరలిస్తూ : నిందితులు గంజాయిని ఒడిషా రాష్ట్రం కటక్ ప్రాంతం నుంచి కేరళకు తరలించేవారని డిఎస్పీ తెలిపారు. వీరు హౌరా ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి జోలార్‌పేట మీదుగా కేరళ వెళ్లేవారన్నారు. తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అక్కడ పోలీసుల తనిఖీలు విస్తృతంగా ఉండడంతో నిందితులు కుప్పంలో రైలు దిగి కేరళ వెళ్లాలని ప్లాన్ వేశారని తెలిపారు.

వార్త

మనం తలపెట్టిన కార్యం మంచిదనే నమ్మకం మనకున్నప్పుడు, అవాంతరాలెన్ని ఎదురైనప్పటికీ పట్టించుకోరాదు.

-ఫిలిప్‌మాసింగర్

# మింటికెగసిన యుద్ధజ్వాల!

పశ్చిమాసియాలో యుద్ధం అత్యంత భీకర స్థాయికి చేరుకుంది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా ఇరాన్‌పై జరిపిన భారీ వైమానిక దాడుల్లో ఆ దేశ సుప్రీం లీడర్‌అయతొల్లా అలీ ఖమేనీ మరణించారు. ఆ విషయం తెలిసి అనేక దేశాల్లో జనం ప్రతీకార దాడులకు తెగబడ్డారు.నిరసనలకు దిగారు. సామ్రాజ్యవాదానికి అమెరికా మరోపేరన్నది చరిత్ర చెబుతోంది.కానీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీ పగ్గాలు చేపట్టాక అనేక సందర్భాల్లో ఆయన తెంపరితనాన్ని చూపించారు. తాజాగా ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తోందన్న మిషపై ఇజ్రాయిల్ తరపున ఇరాన్ పై యుద్ధం ప్రకటించింది. అంటే ఇజ్రాయెల్ అపనమ్మకం ఇరాన్ కొంప ముంచింది. ఇరాన్ బలపడితే చమురు వాణిజ్యానికి అడ్డంకులు ఏర్పడతాయన్న ఇజ్రాయెల్ ఆందోళన వల్లే అమెరికా తక్షణమే ఇరాన్ పై యుద్ధజ్వాలను రగిల్చింది. ఇజ్రాయెల్ అమెరికాకు నమ్మిన బంటు. అత్యంత ఆప్తమిత్రత్వం ఉంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు చెప్పాడంటే ట్రంప్ 'ఊ' కొట్టాల్సిందే. ట్రంప్ ఆదేశిస్తే నెతన్యాహు జీ హుజూర్ అనాల్సిందే. అదే స్నేహం ఇప్పుడు ఇరాన్ పైకి పురికొల్పడానికి కారణమైంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోఇరాన్ సుప్రీమ్ లీడర్ ఖమేని 48 మంది సైనికాధికారులతో ఉండగా ముమ్మర దాడులు చేసిమట్టుబెట్టారు. అమెరికా, ఇజ్రాయిల్‌లకు ఇరాన్ వార్నింగ్ ఇవ్వగానే ఇరాన్ నుంచి ప్రతీకార దాడులను సహించబోమని అమెరికా సైన్యం,క్షిపణులు, డ్రోన్లతో తీవ్ర దాడులు మొదలెట్టింది. పైగా ఇరాన్ ప్రజల స్వేచ్ఛ కోసం తాను ఏమైనా చేస్తానని ట్రంప్ ఇరాన్ ప్రజలకు సందేశమిచ్చారు. ఇరాన్‌లో ఉగ్రవాదాన్ని వ్యాపింప చేసిన ఖమేని లేని ఈతరుణంలో తమ భవిష్యత్‌ను ఉజ్వలం చేసుకోవాలని ఇజ్రాయెల్ దేశాధ్యక్షుడు నెతన్యాహు ఇరాన్ ప్రజలను కోరారు. ఖమేని హయాంలో దాదాపు 12 వేల మంది ఇరానీయలను ఊచకోతకోశారని అంతర్జాతీయ సంస్థల అంచనా.ఆయన మరణాన్ని జీర్ణించుకోలేని హమాస్, హౌతీలు, హెజ్బొల్లాలు పలు దేశాల్లో నిరసన దాడులకు దిగాయి.ఇజ్రాయెల్ తో పాటు అనేక గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ప్రతీకారదాడులతో పేలుళ్లతో ఆయా దేశాల్లోని ముఖ్యమైన ప్రాంతాల్లో మంటలు మిన్నంటాయి. అమెరికా ఆస్తులు కలిగివున్న అన్ని అరబ్ దేశాల్లోనూ ఇరాన్ ఆర్మీ క్షిపణుల్తో దాడిచేస్తోంది. బ్రిటిష్ మిలిటరీ స్థావరాలను కూడా వదిలిపెట్టలేదు.ఇక్కడ విశేషంగా చెప్పుకోదగినవి ఏమిటంటే ఇరాన్ పైవ్యూహాత్మక దాడులకు అమెరికా ఆంత్రోపిక్ కృత్రిమ మేధను వినియోగించుకోవడం. అమెరికా దాడులు జరిపే తేదీని ఏఐ చాట్ 'గ్రోక్' ముందుగానే పసికట్టిన తేదీనే ఈ దాడులు జరగడం.నిత్యం బాంబుల మోతలతో దద్దరిల్లుతున్న ఆయా దేశాలలోభారతీయులతో సహా ఇతర దేశాల వారు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇరాన్లో రాజకీయ అనిశ్చితి తొలగించడం కోసం తాత్కాలిక సుప్రీమ్ లీడర్‌గా ఆలీ రెజా అరాఫీని నియమించుకొన్నారు.ఆయన మతాధికార వ్యవస్థలో అత్యంత సీనియర్. కొత్త పాలక వర్గంతో 'రాజీ' చర్చలకు తాను సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ ప్రకటించారు. అయితే అందుకు ఇరాన్ నేతల ప్రతిస్పందన అవసరం.ఇరాన్‌పై ఈ దాడులు శాంతిస్థాపన కోసమేనని, అవసరమైనంత కాలం ఈ బాంబు దాడులు కొనసాగుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.కాగా తాము తమ సుప్రీమ్ లీడర్ ఖమైనీను చంపినందుకు నిరసనగా ప్రతీకార దాడులు చేపట్టామని ఇరాన్ నేతలు చెబుతున్నారు.ఈ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై వందలాది క్షిపణులను ప్రయోగించింది. బహ్రెయిన్, కతార్ వంటి దేశాల్లోని అమెరికా సైనికస్థావరాలను కూడాఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. ఈపరిణామాలపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసరంగా సమావేశమైంది. దాడులను వెంటనే ఆపి, వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సమితి ప్రధాన కార్యదర్శి దేశాలకు విజ్ఞప్తి చేశారు.రష్యా, చైనాదేశాలు అమెరికా ప్రవాస భారతీయుల భద్రత కోసం భారత్‌లోని అన్ని ప్రభుత్వాలు కేంద్రం ఆయా ప్రాంతాల ప్రభుత్వాలను సమాయత్తపరిచింది. కుట్రపూరిత విధానాలను అవలంబిస్తోందని వ్యాఖ్యానించాయి. యుద్ధం కారణంగా పశ్చిమాసియా దేశాల్లో గగనతలం పూర్తి స్థాయిలోమూసివేసారు.విమాన సర్వీసులన్నీ నిలిచిపోవడంతో భారతీయులతోసహా వేలాదిమందిప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. దాదాపు లక్షల మంది ట్యాన్సిట్ వీసామీద వెళ్లిన వారు విమానాశ్రయాల్లో చిక్కుపోయారు. ప్రస్తుతం 8 అరబ్ దేశాల మీద ఇరాన్ ప్రతీకార దాడులను ముమ్మరం చేసింది. అక్కడే కనీసం కోటిమంది ప్రవాసులు ఉన్నారు. వారి పరిస్థితి ఏమిటో సమాచారంలేక వారి కుటుంబాల వారు ఆందోళనలో ఉన్నారు. కొందరైతే బంకర్‌లలో దాక్కున్నారన్న సమాచారం ఉంది. యుద్ధమేఘాలు తొలగితే తప్ప వారు బయటపడే పరిస్థితి లేదు. ఈ యుద్ధ వాతావరణం నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌లో ఇస్లామిక్ రిపబ్లిక్ శకం ముగిసినం దున తాను అక్కడ అధికార మార్పిడి బాధ్యతలు తీసు కునేందుకు ఇరాన్ మాజీ యువరాజు రెజా పహ్లవీ సిద్ధమోతున్నారు. ఇన్నాళ్ళూ ఇస్లామిక్ నిబంధనల మేరకు జరిగిన మతపరమైన పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిజంగా అక్కడ ప్రజాస్వామ్యం పరిఢవిల్లితే మంచిదే!

నేరస్తులను శిక్షించుటే ప్రధానం కాదు. నేరం చేయడానికి ఏ పరిస్థితులు పురికొల్పుతున్నాయో వాటిని తొలగించడం ముఖ్యం.



ఆల్బర్ట్‌కామూ

ప్రపంచం తాలూకు రహస్యాల్ని అర్థం చేసుకోవాలంటే దీర్ఘకాలం పాటు శిక్షణాభ్యసనం సాగించాలి.



అలివర్ గోల్డ్‌స్మిత్

# ప్రజావాక్కు



### మందుల ధరలు తగ్గించాలి

రోగం మనిషిని శారీరకంగా మాత్రమే కాకుండా ఆర్థికంగా కూడా దెబ్బతీస్తుంది. ఆ బలహీనతనే లాభంగా మార్చుకునే వ్యవస్థలు ఉన్నంతకాలంఆరోగ్యంఅనే భావన మాటలకే పరిమితం అవుతుంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఔషధ వ్యాపారంలో అక్రమ లాభాల వ్యవహారం కొన్ని మందులపై వెయ్యి ఎనిమిదివందల శాతం వరకు లాభం వసూలు చేస్తున్నారన్న వాస్తవం మన ఆరోగ్య వ్యవస్థలోని దోపిడీని బయటపెట్టింది.ఔషధ ధరల నియంత్రణకు చట్టాలు ఉన్నప్పటికీ అవి ప్రజల రక్షణకు సరిపడేలా అమలవడం లేదు. ధరలనియంత్రణ, లాభాల పరిమితి, పంపిణీ పర్యవేక్షణ అన్నీకాగితాలకే పరిమితమయ్యాయి. తయారీదారుడి నుంచి చిల్లర విక్రేత వరకు ప్రతి దశలో లాభాలు పెంచుకుంటూ చివరికి రోగి జేబుపై భారాన్ని మోపుతున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### లిక్కర్ కేస్ ఉదంతం

దేశంలో ప్రబల విపక్షాలుగా ఉన్నవి మూడు పార్టీలు. ఒకటిఆమ్ ఆద్మీపార్టీ రెండు భారత రాష్ట్ర సమితి మూడు ద్రావిడ మున్నేట కజగం.అయితే తమిళనాడును గవర్నర్ వ్యవస్థ ద్వారా అధిమి పట్టాలి అని ఢిల్లీ లో కేజ్రీవాల్‌ను లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కావొచ్చు లేక ఢిల్లీ మద్యం పాలసీ ద్వారాకావొచ్చు. అలాగే చంద్రశేఖర్ రావు బిడ్డను అరెస్ట్ చేయడం ద్వారామానసిక అశాంతిని కలుగజేయాలి అని చూసి చివరికి కోర్ట్ ఇది కక్ష పూరితమైన కేసు అని చెప్పి సిబీఐ స్వాతంత్రతను దెబ్బ తీసేలా వ్యవహరిస్తూ ఉన్నది అని కోర్ట్‌జడ్జి జీతేంద్ర అనేదాకా వెళ్లిందంటే స్వతంత్ర సంస్థలను ప్రభుత్వం ఏవిధంగా వాడుకున్నదో అర్థం అవుతున్నది.

-భారత అవినాష్, జనగామా

### ఆయుర్వేద వైద్యంపై దృష్టి

మనదేశంలో 95శాతం వ్యక్తులు అల్లోపతి వైద్యంపైనే ఆధారపడ్డారు. ఈ వైద్య విస్తృత పరిశోధన పరిస్థితులకు కారణంగా మారింది.ఇటీవల జాతీయ స్థాయిలో సంప్రదాయ వైద్యం కూడా అందుబాటులోకి వచ్చి ప్రత్యామ్నాయ ఎంపికకు వైద్యశాలలు,మందులు వగైరాఏర్పాటు నిమిత్తం దృష్టిసారించారు. మన ప్రాచీన ఆయుర్వేద వైద్యం తక్కువ ఖర్చుతో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

- బి. రమేష్‌బాబు, నల్గొండ

### భవిష్యత్తుకు ప్రమాదం

భారత ఐటీ రంగం ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నా, వీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచవలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈపరిస్థితుల్లో,స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. భారతీయ యువత, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులు, తమ ప్రతిభను ప్రదర్శించి స్థానిక స్థాయిలో స్టార్ట్ అప్స్‌ను స్థాపిస్తే, దేశీయ ఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు, గ్లోబల్ టెక్ రంగంలో మనస్థానం మరింత బలపడుతుంది. ఇది నిజమైన డిజిటల్ స్వావలంబనకు దారి తీస్తుంది. భారతదేశంలో శాస్త్రం, సాంకేతికం, ఇంజినీరింగ్, గణితశాస్త్రం రంగాలలో విస్తారమైన ప్రతిభ ఉంది. ఈ ప్రతిభను సరైన మార్గంలో వినియోగిస్తే, మన దేశం సేవల కేంద్రం నుండి ఆవిష్కరణల కేంద్రంగా మారగలదు.

- ఎన్. నారాయణ, నల్గొండ

### సమ్మర్ క్యాంపుల నిర్వహణ చేపట్టాలి

గురుకుల సంస్థ గత సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయినా విద్యార్థులకు జిల్లా కేంద్రాలలో స్పెషల్ క్యాంపులు నిర్వహించడం జరిగింది. ఈ సంవత్సరం కూడా నిర్వహించడం అవసరం. గత సంవత్సరం పని చేసిన లెక్చరర్‌లకు ఈ సంవత్సరం కూడా అవకాశం ఇవ్వాలి. ఈ సారి క్యాంపుకు లెక్చరర్‌ల గత వివరాలు సెకరించాలి. ఆ లిస్ట్‌లో పేర్లు ఉన్న వారిని రెన్యువల్ చేయాలి. అన్ని సబ్జెక్ట్స్ వారికీ అవకాశం ఇవ్వాలి.రెగ్యులర్ వికలాంగుల లెక్చరర్‌లకు అదనంగా ఈఎల్ ఎర్నడ్ లీవ్స్ ఇవ్వాలి. అమోంట్ కూడా ఈ సారి పెంచాలి. ఈ సారి ఒక్కొక క్యాంపులో ఒక్కొక్క సబ్జెక్టు క్యాంపు పెట్టాలి. సమ్మర్ స్పెషల్ క్యాంపు కోసం ప్రణాళిక రూపొందాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం చాలా గొప్పపరిణామం. గతంలో ఉన్న ప్రభుత్వం ఓట్ బ్యాంకు రాజకీయం కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది.వారికి ఓట్లు పడలేదు. వారి కంటే ఒక అడుగు ముందుకు వేసి వారి కంటే ఎక్కువే ప్రజాధనాన్ని ఉచిత పథకాలకు ఈనాటి ప్రభుత్వం అందిస్తూ ఉన్నది. ఏపీఎస్‌ఆర్టీసీల్లో మహిళలకుఉచిత ప్రయాణంతోపాటు మార్చిఫస్ట్‌నుండి దివ్యాంగులకు కూడా రాయితీలతో ఉచిత ప్రయాణ సౌకర్యంకల్పించినది

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సుస్థిర ఆర్థిక వృద్ధితో సత్వర ప్రగతి

యువతకు సమానమైన వేతనం, గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి ఆర్థిక వ్యవస్థ సంస్కరణలు అవసరం. సుస్థిర, సమ్మిళిత ఆర్థిక వృద్ధి పురోగతి సాధిస్తేనే అందరికీ మంచి ఉద్యోగాలు, జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అత్యున్నత నాణ్యతతో విద్య, శిక్షణకు పెట్టుబడి పెట్టాలి. కార్మిక మార్కెట్ డిమాండ్లకు సరిపోయే నైపుణ్యాలను యువతకు అందించాలి, ఒప్పంద విధానంతో సంబంధం లేకుండా సామాజిక రక్షణ, ప్రాథమిక సేవలను పొందడం, అలాగే ఆశావహులైన యువతఅందరూ వారి ఆదాయ స్థాయి,సామాజిక ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా ఉత్పాదక ఉపాధిని పొందగలిగేలా పరిస్థితులను కల్పించాలి.



డా. సునీల్ కుమార్ పోతన

దేశం అభివృద్ధి సాధించాలంటే అందరూ పురోగతిలో భాగస్వామ్యం కావాలి. ప్రతి ఒక్కరికీ ఉత్పాదకత కలిగిన, న్యాయమైన ఆదాయాన్ని అందించే పనిని పొందే అవకాశాలు, ఉద్యోగ భద్రత, కుటుంబాలకు సామాజిక రక్షణ, వ్యక్తిగత అభివృద్ధి, సామాజిక సమైక్యతకు మెరుగైన అవకాశాలు అందించడాన్ని గౌరవమైన వృత్తి,సుస్థిర ఆర్థిక వృద్ధిగా పేర్కొనవచ్చు. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి 2030 లక్ష్యాలలో 8వ లక్ష్యం గౌరవమైన వృత్తి, ఆర్థిక వృద్ధి. ఈ లక్ష్యాన్ని సాధించడానికి అప్పులు, ఆర్థిక అనిశ్చితి, వాణిజ్య ఉద్రిక్తతలు సవాళ్లుగా మారుతున్నాయి. నాణ్యమైన ఉద్యోగాల సృష్టి దాదాపు అన్ని ఆర్థిక వ్యవస్థలకు ప్రధాన సవాలుగా మిగిలిపోయింది. వేగంగా విస్తరిస్తున్న ఆర్థిక వ్యవస్థ, అధిక జనాభాతో సుస్థిరఅభివృద్ధి లక్ష్యం8ని సాధించే దిశగా భారతదేశం గణనీయమైన పురోగతిని సాధించింది. సానుకూల వృద్ధి పథం ఉన్నప్పటికీ సుస్థిర ఆర్థిక వృద్ధిని సాధించడంలో భారతదేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటుంది. వివిధ రంగాలలో పురోగతి సాధించినప్పటికీ ముఖ్యంగా ఉపాధి కల్పన, ఉద్యోగభద్రత, ఆదాయ అసమానత, ఉద్యోగ నాణ్యత పరంగా గణనీయమైన సవాళ్లు కొనసాగుతున్నాయి. భారతదేశంలో యువ జనాభా పెరుగుతూనే ఉంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) ప్రకారం భారతదేశంలో శ్రామిక వయస్సు జనాభా 2025 నాటికి వంద కోట్లకు చేరుకుందని అంచనా. ఇది ఉపాధిని కీలక ప్రాధాన్యతగా చేస్తుంది. 2025 నాటికి భారతదేశ శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 51శాతం వద్ద ఉంది. ఇది మునుపటి సంవత్సరాలతో పోలిస్తే మితమైన పెరుగుదలను ప్రతిబింబిస్తోంది. ఇది చాలా తక్కువ. ప్రపంచ సగటులతో పోలిస్తే, ముఖ్యంగా మహిళలకు, మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 30శాతం కంటే తక్కువగా ఉంది. వివిధ నైపుణ్య అభివృద్ధి, ఉద్యోగ సృష్టి కార్యక్రమాల ద్వారా నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి, యజమానులను ప్రోత్సహించే లక్ష్యంతో 'ప్రధాన మంత్రి రోజ్గర్ ప్రోత్సాహన్ యోజన' (పిఎంఎంఆర్‌పివై)ను ప్రభుత్వం చేపట్టింది. ఉద్యోగాల నాణ్యత ఒక ముఖ్యమైన ఆందోళనగా మిగిలిపోయింది. సామాజికభద్రత, ఉద్యోగ ప్రయోజనాలు, గౌరవ పని పరిస్థితులు లేని అనదికారిక రంగంలో భారతదేశ శ్రామిక శక్తిలో ఎక్కువ భాగం పనిచేస్తున్నారు. 2025 నాటికి 80 శాతం కంటే ఎక్కువ మంది శ్రామిక శక్తి అనధికారిక, ప్రమాదకర ఉద్యోగాలలో పనిచేస్తున్నారని అంచనా. పరిశ్రమలలో కొనసాగుతున్న డిజిటలైజేషన్‌తో ఈ పరిస్థితి మరింత తీవ్రమైంది. ఇది సాంప్రదాయ కార్మికులను స్థానభ్రంశం చేస్తోంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ గత కొన్నిదశాబ్దాలుగా సంస్కరణలు,సాంకేతిక పురోగతులు, విస్తరిస్తున్న సేవల రంగం ద్వారాఅద్భుతమైన వృద్ధిని సాధిస్తోంది. దేశ స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రేటు, హెచ్చుతగ్గులకు లోనవుతున్నప్పటికీ, ఆర్థికపురోగతికి కీలక సూచికగా ఉంది. 2025లో, భారతదేశ జిడిపి వృద్ధి రేటు 6.5శాతం వద్ద ఉంది. ఇది గత సంవత్సరాల కంటే కొంచెంతక్కువగా ఉన్నప్పటికీ ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యధికంగా ఉంది. భారతదేశ స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు 55 శాతం వాటాతో సేవల రంగం ఇప్పటికీ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ వృద్ధికి ప్రాథమిక చోదకాలుగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి), ఆర్థికం, ఆరోగ్య సంరక్షణ నిలుస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి ఉంది. ఈ రంగం దాదాపు 40శాతం మంది శ్రామికశక్తిని కలిగి ఉంది. కానీ, జిడిపికి 17శాతం మాత్రమే దోహదం చేస్తోందని ఆర్థిక సర్వేలు, నివేదికలు తెలియజేస్తున్నాయి.



ఈ అసమానత మరింత సమతుల్య, వైవిధ్యభరితమైన ఆర్థిక వ్యవస్థ అవసరాన్ని సూచిస్తోంది. సాంప్రదాయకంగా ఉద్యోగ సృష్టి, పారిశ్రామిక వృద్ధికి అవరోధంగా భావించే సంక్లిష్ట కార్మిక చట్టాలను సరళీకృతం చేసే లక్ష్యంతో అనేక కార్మిక సంస్కరణలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వేతనాలు, సామాజిక భద్రత, వృత్తి భద్రత, పారిశ్రామిక సంబంధాలను మెరుగుపరిచేందుకు నాలుగు విస్తృత వర్గాలుగా కేంద్ర కార్మిక చట్టాలను ఏకీకృతం చేసింది.ఈ సంస్కరణలు ఉన్నప్పటికీ, కార్మిక చట్టాల అమలు, కార్మికుల రక్షణపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం, అనధికారిక రంగంలోని కార్మికులలో కేవలం 10శాతం మంది మాత్రమే సామాజిక భద్రతా పథకాల పరిధిలోకి వస్తున్నారు. వ్యవసాయం, నిర్మాణం, ఇంటి పని వంటి రంగాలలోని కార్మికులు దోపిడీ,అసురక్షిత పని పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఈ సవాళ్లను పరిష్కరించడానికి, ప్రభుత్వం ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్, ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) వంటి సామాజిక భద్రతా పథకాలను విస్తరించింది. అసంఘటిత రంగంలోని కార్మికులకు పెన్షన్ ప్రయోజనాలను అందించే ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్ ధన్ యోజన వంటి కార్యక్రమాల ద్వారా అనధికారిక కార్మికులను చేర్చడానికి సామాజిక రక్షణ వలయాన్ని విస్తరించడానికి ప్రభుత్వం కృషిచేస్తోంది. సమ్మిళిత ఆర్థికవృద్ధి అనేది సుస్థిర అభివృద్ధి ముఖ్య లక్ష్యం. ప్రాంతాలు, రంగాలు, సమాజాలలో సమానంగా ఉండాలని నిర్ధారిస్తోంది. భారతదేశంలో ఆదాయం, మౌలిక సదుపాయాలు, విద్యలో ప్రాంతీయ అసమానతలు చాలా కాలంగా సమ్మిళిత వృద్ధికి సవాలుగా ఉన్నాయి. మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్ వంటి రాష్ట్రాలు వేగవంతమైన ఆర్థిక అభివృద్ధిని సాధించగా, బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశావంటి ప్రాంతాలు ఆదాయ స్థాయిలు, అక్షరాస్యత రేట్లు, ఉపాధి అవకాశాల పరంగా వెనుకబడి ఉన్నాయి. ఈ అసమానతలను పరిష్కరించడానికి 'భారతమాల పరియోజన', 'సాగర్మాల ప్రాజెక్ట్' మారుమూల ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కనెక్టివిటీని మెరుగుపరచడానికి రూపొందించారు.'ఆత్మనిర్భర్ భారత్' చొరవ స్థానిక తయారీని పెంచడం, చారిత్రాత్మకంగా పారిశ్రామిక అభివృద్ధి లేని ప్రాంతాలలో ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. అదనంగా, వికేంద్రీకరణ వైపు భారతదేశ పురోగతి 'స్టార్టప్ ఇండియా' చొరవ వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ వ్యవస్థాపకత వృద్ధికి దారితీస్తోంది.ఇది వేలాది స్టార్టప్లకు, ముఖ్యంగా ద్వితీయ,తృతీయ శ్రేణి నగరాల్లో నిధులు, మార్గదర్శకత్వాన్ని అందిస్తోంది. అయినప్పటికీ అణగారిన వర్గాలను ఆర్థిక ప్రధాన స్రవంతిలోకి పూర్తిగా విలీనం చేయడం సవాలుగానే మిగిలి ఉంది. కొంత పురోగతి సాధించినప్పటికీ, సమ్మిళిత వృద్ధికి విద్య, ఆరోగ్య సంరక్షణ, వెనుకబడిన వర్గాలకు మూలధనానికి మెరుగైన ప్రాప్యతతో సహా మరింత లక్ష్య జోక్యాలు అవసరం. ఆర్థిక వృద్ధి సవాళ్లని పరిష్కరించడానికి తయారీ రంగాన్ని విస్తృతించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా 'మేక్ ఇన్ ఇండియా' ప్రచారం వంటి కార్యక్రమాల ద్వారా పారిశ్రామికీకరణ, ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మరింత దృష్టి సారించాలి. రహదారులు, ఓడరేవులు, విద్యుత్‌తోసహా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించి ఉద్యోగాలను సృష్టించాలి. ఉత్పాదకతను పెంచాలి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలి. వీటిలో ప్రాంతీయ అసమానతలను పరిష్కరించడం, సమాన వృద్ధిని నిర్ధారించడం, పర్యావరణ ప్రభావాలను తగ్గించడం వంటివి ఉన్నాయి. స్వచ్ఛమైన ఇంధన పెట్టుబడులు, సుస్థిర వ్యవసాయం, పర్యావరణ అనుకూల పారిశ్రామిక విధానాల ద్వారా పర్యావరణహిత వృద్ధిని ప్రోత్సహించడంపై ప్రభుత్వాలు ఎక్కువగా దృష్టి సారించాలి. యువతకు సమానమైన వేతనం, గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి ఆర్థిక వ్యవస్థ సంస్కరణలు అవసరం. సుస్థిర, సమ్మిళిత ఆర్థిక వృద్ధి పురోగతి సాధిస్తేనే అందరికీ మంచి ఉద్యోగాలు, జీవన ప్రమాణాలు మెరుగవుతాయి.అత్యున్నత నాణ్యతతో విద్య, శిక్షణకు పెట్టుబడి పెట్టాలి. కార్మిక మార్కెట్ డిమాండ్లకు సరిపోయే నైపుణ్యాలను యువతకు అందించాలి, ఒప్పంద విధానంతో సంబంధం లేకుండా సామాజిక రక్షణ, ప్రాథమిక సేవలను పొందడం, అలాగే ఆశావహులైన యువతందరూ వారి ఆదాయ స్థాయి,సామాజిక ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా ఉత్పాదక ఉపాధిని పొందగలిగేలా పరిస్థితులను కల్పించాలి. సుస్థిర, వినూత్నమైన, ప్రజలపై కేంద్రీకృత ఆర్థికవ్యవస్థలను నిర్మించడానికి, ముఖ్యంగా యువత ఉపాధి, మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. ఆరోగ్య, భద్రతా చర్యలను అమలు చేయాలి. ●

# సాంకేతికత జోడిస్తేనే రైతుకు మేలు..

ఈ. శ్రీనివాస్ రావు

తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం గత దశాబ్దంలో గణనీయంగా పెరిగింది. 2014-15లో సుమారు 22.7 లక్షల ఎకరాలుగా ఉన్న వరి సాగు, 2023-24 నాటికి దాదాపు 66 లక్షల ఎకరాలకు చేరింది. ఇది ఆహార భద్రత దృష్ట్యా ఒక విజయగాథలా కనిపించినప్పటికీ, దీని వెనుక ఒక తీవ్రమైన పర్యావరణ, ఆర్థిక సంక్షోభం దాగి ఉంది. నిరంతర ఏకపంట సాగు, అధిక రసాయన ఎరువుల వినియోగం, అధిక నీటిపారుదల కారణంగా నేల సేంద్రియ కార్బన్ తగ్గుదల,సూక్ష్మజీవుల వైవిధ్య క్షీణత, నేలఆమ్లత్వం పెరుగుదల వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. తెలంగాణ జనాభాలో సుమారు 61 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తూ వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారు. అయితే పెరుగుతున్న సాగు ఖర్చులు, రసాయనాలపై అధిక ఆధారపడటం, దిగుబడుల్లో స్థిరత్వం లేకపోవడం రైతులను అప్పుల బారిన పడేలా చేస్తోంది. భూగర్భ జలాలపై అధిక ఒత్తిడి వల్ల వరిసాగు మరింత వాతావరణ మార్పులకు లోనవుతోంది. ఈ పరిస్థితుల్లో వ్యవసాయం లాభదాయక వృత్తిగా కనిపించక యువత దూరమవుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం (టీడీఎఫ్) ఖరీఫ్ 2025లో అమలు చేసిన పునరుత్పాదక వరి సాగు పైలట్ ప్రాజెక్ట్ ఒక మార్గదర్శక ప్రయోగంగా నిలిచింది. సిద్ధిపేట జిల్లా పెద్ద మాసంపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాలు రాజన్న-సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ ప్రాంతాల్లో 10 మంది రైతులతో 10ఎకరాల్లో అమలు చేసిన ఈప్రాజెక్ట్, నేల పునరుద్ధరణ-ఖర్చు తగ్గింపు-నీటి సంరక్షణ అనే మూడు ముఖ్య లక్ష్యాలపై దృష్టి పెట్టింది. 19 రకాల పచ్చ,ఎరువు, పంటలతో రూపొందించిన బహుళ పంట వ్యవస్థ ఈ మోడల్‌లో కీలక భాగం. ధాన్యాలు, పప్పులు, చిరుధాన్యాలు, నూనెగింజలు, ఆకుకూరలు, ధైన్చా, సన్‌హెంప్ వంటి పంటలను 45-60 రోజులు పెంచి పుష్ప దశలో నేలలో కలపడం ద్వారా ఎకరాకు సుమారు 2.3 టన్నుల బయోమాస్ ఉత్పత్తి అవుతుంది. దీనివల్ల నేలలో రంధ్రాల నిర్మాణం మెరుగుపడి తేమ నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. ముఖ్యంగా రైజోస్ఫియర్ ప్రాంతంలో సూక్ష్మజీవుల పెరుగుదల 2-3 రెట్లు పెరిగినట్లు ప్రయోగశాల పరీక్షలు వెల్లడించాయి.రసాయన ఎరువులు, పురుగుమందులను పూర్తిగా మానేసి, స్థానికంగా తయారు చేసిన జీవ ద్రావణాలతో సాగు చేయడం వల్ల సాగు ఖర్చుగణనీయంగా తగ్గుతుంది.ఎకరాకు రూ.4,000- రూ.8,000 వరకు మొత్తం ఖర్చు తగ్గగా, రైతుల నికర ఆదాయం రూ.6,000- రూ.12,000 వరకు పెరిగినట్టు నమోదు అయింది. నీటిపారుదల చక్రాలు 28-30 సార్ల నుంచి 22సార్లకుతగ్గి 20-25శాతం నీటిఆదా సాధ్యమైంది. ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత డిజిటల్ సాంకేతికతల వినియోగంలో ఉంది. ఉపగ్రహ ఆధారిత పంట ఆరోగ్య పర్యవేక్షణ, 3.3 మీటర్ల స్థాయిలో ఫీల్డ్ విశ్లేషణ,ఏఐ ఆధారిత వ్యాధి ముందస్తు హెచ్చరికలు రైతులకు అందించబడ్డాయి. దీనివల్ల7-10 రోజుల ముందే పంటఒత్తిడి, వ్యాధులను గుర్తించి నివారణ చర్యలు తీసుకునే అవకాశం లభించింది. ఖచ్చిత నీటి పారుదల సలహాల వల్ల నీటివినియోగం మరింత సమర్థవంతమైంది. ఈ పైలట్ ఫలితాలు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి.నేలఆరోగ్యం పునరుద్ధరణ లేకుండా వ్యవసాయ సుస్థిరత సాధ్యంకాదు. పునరుత్పాదక వ్యవసాయం కేవలం రసాయనరహిత సాగు మాత్రమేకాదు,అది నేల జీవ వైవిధ్యాన్నిపెంచే, నీటి వినియోగాన్ని తగ్గించే,రైతు ఆదాయాన్ని స్థిరపరచే సమగ్రవిధానం. తెలంగాణలో వరి ఉత్పత్తి పెరుగుదలతో పాటు పర్యావరణ సమతౌల్యం కాపాడాలంటే ఈతరహా మోడళ్లను క్లస్టర్ స్థాయిలో విస్తరించడంఅవసరం. సిఎస్ఆర్ భాగస్వామ్యాలు,ప్రభుత్వమద్దతు,వ్యవ సాయశాఖ సాంకేతిక సహకారం ఉంటే ఈ మోడల్ రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యే అవకాశంఉంది.అధిక ఉత్పత్తి లక్ష్యాల నుంచి సుస్థిర ఉత్పత్తి లక్ష్యాలవైపు అడుగులు వేయాల్సినసమయం వచ్చింది.నేలను కాపాడితేనే రైతు బతుకుతాడు, రైతుబతికితేనే గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలపడుతుంది. తెలంగాణ వరి సాగుభవిష్యత్తు పునరుత్పాదక మార్గంలోనే సురక్షితం. ●

# వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం, ప్రతి సంవత్సరం మార్చి 3న నిర్వహించ బడుతోంది. అంతరించి పోతున్న అడవి జాతుల సంరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ దినోత్సవం జరుపుకుంటారు. 2013, మార్చి 3 నుండి 14 వరకు బ్యాంకాక్‌లో జరిగిన జనరల్ అసెంబ్లీ16వ సమావేశంలో ప్రపంచ అడవి జంతుజాలం, వృక్షజాలం గురించి వేడుకలు జరుపుకునేందుకు, అవగాహన పెంచడానికి మార్చి 3ను ప్రపంచ వన్యప్రాణి దినోత్సవంగా పేర్కొనడం జరిగింది. అదే సంవత్సరం డిసెంబరు 20న జరిగిన ఐక్యరాజ్య సమితి జనరల్‌అసెంబ్లీ దాని 68వ సెషన్ తీర్మానంలో, మార్చి 3న ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని ప్రకటించింది. వన్యప్రాణులఅంతర్గత విలువను, పర్యావరణ, జన్యు, సామాజిక, ఆర్థిక,శాస్త్రీయ, విద్యా, సాంస్కృతిక, వినోద అభివృద్ధికి, మానవ శ్రేయస్సు కోసం వివిధ కార్యక్రమాలు చేయాలని తీర్మానించింది. వాస్తవానికి మనిషికంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతుజాతులు కనుమరుగైపోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకమవుతున్న నేపథ్యంలో వాటి సంరక్షణ ప్రాధాన్యతను గుర్తుచేస్తూ ప్రతీఏటా అన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుతున్నాయి.వన్య ప్రాణుల సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు, వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యంలోకి వస్తున్న పరిస్థితి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించడానికి మొట్టమొదటిసారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడులోని వేదాంతం గల్‌లో ఏర్పాటు చేసింది.ఆ తర్వాత 1935లో మొదటి వన్యప్రాణి జాతీయ పార్కు 'హేలీ'ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల



సంఖ్య 102. 1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఎ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. భారత దేశంలో వన్యప్రాణి సంరక్షణ కోసం 1972లోచట్టం ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. ఈచట్టం అమలులోకివచ్చాక దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 23 టైగర్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 441వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాలుండగా వీటిల్లో 28 టైగర్ జోన్స్ ఉన్నాయి. అంతర్జాతీయంగా పులి చర్మానికి, గోళ్లకు, ఎముకలకు విపరీతమైన డిమాండ్ ఉండటంతోవేటగాళ్ల చేతిలోచిరుతలు బలైపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశవ్యాప్తంగా ఉన్న అడవుల్లో దాదాపు నలభై వేలకు పైగా ఉన్న పులులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ 1972 నాటికే ఆ సంఖ్య మూడు వేలకు పడిపోయిందంటే అప్పటి ప్రభుత్వాలు ఎంతటి నిర్లక్ష్య వైఖరి అవలంభించాయో స్పష్టంగా అర్థమవుతోంది. సాధారణంగా పులుల జనాభాను లెక్కించేందుకు ఇంతకు ముందు పాదముద్రలను గుర్తించడం ఒక్కటే మార్గం. అవి సంచరించే ప్రాంతాల్లో రహస్య కెమెరాలను ఏర్పాటు చేసి, వాటి పాదముద్రలను సేకరించేవారు.అయితే ఇది చాలా కష్టంతో కూడు కున్నపని. కచ్చితమైన లెక్కకు ఆస్కారం కూడా తక్కువే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలార్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) పులుల మలం ద్వారా వాటిని లెక్కించే పద్ధతిని ఆవిష్కరించింది. 20వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు లక్ష పైచిలుకు పులులుండేవి అని అంచనా.2014 లెక్కల ప్రకారం ప్రపంచంలో 3891 పులులు ఉండగా వాటిలో 2226 మన దేశంలోనే ఉన్నాయి. భారత్‌లో 2011లెక్కల ప్రకారం 1706, 2014 ప్రకారం 2226 ఉండగా 2018 పులుల గణన ప్రకారం మన దేశంలో 2967 పులులున్నాయి. ప్రపంచంలో ఉన్న మొత్తం పులుల్లో 70శాతం పైగా మనదేశంలోనే ఉన్నాయి. గడిచిన కొన్నేళ్లలో ఒక్క మధ్యప్రదేశ్‌లోనే 19పులులు మృత్యువాత పడ్డాయి.మహారాష్ట్రలో 9, ఉత్తరాఖండ్‌లో 9 మృత్యువాత పడ్డాయి. 2016లో దేశవ్యాప్తంగా74 పులులు మరణించినట్టు లెక్కలు చెబుతున్నాయి. 2006లో పులులను స్మగ్లర్ల బారి నుండి కాపాడటానికి టైగర్ టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు.విచక్షణారహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను,మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాలలోకి, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి.ఇలాంటి పరిస్థితినిమార్చడంకూడా ఈజంతు దినోత్సవం లక్ష్యాల్లోఒకటి.జంతువులకు సహజసిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతుజాతులను రక్షించడం,వాటి సంక్షేమాన్నికాపాడటం ఇవేప్రధానం. ●

## కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్లో ఉచిత కంటి ఆపరేషన్లు

### - డాక్టర్ ఎం కృష్ణారావు వెల్లడి



**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలు పట్టణంలోని సుందరయ్య భవన్ రోడ్ లో ఉన్న కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ నందు డాక్టర్ ఎం కృష్ణారావు ఆధ్వర్యంలో ఉచిత కంటి, షుగర్ సంబంధిత వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు కృష్ణా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి డాక్టర్ ఎం.కృష్ణారావు ఒక ప్రకటనలో తెలియజేశారు గత కొన్ని సంవత్సరాలుగా షుగర్ సంబంధిత వ్యాధిగ్రస్తులకు తమ వైద్యశాల యందు అధునాతన వైద్య విధానాలతో సేవలు అందిస్తున్నామని ముఖ్యంగా డయాబెటిస్ వ్యాధిగ్రస్తులకు అత్యాధునిక చికిత్సలు అందచేస్తున్నామన్నారు అలాగే ప్రస్తుతం కంటికి సంబంధించిన కంటి శుక్లములు,మరియు కంటి పొరలకు సంబంధించిన.శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయుటకు నిర్ణయించుకొని రోగులకు తగిన అవకాశం కల్పిస్తున్నామని కృష్ణారావు తెలిపారు అలాగే షుగర్ సంబంధిత వ్యాధిగ్రస్తులకు తమ హాస్పటల్ నందు ఉచిత ఓపి అవకాశం కల్పించామన్నారు తక్కువ ఖర్చులతో ల్యాబ్ మరియు ఇతర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని సంబంధిత వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకో వలసిందిగా కోరారు.సంబంధిత వ్యాధిగ్రస్తులు వారి పేర్లను హాస్పటల్ నందు నమోదు చేసుకుని తగిన వైద్య సేవలు పొందవలసిందిగా డాక్టర్ ఎం కృష్ణారావు కోరారు

## పవన్ ఫార్ములా మారుస్తున్నారా..?

### - కాపుల కోరిక తీర్చేదిశగా అడుగులు పడనున్నాయా..?

**ఒంగోలు, ప్రభాతవార్త**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్లాన్ బి రెడీ చేసుకుంటున్నారని సమాచారం. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదిహేనేళ్ల పాటు ఉంటారని అనేక సార్లు ప్రకటించిన పవన్‌కళ్యాణ్ సొంత సమాజికవర్గం నుంచి కొంత వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని ఇటు సామాజికవర్గం, అటు ఆయన అభిమానులు బలంగా కోరుకుంటున్నారు.కానీ పవన్ కళ్యాణ్ తనకు రాజకీయ అనుభవం లేదని,అందుకు కొంత సమయం అవసరమని ఆయన భావిస్తున్నారంటున్నారు. అయితే కూటమిగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేసినప్పటికి సామాజిక వర్గం ఓటర్లు ఎంత వరకు ఆదరిస్తారో తెలియని పరిస్థితి. అభిమానులయితే ఖచ్చితంగా పవన్ వెంటే నడుస్తారు. చీలిక వస్తే.. కానీ ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద సామాజిక వర్గం, బలమైన ఓటు బ్యాంకు అయిన కాపుల్లో చీలిక వస్తే అసలుకే ఎసరు వస్తుంది. అది వైసీపీ అధినేత జగన్‌కు వరంగా మారుతుంది. ఆ విషయం పవన్‌కు కూడా తెలుసు. పదిహేనేళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉంటారని పవన్‌కళ్యాణ్ వ్యూహాత్మకంగానే అన్నారంటున్నారు. కానీ వచ్చే ఎన్నికల సమయానికి వ్యూహాన్ని రెడీ చేసే అవకాశముందని జనసేన నాయకులే చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమిగా పోటీ చేసి జనంలోకి వెళ్లే కంటే పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రిగా అంటూ ఎన్నికలకు వెళితే మరోసారి అధికారంలోకి వచ్చే వీలుందన్న అంచనాలు కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా ఆవిస్తున్నట్లు తెలిసింది. జగన్‌ను అధికారంలోకి రాకుండా చేయడానికి చంద్రబాబు కూడా ఈ ప్రతిపాదనకు అంగీకరించక తప్పదు. ఫిఫ్టీ ఫిఫ్టీ పార్ములాతో.. అందుకే ఫిఫ్టీ ఫిఫ్టీ ఫార్ములాతో వచ్చే ఎన్నికలకు కూటమి వెళ్తుందన్న ప్రచారం సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తుంది. మొదటి రెండేళ్లు ముఖ్యమంత్రి చంద్రబాబు, తర్వాత రెండున్నరేళ్లు పవన్ కళ్యాణ్ ఉండేలా ఎన్నికలకు ముందే ఒప్పందం కుదుర్చుకుని ప్రజల్లోకి వెళ్లాలని జనసేన వ్యూహాంగా ఉంది. ఇందుకు పవన్ కళ్యాణ్‌కు బీజేపీ కూడా సహకరించే అవకాశాలు లేకపోలేదు. సనాతన ధర్మాన్ని తన భుజాన వేసుకుని నడుస్తున్న పవన్ కళ్యాణ్‌పై మోదీ, షాలకు మంచి గురి ఉందంటారు. అందుకే ఈసారి ఎన్నికల్లో జగన్‌ను ఓడించడానికి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెరో రెండున్నరేళ్ల సమయం ముఖ్యమంత్రి పదవి తీసుకోవాలన్న నిర్ణయాన్ని ఎన్నికలకు ముందే ప్రకటించే అవకాశముంది.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల



**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలులో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు సోమవారం పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని కొప్పోలు శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నందు తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.అదే విధంగా అద్దంకి నియోజకవర్గంలో శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి,శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్ల 71వ మహోత్సవం సందర్భంగా పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మహిళా దినోత్సవం సందర్భంగా గర్ల్స్ హైస్కూల్‌లో విద్యార్థినులకు ప్రత్యేక పోటీలు నిర్వహించిన వేటపాలెం పోలీసు శాఖ



**వేటపాలెం, మార్చి 2, ప్రభాతవార్త**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వేటపాలెంలోని స్థానిక గర్ల్స్ హైస్కూల్‌లో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వేటపాలెం ఎస్సై పి.జనార్ధన్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం,వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జనార్ధన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ డీజీపీ, బాపట్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మహిళల సాధికారిత, భద్రత సమాజంలో వారి పాత్రపై విద్యార్థినులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని,తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు మహిళ దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు,స్థానిక పోలీసులు,పాఠశాల ఉపాధ్యాయులుపాల్గొని పర్యవేక్షించారు



ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## గొట్లగట్టు సబ్ పోస్టాఫీసులో అక్రమాలు

### - డెలివరీ చేయకుండానే చేసినట్లు నమోదు

**కొనకనమిట్ల, మార్చి 2, ప్రభాతవార్త**

మండలంలోని గొట్లగట్టు సబ్ పోస్టాఫీసులో పలు అక్రమాలు అధికారుల తనిఖీలలో సోమవారం వెల్లడయ్యాయి. వందల సంఖ్యలో డెలివరీ చేయాల్సిన కవర్లు, విలువైన వస్తువులు లబ్ధిదారులకు ఇవ్వకుండానే రికార్డుల్లో డెలివరీ అయినట్లు ఈడీ ఫేకర్ నమోదు చేశారు. బాధితుల ఫిర్యాదుల మేరకు ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, రిజిస్టర్లలో పంపిణీ చేసినట్లు చూపిన అనేక పార్సిళ్లు, లేఖలు కార్యాలయంలోనే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఎస్‌పీఎం పర్యవేక్షణ కొరవడటం వల్ల కూడా పార్సిల్లు, లేఖలు పంపిణీ చేయకపోవడానికి కారణమని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంపై బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారా లేదా అన్నది స్పష్టత రాలేదు. పోస్టల్ సేవలపై ఆధారపడే గ్రామ ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొంది. అధికారిక ప్రకటన కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు. ఈ తనిఖీలలో పొదిలి తపాలా సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంఓ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సింగరకొండ తిరునాళ్ళకు పోటేత్తిన భక్తజనం

## -9 విద్యుత్ ప్రభల ఏర్పాటు - అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





**అద్దంకి , మార్చి 2, ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ ప్రసన్నాంజనేయస్వాముల 71వార్షిక తిరునాళ్ళ సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుండే స్వామి వార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని పూజలు నిర్వహించారు. అదే విధంగా పలువరు వి.ఐ.పి.లు ప్రజా ప్రతినిధులు,అధికారులు కూడ స్వామివారిని దర్శించు కున్న వారిలో వున్నారు.తిరునాళ్ళ సందర్భంగా సింగరకొండ పరిసరాలుతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల నుండి 9 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. ఉదయం నుండే భక్తులు సింగరకొండకు అధిక సంఖ్యలో రావడం, ఒక ఎత్తైయితే రాత్రికి విద్యుత్ ప్రభలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో తిరునాళ్ళ పరిసరాలు ప్రజలతో క్రిక్కిరిసి పోయింది. ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి, తిరునాళ్ళను తిలకించేందుకు ప్రజలు పోటేత్తారు. అద్దంకి పట్టణంలో నాలుగు,క్రొత్తరెడ్డిపాలెంలో రెండు, సింగరకొండపాలెంలో రెండు, జార్లపాలెంలో 1 ప్రభను తిరునాళ్ళలో ఏర్పాటు చేశారు. అద్దంకి పట్టణం నుండిటిడిపి సానుభూతిపరులు రెండు,జనసేనపార్టీ సానుభూతిపరులు1,వైసిపి సానుభూతిపరులు



1,క్రొత్త రెడ్డిపాలెం నుండి టిడిపి, వైసిపి సానుభూతిపరులు ఒక్కొక్కటి చొప్పున 2, సింగరకొండపాలెంలో టిడిపిసానుభూతి పరులు రెండు,జార్లపాలెం, చెరువుకొమ్ముపాలెం గ్రామాల వారు ఉమ్మడిగా ఒక ప్రభను ఏర్పాటు చేశారు. తిరునాళ్ళకు 9 విద్యుత్ ప్రభలు, చేరుకున్నాయి. ఈఏడాది తిరునాళ్ళకు భక్తులు, పోటేత్తెడం విశేషం.

## ఒంగోలులో రెండు రోజులు ఉంటా.. నేను కేసులకు భయపడే వ్యక్తిని కాదు

- కూటమిలో ఉన్నా కాబట్టి ఓపిక పట్టా
- డ్వాక్రా గ్రూపుల్లో అవినీతిని బట్టబయలు చేయాలి
- అవినీతి లేఖలు నేను రాయించలేదని నా కొడుకు మీద ప్రమాణం చేస్తా
- నేను రాయించానని నీ కూతురిపై ప్రమాణం చేస్తావా దామచర్ల
- బాలినేని డిమాండ్

**ఒంగోలు, ప్రభాతవార్త**

డ్వాక్రా గ్రూపులో వైసీపీ హయాంలో, ప్రస్తుతం నీ హయాంలో జరిగిన అవినీతిపై విచారణలో బయటపడ్డ వాస్తవాలను బహిర్గతం చేయాలని మాజీ మంత్రి, జనసేన రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతిలో నీ మనుషుల భాగస్వామ్యం ఉందనే భయటపెట్టడం లేదని ఆరోపించారు. వైసీపీ హయాంలో నా కొడుకు గంజాయి బ్యాచ్‌నుమెయింటినెన్స్ చేశాడని అసత్య ప్రచారం చేస్తున్నావు.ఇకనైనా అలాంటి అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. నీపై అవినీతి లేఖలు నేను రాయించలేదని నా కొడుకుపై ప్రమాణం చేస్తా. నేనే రాయించానని నీవు నీ కూతురిపై ప్రమాణం చేస్తావా అని బాలినేని సవాల్ విసిరారు. నాపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తే ఊరుకోవాలా అని ప్రశ్నించారు. తనపై కావాలనే అవినీతి ఆరోపణలుచేస్తున్నారని,దమ్ముంటే నాపై చేసిన ఆరోపణలు నిరూపించాలని ఆయన కోరారు. సీఎం చంద్రబాబు నాయుడుకు గతంలోనే నాపై ఆరోపణలు ఉంటే ఏ విచారణకైనా సిద్ధమని లేటర్ రాసినట్లు గుర్తు చేశారు. కూటమిలో ఉన్నా కాబట్టి 16 నెలలుగా ఓపిక పట్టా. వ్యక్తిగత ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోనని అన్నారు. సైలెంట్‌గా ఉన్న నన్ను రెచ్చగొట్టావు, నేను కేసులకు భయపడను, ఒంగోలులో టీడీపీ వైసీపీ కలిసి పని చేస్తున్నాయని బాలినేని ఆరోపించారు. ఎవరు ఎవరితో కలిసినా నన్ను ఎవ్వరు ఏమి చేయలేరు. టీడీపీ వైసీపీ కలిసి పనిచేస్తున్నాయి.నేను జనసేనలో చేరడంపై విమర్శలు చేస్తున్నారు. దోచుకున్నది దాచుకోవడానికి అంటూ కామెంట్ చేస్తున్నారు. ఇది పూర్తిగా అవాస్తవం. కేవలం పవన్ కళ్యాణ్‌పై ఉన్న అభిమానంతో తాను జనసేనలో చేరడం జరిగిందన్నారు. కొంత మంది నాయకులు నన్ను అడ్డుకోవడానికి కూడా ప్రయత్నాలు చేశారన్నారు. కేసులకు భయపడి జనసేనలో చేరాడని కొంత మంది అన్నారని, తాను కేసులకు భయపడే వ్యక్తిని కాదని అన్నారు.ప్రతి వారంలో రెండు రోజులు ఒంగోలు లోనే ఉంటానని,ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. అప్పుడప్పుడు వచ్చి వెళ్లే అతనికి ఇక్కడి విషయాలు ఏమి తెలుసని కొందరు అంటున్నారని, అయితే ఇక నుంచి వారానికి రెండు ఇక్కడే ఉంటానని, ప్రజల సమస్యలను ఎండగడతానన్నారు. ఒంగోలులో జరుగుతున్నఅవినీతి వ్యవహారాలను బయట పెడతానన్నారు.మీరు ఓడినతరువాత రెండు సంవత్సరాల పాటు ఒంగోలు మొహం కూడా చూడలేదని, కరోనా సమయంలో మీరు ఎక్కడ ఉన్నారని, కరోనా సమయంలో



తాను ఎంత కష్టపడి పనిచేశానో ఒంగోలు ప్రజలందరికి తెలుసునని అన్నారు. నాకు పార్టీలకన్నా ప్రజలే ముఖ్యమని, ప్రజల కోసం ఎంత వరకైనా వెళ్తానని బాలినేని స్పష్టం చేశారు.

## జనసేన సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో జిల్లా అగ్రస్థానంలో ఉండాలి

### - ఎమ్మెల్యే కొణతాల

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలులోని రవి ప్రియ మాల్‌లో ఒంగోలు పార్లమెంట్ జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ సాధక్‌ల సమావేశం ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, ఒంగోలు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ఛైర్మన్ షేక్ రియాజ్ అధ్యక్షతన జరిగింది,ఈ కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు,అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు, ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడుతూ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు జండా ఎత్తుకొనిధైర్యంగా తిరిగాము,కూటమి విజయానికి కృషి చేశాము, అలానే ఉద్యమి సభ్యత్వం అనేది పార్టీలో చాలా ముఖ్యం, రానున్న రోజుల్లో పార్టీ పోస్టుల్లో కానీ, నామినేటెడ్ పోస్టుల్లో గానీ సభ్యత్వం ఉన్న వారికే ప్రాధాన్యత దక్కుతుంది, కావున ప్రతి ఒక్క ఉద్యమి సభ్యత్వ నమోదు సాధక్ వారింట్లో సభ్యులని, మిత్రులని, శ్రేయోభిలాషులని, పార్టీ సభ్యులుగా చేర్పించి, మార్చి 14 కి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్‌కి అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసి బహుమతిగా ఇద్దాం, ఆ విధంగా కృషిచేసి మన నాయకుడి నాయకత్వాన్ని బలపరుద్దాం.అలానే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ మహనీయులు పుట్టిన నెల అయిన ప్రకాశం జిల్లా కి నన్ను పరిశీలకులుగా పంపడం నా అదృష్టం అని, నాకు ఇచ్చిన ఈ బాధ్యతని మీ అందరి సహకారంతో పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని,సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా అగ్రస్థానంలో ఉండాలని,ఇప్పుడు మన కూటమి గవర్నమెంట్లో మన అధినాయకుడు పవన్ కళ్యాణ్ చేస్తున్న పనులు ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకానికి ఎంతో నచ్చుతున్నాయని, మంచి నాయకుడు పాలన లోకి వస్తే ప్రజలకు ఎంత మేలు జరుగుతుందనేది ఇప్పుడు అందరూ ఆలోచిస్తున్నారని, దానిలో భాగంగా అభివృద్ధి భావజాలం కలిగిన ప్రతి ఆంధ్రుడు జనసేన పార్టీ సభ్యత్వం తీసుకోవాలని ఆశిస్తున్నారని ముఖ్యం గా బడుగు బలహీన వర్గాలు, మహిళలు, విద్యార్థులు ఇందులో ఎక్కువగా ఉన్నారు,దానికి అనుగుణంగా మీరు ప్రజల్లోకి వెళ్లి అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయించాలని కోరారు,అలానే కంది రవిశంకర్ మాట్లాడుతూ మీరు మాకు పరిశీలకులు గా రావడం





చాలా సంతోషకరమని, సభ్యత్వ నమోదులో ఒంగోలు పార్లమెంట్ లో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయడానికి జన సైనికులు,వీర మహిళలు సిద్ధంగా ఉన్నారని వారిని ఆశీర్వదించడానికి ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారని,రానున్న రోజుల్లో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా కూటమి ధర్మాన్ని పాటిస్తూ ముందుకు వెళ్తామని తెలియజేశారు,ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయ్ కుమార్, గిద్దలూరు నియోజకవర్గ ఇంచార్జ్ బెల్లంకొండ సాయి బాబా ,కనిగిరి పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ వరికుటి నాగరాజు ,శ్రీశైలం బోర్డు దేవస్థానం సభ్యులు దేవకీ వెంకటేశ్వర్లు, మైనార్టీ కార్పొరేషన్ సభ్యులు సాధిక్,ఒంగోలు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిట్టెం ప్రసాద్ ,ప్రకాశం జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ సుంకర సాయిబాబా ,అధికార ప్రతినిధి రాయపాటి అరుణ మరియు జిల్లా కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు,సాధక్‌లు,నాయకులు, జనసైనికులు,వీర మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చీరాల ఆర్డీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

### - సీనియర్ జర్నలిస్టు ఎన్.నాగార్జునరెడ్డి ఫిర్యాదు

### - విచారణకు ఆదేశించిన బాపట్ల జిల్లా కలెక్టర్

**చీరాల, మార్చి 2, ప్రభాతవార్త**

అవినీతికి పాల్పడి చీరాల నియోజకవర్గంలో భూ కబ్జాలను,ఆక్రమణలను ప్రోత్సహిస్తూ వాస్తవాలను మరుగునపరచి అవాస్తవాలతో కూడిన తప్పుడు నివేదికలు సమర్పించి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని తప్పుదారి పట్టిస్తూ, రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు జరపకుండా కాలయాపన చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడిన చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్ నాయుడు మీద చట్టపరమైన చర్యలు చేపట్టి, ప్రభుత్వ భూములను, నివేశన స్థలాలను, కరకట్టలను కాపాడి అక్రమార్కులపై క్రిమినల్ చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతూ సీనియర్ జర్నలిస్టు ఎన్.నాగార్జున రెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు జిల్లాకలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను కలిసిన నాగార్జునరెడ్డి ఆధారంతో సహా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులతో విచారణ జరిపి అనంతరం తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లుగా నాగార్జునరెడ్డి మీడియాకు తెలిపారు. వేటపాలెం మండలం కొత్తపేట, చల్లారెడ్డిపాలెం పంచాయతీల పరిధిలో ప్రభుత్వ నివేశన స్థలాలను, వ్యవసాయ భూములను, కరకట్టలను ఆక్రమించిన వ్యక్తులపై పీజీఆర్ఎస్ నందు నమోదైన ఫిర్యాదులపై విచారణ అనంతరం భూ కబ్జాలు, ఆక్రమణలు రుజువైనప్పటికి, సంబంధిత పంచాయతీ రాజ్, రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వాస్తవాలను నివేదించకుండా పరస్పర విరుద్ధమైనతప్పుడు నివేదికలు సమర్పించి ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించారని నాగార్జునరెడ్డి ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో గత నవంబర్ 19వ తేదీన కలెక్టర్ కార్యాలయం జారీ చేసిన ఉత్తర్వులను ఈ రోజు వరకు అమలు చేయకుండా చీరాల ఆర్డీవో ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తున్నారని,భూ కబ్జాలు, ఆక్రమణలు వ్యవహారంలో నమోదైన పీజీఆర్ఎస్ ఫిర్యాదు బీపీటీ20250426170 విషయమై అడిషనల్ సెక్రటరీ,చీఫ్‌కమీషనర్ ఆఫ్‌ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్(సీసీఎల్ఏ) కార్యాలయం వారు జనవరి 7వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులను ఈ రోజు వరకు అమలు చేయకుండా విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తూ ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేస్తూ చీరాల ఆర్డీవో అధికార దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఫిర్యాదులో



పేర్కొన్నారు. దత్తక్షేత్రం, చేనేతపూరి కాలనీలలో ఖాళీ స్థలం గుర్తించి అర్హులకు మంజూరు చేసి, స్మశాన భూమి, పిల్లలకు ఆట స్థలం, కమ్యూనిటీ హాల్ తదితర ప్రజా అవసరాలకు భూమి కేటాయించి ప్రభుత్వం మీద ప్రజలకు మరింత విశ్వాసం పెంపొందే విధంగా తగుచర్యలు చేపట్టాలని నాగార్జునరెడ్డి కలెక్టర్‌ను కోరారు.

## నాగిశెట్టికి కరణం నివాళి



**బల్లికురవ, మార్చి 2, (ప్రభాతవార్త**

ప్రముఖ న్యాయవాది నాగిశెట్టి మోహన్ దాస్ దశదిన కర్మ సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మోహన్ దాస్ చిత్రపటానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగిశెట్టితో ఉన్న తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక నేతలు ఉన్నారు.

## ఉపాధి హామీ ప్రజా చైతన్య కార్యక్రమాలపై అవగాహన



**బల్లికురవ, మార్చి 2, (ప్రభాతవార్త**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల స్థానంలో వికసిత భారత్ రోజ్ గర్ ఆజీవికా మిషన్ చట్టంను ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 125 రోజులు పని దినాలను కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆరు వారాల పాటు మండలంలోని అన్ని గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో కుసుమకుమారి స్థానిక కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, ఉపాధి హామీ సిబ్బందికి కార్యక్రమం వివరాలను వివరించారు. మండలంలోని అన్ని గ్రామాలలో మార్చి నెలాఖరు వరకు అన్ని గ్రామాలలో నిర్వహించే ప్రజా చైతన్య కార్యక్రమాలలో మార్గదర్శకాలు, విధి విధానాల పట్ల ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు.

## అస్తవ్యస్తంగా యర్రగొండపాలెం ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం





**యర్రగొండపాలెం, మార్చి 2, (ప్రభాతవార్త**

యర్రగొండపాలెం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం పరిశుభ్రత, తాగునీరు, కూర్చునే సీట్లులేక సౌకర్యాల లేమితో ఇబ్బందికరమైన దుస్థితిలో ఉంది. రాత్రి వేళల్లో తగిన భద్రత, వెలుతురు లేకపోవడంతో బస్టాండ్‌లో కూర్చోవడానికి ప్రయాణికులు జంకుతున్నారు. ముఖ్యంగా మహిళలు ప్రాంగణంలో వెలుతురు లేకపోవడంతో రోడ్డు మీదకు వచ్చి బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. వైఎస్సార్ ప్రయాణ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. యర్రగొండపాలెం నుంచి హైదరాబాద్, కర్నూలు, మాచ్ల, విజయవాడ, గుంటూరుతో పాటు వివిధ ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణం చేస్తుంటారు. బస్టాండ్‌లో టీస్టాల్, టిఫిన్ హోటల్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. టీ తాగాలన్నా ప్రాంగణం దాటి బయటకు పోవాల్సిన పరిస్థితి ఉంది. కొందరు ప్రయాణికులు తెచ్చుకున్న వాటర్‌బాటిల్స్,తినుబండారాల ప్యాకెట్లు, కవర్లు ప్లాట్‌ఫాంలపై పడేస్తున్నారు. బస్టాండ్‌ను ప్రతి రోజు శుభ్రపరిచే పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో దుమ్ము ధూళితో బస్టాండ్ ఆవరణం నిండుకొని ఉంటుంది. ప్రయాణ ప్రాంగణం ముఖ ద్వారం గుండా బస్సు డ్రైవర్లు అవుట్, ఇన్ పాటించకపోవడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు బస్టాండ్‌లోకి వస్తుండడంతో బస్సులు ఎక్కేందుకు వెళ్తున్న ప్రయాణికులతో పాటు, దిగి వెళ్తున్న ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. మార్కాపురం ఆర్టీసీ వారు రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని బస్టాండ్‌లో దాతలతో మమేకమై వారి సహకారంతో మంచినీటి సౌకర్యం కల్పించే విధంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## రాజీ పడని రక్షకభటుడుకు ఘనమైన వీడ్కోలు

### - మంచితనానికి మారుపేరుగా నిలిచిన ఎస్సై సంపత్ కుమార్



**పుల్లలచెరువు, మార్చి 2, (ప్రభాతవార్త**

మండల కేంద్రమైన పుల్లలచెరువులోని పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్సైగా విధులు నిర్వహించిన ఎల్.సంపత్ కుమార్ ప్రజల్లో ఒక మంచి అధికారిగా గుర్తింపు పొందారు. ఆయన తన కర్తవ్య నిబద్ధత, తనదైన శైలిలో తన ధైర్యసాహసాలతో క్రమశిక్షణతో ప్రజల మన్ననలు పొందిన మంచి సేవాధికారిగా నిలిచారు. విధుల పట్ల ఎటువంటి జాప్యం లేకుండా శాంతి భద్రతల పరిరక్షణలో రాజీపడని ధోరణి, నేర నిర్మూలనలో చురుకైన చర్యలు, ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారంలో ముందుండే స్వభావం ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మండలంలో చోటు చేసుకున్న వివిధ ఘటనలను సమర్థంగా ఎదుర్కొంటూ, చట్టసమ్మత చర్యలు తీసుకోవడంలో ఎస్సై సంపత్ కుమార్ చూపిన దృఢసంకల్పం ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచింది. చిన్న చిన్న గొడవల నుండి ప్రధాన కేసుల దర్యాప్తు వరకు ప్రతి అంశంలో నిష్పాక్షికంగా వ్యవహరించి, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేశారు. పోలీసు శాఖ ప్రతిష్టను కాపాడుతూ ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడం ఆయన ప్రత్యేకతగా మారింది. ఇటీవల ఆయన బదిలీ నేపథ్యంలో నిర్వహించిన ఘన సన్మాన కార్యక్రమం హృదయానికి హత్తుకునేలా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యర్రగొండపాలెం సీఐ ఎస్సై సంపత్‌కుమార్‌కు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీసు శాఖకు అంకితభావంతో సేవలందించిన ఎస్సై సంపత్ కుమార్ సేవలు చిరస్మరణీయమని, ఎక్కడ విధులు నిర్వహించినా ప్రజలకు అండగా నిలుస్తారని, క్రమశిక్షణ, కర్తవ్య నిబద్ధత ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం అని కొనియాడారు. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ మా ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎస్సై సంపత్ కుమార్ చేసిన సేవలు గర్వకారణం. ప్రజల సమస్యలనువినిపించి తక్షణ చర్యలు తీసుకోవడంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారు అని అభినందించారు. ప్రజల మన్ననలు పొందిన ఈ సేవాధికారి భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అధిరోహించి రాష్ట్రానికి మరింత సేవలందించాలని ఆకాంక్షిస్తూ ఈ సన్మానం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రజా నాయకులు, పోలీసు అధికారులు,సిబ్బంది, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎస్సై సంపత్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పదవతరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేసిన దాత మిద్దె మనోజ్ కుమార్



**కంభం, మార్చి 2 (ప్రభాతవార్త**

కంభం మండలంలోని తురిమెళ్ళ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, యర్రబాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు దాత మిద్దె మనోజ్ కుమార్ మోటివేషన్ ట్రైనర్ లైఫ్ స్కిల్స్ కోచ్ చైల్డ్ గైడెన్స్ కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ ఇంగ్లీష్ ఫ్యాకల్టీ సోమవారం పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా చిన్ని ఎడ్యుకేషనల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత గురించి వివరించారు. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో భయం లేకుండా ధైర్యంగా పరీక్షలు రాసి అత్యధిక మార్కులు వచ్చేవిధంగా అవగాహన కల్పించారు. పదవతరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేసిన దాత మనోజ్ కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్, తురిమెళ్ళ జిల్లాఉన్నత పాఠశాల ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయులులంకా నరసింహారావు,యర్రబాలెం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయమే లక్ష్యం

### - మార్కాపురం జిల్లా పోలీసుల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 32 ఫిర్యాదుల స్వీకరణ



**మార్కాపురం, మార్చి 2,(ప్రభాతవార్త**

బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యంగా మార్కాపురం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక–మీకోసం (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. వి హర్షవర్ధన్‌రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు, మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు, పోలీస్ అధికారులు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన మొత్తం 32 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను సవివరంగా తెలుసుకున్న పోలీసులు, ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి సత్వర పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అందిన ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు పంపించి, త్వరితగతిన విచారణ పూర్తిచేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా భూ వివాదాలు, ఉద్యోగ మోసాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, చీటింగ్ కేసులు తదితర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించడంతో పాటు బాధితులకు తక్షణ సహాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు, గిద్దలూరు అర్బన్ సీఐ కె సురేష్, కంభం సీఐ కె మల్లికార్జునరావు తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

### - జిల్లాలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయి

### - వాటి పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి - జాయింట్ కలెక్టర్ పి .శ్రీనివాసులు



**మార్కాపురం, మార్చి 2,(ప్రభాతవార్త**

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి అలసత్వం చూపకూడదని పి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. సమస్యలపై వచ్చే ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పకూడదని, వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మార్కాపురం జిల్లాలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని పేర్కొంటూ వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా కొంతమంది జిల్లా అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గైర్హాజరవడంపై ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటినుంచి జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని, ప్రతి మంగళ,గురు, శనివారాల్లో గ్రామాలు, పట్టణాల్లోని ప్రభుత్వ హాస్పిటళ్లు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఆర్టీసీ బస్టాండ్‌లు, అన్నా క్యాంటీన్లు తదితరాలను తనిఖీ చేసి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పథకాల అమలు తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై మొత్తం 83అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లాగనుల శాఖ ఏజీ పోలిరెడ్డి,ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జెన్నెమ్మ, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఈఈ సురేష్‌బాబు, మార్కాపురం ఆర్డీఓ ప్రభాకర్, ఐసీడీఎస్ జిల్లా ఇన్‌చార్జి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల మధ్య మద్యం షాపా!

### - నిబంధనలు కాగితాలకే పరిమితమా! మహిళల ఆగ్రహం





**మార్కాపురం, మార్చి 2 (ప్రభాతవార్త**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం షాపులు లేదా బార్‌లు పాఠశాలలు, కళాశాలలు, దేవాలయాలు, ప్రార్థనా ప్రదేశాలు, ఆసుపత్రులు, పూర్తిగా నివాస ప్రాంతాలు సమీపంలో కనీసం 100మీటర్ల దూరంలో ఉండాలి. అలాగే రాష్ట్ర/జాతీయ రహదారుల నుంచి 500లమీటర్ల పరిధిలో షాపులు ఏర్పాటు చేయరాదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఈ నిబంధనలకు విరుద్ధంగా మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్ వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన డీఎస్‌ఆర్ బార్ అండ్ రెస్టారెంట్ను తక్షణమే తొలగించాలని స్థానిక మహిళలు తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ బార్‌కు కేవలం 30అడుగుల దూరంలో రామాలయం ఉండగా, మరోవైపు జిల్లా పరిషత్ బాలికల–బాలుర ఉన్నత పాఠశాలలు, రెడ్డి మహిళా కళాశాలలు ఉన్నాయి. ప్రతిరోజూ వందలాది విద్యార్థినులు–విద్యార్థులు ఈ మార్గం గుండా పాఠశాలలకు వెళ్తుండటంతో, ఇలాంటి సున్నిత ప్రాంతంలో బార్ నిర్వహించడం వల్ల విద్యార్థుల భద్రత, మహిళల గౌరవం, ప్రాంతీయ శాంతి భద్రతలకు ముప్పుగా మారిందని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. బార్‌కు ఆనుకొని కూరగాయలు, పండ్లు తదితరాలు అమ్ముకునే చిరు వ్యాపారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మద్యం మత్తులో అసభ్య ప్రవర్తన, గొడవలు జరుగుతున్నాయని ఆరోపించారు. నిరసన అనంతరం మహిళలు ఈ సమస్యను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే ఎక్సైజ్ అధికారులను పిలిపించి బార్‌ను పరిశీలించి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుని అక్కడి నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. మహిళల ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనకు అధికారులు స్పందించడంతో, డీఎస్‌ఆర్ బార్ అండ్ రెస్టారెంట్ తొలగింపునకు చర్యలు తప్పవని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## భక్తుల మొక్కు తీర్చుకునేందుకు 365 రోజులు

### - పంచామృతాలతో గణశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహణ



**త్రిపురాంతకం, మార్చి 2,(ప్రభాతావార్త**

మండలలోని గణపవరం గ్రామంలో పురాతనమైన ఆలయంలో కొలువై ఉన్న గణపేశ్వరస్వామి భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజల్లుతు నిత్య పూజలందుకొంటున్న గణపేశ్వర స్వామి. గణపవరం గ్రామంలోని భక్తులు వేకువ జామున లేచి చన్నీటి స్నానాలను ఆచరించి, నియమ నిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో గణపేశ్వర స్వామికి ఆలయానికి ప్రత్యేక ప్రదక్షి ణలను చేసి, కర్పూర నీరాజనాలను సమర్పించి ప్రత్యేక పూజలను చేస్తుంటారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు సాయి సత్యనారాయణ శర్మ మాట్లాడుతూ కొన్ని ఏళ్ల సంవత్సరాల క్రితం గణపేశ్వర స్వామి త్రిపురాంతకం మండలంలోని గణపవరం గ్రామంలో కొలువు తీరి ఉన్నారని, ఈ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన వారికి కోరిన కోరికలు తీర్చేందుకు ఇక్కడ కొలువై ఉన్నాడని అర్చకులు తెలిపారు. గణపేశ్వర స్వామి వారి పేరున ఈ గ్రామానికి పూర్వీకులు గణపవరంగా నామకరణం చేసినట్లు తెలుస్తోందని అందుకనే గణపవరం గ్రామానికి ఈ పేరు వచ్చిందని ఇంతటి మహిమాన్వితమైన స్వామి ఇక్కడ కొలువై ఉన్నారని కావున ప్రతి ఒక్కరు స్వామి వారిని దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలను చేసి పాప దోషాలను తొలగిపోయి సిరిసంపదలు చేకూరుతాయని అర్చకులు తెలిపారు.

### దాతల సహకారంతో శ్రీకాశినాయన దగ్గర భక్తులకు భోజనం ఏర్పాటు



**గిద్దలూరు, మార్చి 2, (ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణమునందు వెలసి ఉన్న శ్రీశ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమం నందు దాతల సహకారంతో సోమవారం భక్తులకు భోజనం ఏర్పాటు చేశారు. ముందుగా శ్రీ కాశినాయనకి ఉదయం అభిషేకం చేసి నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి పండితులు పూజచేసి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందించారు. పాల్గొన్న భక్తులకు సామాన్య ప్రజలు పేదలకు నిరుపేదలైనటువంటి వారికి దాత చిత్తా రఘుపతి రెడ్డి, ఆదిలక్ష్మమ్మ, ఏరువ రమణారెడ్డిలు భోజనం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ టీచర్ బిఎస్ నారాయణరెడ్డి, సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, ఫౌండేషన్ వారు విశ్రాంత సూపరెంటెంట్ పాలుగుల్ల కాశిరెడ్డి, విశ్రాంత లెక్చరర్ వడ్డీ వీరారెడ్డి, విశ్రాంత ఆర్టిసి కంట్రోలర్ వెంకటేశ్వర్లు, విశ్రాంత సర్వేయర్ రెడ్డి, మల్లారెడ్డి గంగంపల్లి ఆదినారాయణ రెడ్డి, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి లింగారెడ్డి, టీ కొట్టు నారాయణమ్మ, చిల్లర్ దుకాణం లక్ష్మీదేవి, అమ్మ కాశినాయన భక్తులు పాల్గొన్నారు.

## మార్కాపురం రేస్ ఇన్‌స్టిట్యూట్‌కు మరో ఘనత

### - ముగ్గురు విద్యార్థులు బ్యాంక్ క్లర్కులుగా ఎంపిక



**మార్కాపురం, మార్చి 2,(ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని రామానుజన్ అకాడమీ ఆఫ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ (రేస్) కోచింగ్ సెంటర్ నుంచి శిక్షణ పొందిన ముగ్గురు విద్యార్థులు వివిధ జాతీయాకృత బ్యాంకుల్లో క్లర్కులుగా ఎంపిక కావడం గర్వకారణమని సంస్థ గౌరవ సలహాదారులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలాని, డైరెక్టర్ బత్తుల లక్ష్మీనారాయణ తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబిపిఎస్) నేడు ప్రకటించిన ఫలితాలలో రేస్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. విజేతలు –పఠాన్ తాహూర్ (రోల్ నం: 1143005412) – పంజాబ్ నేషనల్ బ్యాంక్, యలకపాటి హెప్సిబా (రోల్ నం: 1143013189) – పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, కురవటి వెంకటేష్ (రోల్ నం 3263000787) – సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లకు సెలెక్ట్ అయ్యారు. ఈ ముగ్గురూ కస్టమర్ సర్వీస్ అసోసియేట్స్ (సిఎస్ఏ) హోదాలలో ఎంపికయ్యారని ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఇన్స్టిట్యూట్ మేనేజ్మెంట్ ఘనంగా సన్మానించింది. రేస్ ఇన్స్టిట్యూట్‌లో అందిస్తున్న నాణ్యమైన బోధన, క్రమబద్ధమైన మాక్ టెస్టులు, పరీక్షా పేపర్ల విశ్లేషణ తరగతులు తమ విజయానికి దోహదపడ్డాయని విజేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేస్ అధ్యాపకులు నాగేశ్వరరావు, సుబ్బయ్య, నర్సయ్య, కృపాచారి, సత్యనారాయణ, వెంకట్, ప్రదీప్, శ్రీనివాస్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

### స్పెషల్ డ్రైవ్ ద్వారా ఒక్క రోజుల్లో ఒక లక్ష రూ.10వేలు గ్రామ పంచాయతీ పన్నులు వసూళ్లు



**సంతనూతలపాడు, మార్చి 2, (ప్రభాతవార్త**

జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు సోమవారం నాడు సంతనూతలపాడు కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ ద్వారా ఒక లక్ష పది వేల రూపాయలు హౌస్ టాక్స్, నాన్ టాక్స్ కలెక్షన్‌ను ఈ మేరకు వసూళ్లు చేసినట్టు పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో యు.అరుణ్ కుమారి పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది తాము ఈ మేరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి ముమ్మర పన్నుల వసూళ్ల కార్యక్రమాన్నిచేపట్టినట్టు సంతనూతలపాడు పంచాయతీ అభివృద్ధిఅధికారి ఆర్.శ్రీనివాసులు పేర్కొన్నారు.కందుకూరు డీఎల్‌డీఓ, హౌస్ టాక్స్ స్పెషలాఫీసర్ డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాక్లాగ్ పోస్టుల ఖాళీలను గుర్తించి భర్తీ చేయాలి



**ఒంగోలు ,మార్చి 2,(ప్రభాతవార్త**

దివ్యాంగుల పరిరక్షణకు సంబంధించి వివిధ సంఘాల నుండి వచ్చిన వినతులను పరిశీలించి ప్రభుత్వం ఈ క్రింది విధంగా ఆదేశాలు జారీ చేసింది. తేదీ. 31.03.2026 నాటికి అన్ని ప్రభుత్వ శాఖలలో దివ్యాంగులకు సంబంధించిన బ్యాక్లాగ్ పోస్టుల ఖాళీలను గుర్తించి ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం ప్రతి ప్రభుత్వశాఖలో 4 శాతం రిజర్వేషన్ తప్పనిసరిగా అమలు చేయాలని 2025–26 సంవత్సరానికి దివ్యాంగులకు ఉద్యోగ నోటిఫికేషన్‌ను ప్రత్యేక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాము. గ్రామీణ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులకు కూడా సులభంగా దరఖాస్తు చేసుకునే విధంగా ఆన్లైన్ విధానాన్ని రూపొందించాలి. వయస్సు సడలింపు : క్లాస్–4 ఉద్యోగాలకు గరిష్టంగా 10 సంవత్సరాల పెంచటం జరిగింది. ఆ వయస్సు సడలింపు కల్పించాలని కోరడం జరిగింది.ఇతర ఉద్యోగాలకు గరిష్టంగా 20సంవత్సరాల వయస్సు సడలింపు కల్పించవలెను.గరిష్ట వయస్సు పరిమితి 52 సంవత్సరాల వరకు ఉండవలెను.40శాతం వైకల్యంతోవైద్య ధృవీకరణ పత్రం(సదరం సర్టిఫికెట్), ఆధార్ కార్డు, నివాస ధృవీకరణ పత్రం తప్పనిసరి,జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి అర్హులైన దివ్యాంగులను ఎంపిక చేయవలెను.ప్రతి నాలుగు నెలలకు ఒకసారి జిల్లా అధికారులు సమావేశమై ఉద్యోగ భర్తీ పురోగతిని సమీక్షించవలెను.ప్రభుత్వ ఉత్తర్వులను సంబంధిత అన్ని ప్రభుత్వశాఖలు తక్షణమే అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. దివ్యాంగుల సంక్షేమ శాఖ నిర్లక్ష్యం కారణంగా నేటికీ పలు ప్రభుత్వ శాఖలు రోస్టర్ వెరిఫికేషన్ కు రావటం లేదు ఇప్పటికైనా తమరు ప్రత్యేక చొరవ తీసుకొని తమ ఛాంబర్‌లో అన్ని దివ్యాంగ సంఘాల నాయకులతో పాటు రోస్టర్ వెరిఫికేషన్ జరిపించాలని కోరిన వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది పి. మాధవరావు, కే.పూర్ణచంద్రరావు,చిలుకూరి రాజశేఖర్ రెడ్డితదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాలు తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవు : తహశిల్దార్ చిరంజీవి

### - వాగు పోరంబోకు ఆక్రమణపై అధికారులు ఉక్కుపాదం



**మార్కాపురం, మార్చి 2,(ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా, మార్కాపురం మండలం, పెద్ద నాగులవరం గ్రామంలో సర్వే నెం. 173/1ఏ లోని వాగు పోరంబోకు భూమిని అక్రమంగా ఆక్రమించి పశువుల షెడ్ నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల మేరకు తహశిల్దార్ కె చిరంజీవి చర్యలు చేపట్టారు. సంబంధిత రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్‌లతో కలిసి స్థల పరిశీలన చేసి సర్వే నిర్వహించారు. వాగు పోరంబోకు భూమిలో పశువుల షెడ్ నిర్మాణం జరుగుతున్నట్లు నిర్ధారణ కావడంతో వెంటనే నోటీసులు జారీ చేశారు. అక్రమ నిర్మాణాలు తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## ఏపీటీఎఫ్ పోరుబాటకు సిద్ధం

### - ఒంగోలులో కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల ధర్నా

**మార్కాపురం, మార్చి 2, (ప్రభాతవార్త**

ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్రవ్యాప్తంగా పోరుబాటకు సిద్ధమైంది. ప్రభుత్వ విధానాల వల్ల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిల చెల్లింపు, బదిలీలు–పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయడం, పాఠశాలల విలీన నిర్ణయాలపై పునఃసమీక్ష చేయడం వంటి ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రాలు, మండల స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తూ ఉపాధ్యాయులను ఉద్యమానికి సమాయత్తం చేస్తున్నట్లు ఏపీటీఎఫ్ నాయకత్వం ప్రకటించింది. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేసింది.

## రాచర్ల మండలంలో వైసీపీ నుండి టిడిపిలోకి భారీ చేరికలు

### - ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సమక్షంలో 25 కుటుంబాల చేరిక





**రాచర్ల, మార్చి 2 (ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా రాచర్ల మండలం జెన్నివారి పుల్లల చెరువు గ్రామంలో రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి, పేదలకు అందించే పథకాలకు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గ్రామాలకు చేస్తున్న అభివృద్ధిని తెలుసుకొని గ్రామ పార్టీ అధ్యక్షుడు మేకల తిరుపాల్, రంగస్వామి గుండం దేవస్థానం చైర్మన్ సిద్ధం నరసింహులు, ఆది నారాయణ ఆధ్వర్యంలో సర్పంచ్ షేక్ ఖాసింబీ, పలువురు వార్డు సభ్యులు కలిసి మొత్తం 25 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీను వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, గ్రామాభివృద్ధే లక్ష్యంగా టిడిపి పనిచేస్తుందని, పార్టీని బలోపేతం చేయడంలో కొత్తగా చేరిన కుటుంబాలు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల విశ్వాసంతో టిడిపిలో చేరినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో గ్రామంలో పార్టీ మరింత బలపడుతుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. గ్రామంలో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ చేరికలతో రాచర్ల మండలంలో టిడిపి బలం మరింత పెరిగిందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కటిక యోగానంద్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ గోపిరెడ్డి జీవన్ రెడ్డి, 1 వ వార్డు మెంబర్ షేక్ షర్మిల, 3వ వార్డు మెంబర్ కర్ణసాని పూర్ణ , 4వ వార్డు మెంబర్ బోయిల్లా రమాదేవి, షేక్ మోలాలి, షేక్ ఖాజా మొహిద్దిన్, బిచ్చపోగు బాలరాజు, శ్రీకాంత్, దేవరాజు గట్టు రామక్రిష్ణ, బొర్రా చంటి, బి లక్ష్మయ్య, జి రామయ్య డి జాను పి మరియన్న కే.బాలస్వామి బి.తామస్, జి సభాస్టిన్, వై ఆరోగ్యస్వామీ, సంకుల రంగస్వామి,చెంచు సవరం శ్రీను, పి.అనంతరాజు, ఎం.ప్రసాద్, జి.రాములు,పి రాజశేఖర్,ఈ భాస్కర్ తదితరులు గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు.

## ఎస్సైని పరామర్శించిన అప్పిశెట్టి



**రాచర్ల, మార్చి 2 (ప్రభాతవార్త**

రాచర్ల ఎస్ఐ పి కోటేశ్వరరావును గిద్దలూరు బిజెపి పట్టణ అధ్యక్షుడు అప్పిశెట్టి ఉదయ శంకర్ సోమవారం రాచర్ల పోలీస్ స్టేషన్‌లో పరామర్శించారు. ఆయన ఇటీవల విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు కాలు ఫ్రాక్చర్ అయి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న అప్పిశెట్టి ఉదయ్ శంకర్,గిద్దలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పగడాల రంగస్వామి, రాచర్ల మండల బిజెపి కన్వీనర్ డి మహేష్‌లతో కలిసి ఎస్సై పి.కోటేశ్వరరావును పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని,మరల యధావిధిగా బాధ్యతల్లో పాలుపంచుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, వారు ఆకాంక్షి ంచారు.

## ఇళ్ల పన్నులను చెల్లించి గ్రామాల అభివృద్ధికి నడుం బిగించండి

### - ఎంపీడీవో సురేష్‌బాబు వెల్లడి



**సంతనూతలపాడు, మార్చి 2, (ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరూ ఇళ్ల పన్నులను చెల్లించి గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు కోరారు. సంతనూతలపాడు మండలం మైనంపాడు, మంగమూరు గ్రామాల్లో సోమవారం నాడు ఎంపీడీవో సురేష్‌బాబు పర్యటించి గ్రామస్తులతో ఆయన సమీక్షించారు.ప్రతి ఒక్కరూఇంటిపన్నులకు సహకరించా లన్నారు. గ్రూపులో ఉన్న మహిళలు కూడా ఇంటి పన్నులు వసూళ్లు చేయడంలో నడుం బిగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు ఇళ్ల పన్నులు వసూళ్ల ప్రక్రియపై పాటుపడాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పన్నులు చెల్లించిన వారికి ఎంపీడీవో సురేష్‌బాబు ఆన్‌లైన్ రసీదులను పంపిణీ చేశారు. మంగమూరు గ్రామంలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా 69 లక్షల 30 వేల రూపాయలతో జల జీవన్ మిషన్ పనులను ఎంపీడీవో సురేష్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం టి.బాబురావు, మండల ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ బి.మధుసూదన్‌రావు, మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, పంచాయతీ అభివృద్ధి అధికారులు ఎన్.ప్రతాప్ కుమార్, ఆవులయ్య, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవ వేడుకలు







**సంతనూతలపాడు, మార్చి 2, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన సంతనూతలపాడులోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవ వేడుకలు ఈ నెల 2న సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఫిబ్రవరి 27వ తేదీన ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవ వేడుకలు నాలుగు రోజులు పాటు ఘనంగా జరిగాయి. ముఖ్యంగా ఈనెల 1వ తేదీన శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కళ్యాణ్ మహోత్సవాన్ని గుంటూరుకు చెందిన వేద పండితులు నల్లూరి జగదీష్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాంకుశం అజయ్‌బాబు చార్యులు ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ కమిటీ పర్యవేక్షణలో దాతలు సహకారంతో ఈ బ్రహ్మోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. మార్చి2న సోమవారంతో ఈ వేడుకలు ముగిశాయి. వేద పండితులు నల్లూరి జగదీష్ కుమారాచార్యులు పర్యవేక్షణలో పలువురు బృందం వీటిని నిర్వహించారు. సంతనూతలపాడులో ఈ బ్రహ్మోత్సవ వేడుకలు ఒక పండుగ వాతావరణంలో రెండో పర్యాయం వైభవంగా జరిగాయి. శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతలు సహకారంతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. సోమవారం నాడు జరిగిన వేడుకలకు ఉభయ దాతలుగా నూకల వెంకటేశ్వర గుప్తా, వెంకట లక్ష్మీ సుభాషిని కుటుంబీకులు, వావిలాల వెంకట సుబ్రహ్మణ్యం శర్మ, లలితాదేవి కుటుంబీకులు వ్యవహారించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆలయ కమిటీ పర్యవేక్షణలో దాతల సహకారంతో అన్నదాన వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు విశేషంగా హాజరయ్యారు. ఆర్యవైశ్య మహిళలచే కోలాట ప్రదర్శన నిర్వహించారు.

### శ్రీ వెంకటేశ్వరస్వామి వారి అవతారంలో ఆకట్టుకున్న భక్తుడు మహేష్



**సంతనూతలపాడు, మార్చి 2, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ద్వితీయ వార్షికబ్రహ్మోత్సవ వేడుకల్లో సంతనూతలపాడుకు చెందిన భక్తుడు తాళ్లూరి మహేష్ శ్రీ వెంకటేశ్వరస్వామి వేష అవతారంలో పలువురిని ఆకట్టుకున్నారు.సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి అవతారం ధరించిన మహేష్‌ను పలువురు మహిళలు, ప్రజలు, భక్తులు ప్రత్యేకంగా ప్రశంసించారు.

## మండల విద్యుత్ ఏఈఈగా గోపి బాధ్యతలు స్వీకరణ



**సంతనూతలపాడు, మార్చి 2, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండల విద్యుత్ శాఖ నూతన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పర్లపల్లి గోపి సోమవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. గోపి చీమకుర్తి విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో జూనియర్ ఇంజనీర్‌గా పని చేస్తూ పదోన్నతిపై సంతనూతలపాడు మండల విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ ఒంగోలు డి 4 విద్యుత్ కార్యాలయం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.సంతోష్ మండల విద్యుత్ శాఖ ఇన్‌ఛార్జి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా గత చాలా సంవత్సరాల నుండి పని చేస్తున్నారు. సంతోష్ స్థానంలో గోపిని రెగ్యులర్ మండల విద్యుత్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతిపై బదిలీ చేసి నియమించారు.

## నేడు చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాల మూసివేత



**మార్కాపురం టౌన్, మార్చి 2, ప్రభాతవార్త**
చంద్రగ్రహణం సందర్భంగా మార్కాపురం పట్టణంలోని శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయంతో పాటు పరిసర ప్రాంతంలోని పలుదేవాలయాలు కూడా మూసి వేయనున్నట్లు శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవస్థానంలో మార్చి 3 (మంగళవారం) పాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున మధ్యాహ్నం 3:20 గంటల నుండి సాయంత్రం 6:50 గంటల వరకు చంద్రగ్రహణం ఉండనున్న నేపథ్యంలో, మంగళవారం ఉదయం 9:00 గంటల నుంచే భక్తుల దర్శనాలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. గ్రహణం అనంతరం మార్చి 4 (బుధవారం) ఉదయం 6:00 గంటల నుండి ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తిరిగి దర్శనానికి అనుమతి ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

### మాటలతో కడుపు నింపిన సీఎం... ప్రజలు కోరుతోంది నిధులు.. అభివృద్ధి

### - వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్



**మార్కాపురం టౌన్, మార్చి 2, ప్రభాతవార్త**
మార్కాపురం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జిల్లా నిధులు మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చూపుతారని ప్రజలు ఆశిస్తే అందుకు విరుద్ధంగా మాటలు చెప్పిన జనం కడుపు నింపే ప్రయత్నం సీఎం చంద్రబాబు చేశారని వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ విమర్శించారు. ప్రజలు కోరుతోంది మాటలతో కడుపు నింపడం కాదు తమ జిల్లాకు నిజమైన అభివృద్ధి అని ఆయన గుర్తుచేశారు. చంద్రబాబు నాయుడు పాలనలో కాలమంతా అబద్దపు ప్రచారాలతో, అబద్దపు మాటలతోనే కాలం వెళ్ళబుచ్చుతున్నారన్నారు. వెలుగొండ ప్రాజెక్టు మొదలుపెట్టిన 30 సంవత్సరాల కాలంలో వారి పాలనలో ఎంత వరకు వెలుగొండ ప్రాజెక్టు పనులను పూర్తిచేశారని ప్రశ్నించారు. అబద్ధపు మాటలతో కొంత కాలం మభ్యపెట్టగలరు గానీ అను నిత్యం మోసం చేయలేరు అన్న వాస్తవాన్ని సీఎం చంద్రబాబు గ్రహిస్తే బాగుంటుందని ఆయన సూచించారు. చంద్రబాబు మాటలు ఎవరికి కావాలి తమకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారని ఆయన వెల్లడించారు. చంద్రబాబు మాటల సీఎం అన్నది మరోసారి రుజువైందని, అందుకే చేతల సీఎంగా పేరుగాంచిన వైయస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకొంటున్నారని ఆయన వెల్లడించారు. ప్రజలకు కూడా ధైర్యంగా ఉండాలని వచ్చేది మళ్లీ వైసీపీ ప్రభుత్వమేనని, మీకు మేలు చేసేది చేతల సీఎం జగనేనని ఆయన పేర్కొన్నారు.

## ఉగాది పురస్కరించుకుని నంది అవార్డుల ప్రధానోత్సవం



**ఒంగోలు కల్చరల్, మార్చి 2 ,ప్రభాతవార్త**
మెగా హెల్పింగ్ ఫౌండేషన్, మెగా ఈవెంట్స్ ఆల్ కేటగిరిస్ అవార్డుల ప్రధానోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పరాభవ నూతన ఉగాదిని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాలు సంబంధించి దేవస్థానంలో అర్చన చేసే అర్చకులకు బిర్లా సైన్స్ మ్యూజియం హైదరాబాదులో మాజీమంత్రి డాక్టర్ వేణుగోపాల చారి, బాబు మోహన్. ప్రముఖ ప్రొడ్యూసర్, వ్యాపారవేత అంబికా దర్బార్ బత్తి అంబికా కృష్ణ మెగా ఈవెంట్ ఆర్గనైజర్ శైలజా రెడ్డి వారి చేతుల మీదుగా ప్రకాశం జిల్లా ఒంగోలు అర్చకులు రాము శర్మ ఐకానిక్ నంది అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెండు రాష్ట్రాల నుండి అర్చకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు రాము శర్మను ఒంగోలు దేవస్థానం అర్చకులు అభినందనలు తెలిపారు.



## మండలపరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం

### - రాజకీయనేతలకి స్త్రీనిధి రుణాలు - ఎంపీటీసీ రవీంద్ర

### - అధ్వానంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ-ఎంపీడీవో

### - తాగునీటి ఎద్దడి పట్ల అప్రమత్తంగా ఉండండి-జెడ్పీటీసీ




**కందుకూరు మార్చి 2, ప్రభాతవార్త**
రానున్నవేసవిలో తాగునీటి ఎద్దడి పట్ల అప్రమత్తంగా ఉండాలని వలేటివారిపాలెం జెడ్పీటీసీ ఇంటూరి భారతి అధికారులుకు సూచించారు. సోమవారం మండల పరిషత్ ప్రాంగణంలో సర్వసభ్య సమావేశం జరిగింది.ఎంపీడీవో వై.శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షత వహించారు.జెడ్పీటీసీ భారతి ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. తాగునీటి వనరులైన చుండి-చెర్లోపాలెం,రాళ్లపాడు-రోళ్లపాడు ప్రాజక్టులతోపాటు ఆయా గ్రామాల రక్షితపథకాలు,తాగునీటి బోర్లు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.ఈ సందర్భంగా పలువురు అధికారులు వివరిస్తున్న ఆయా శాఖల పనితీరుపై ఎంపీటీసీ సభ్యులు చింతలపూడి రవీంద్ర,స్వర్ణ నరసింహాలు ఆక్షేపించారు.ధ్వజమెత్తారు.

### వెలుగుశాఖపై ధ్వజం:

వెలుగు ఏపీఎం శ్రీనివాసులు తన ప్రసంగంలో మహిళాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఉన్నతిపథకంద్వారా 54మందికి రూ.54లక్షలు మంజూరు చేశామన్నారు.ఈ సందర్భంగా పోలినేనిపాలెం ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర పలు ఆరోపణలు చేశారు.మహిళాభివృద్ధి,సాధికారిత ఎక్కడైనా ఉందాఅని ప్రశ్నించారు.ఒక్కరైనా యూనిట్ నెలకొల్పారా అని అడిగారు.కూలీనాలీ చేసి ప్రతినెలా ఈఎంఐ చెల్లిస్తున్నారే తప్ప స్వయం సముపార్జన ఉందా అని ఆయన నిలదీశారు.అదేవిధంగా 2014-19లో స్త్రీనిధి నిధులు దారి మళ్లి రాజకీయనాయకులు జేబుల్లోకి వెళ్లాయని ఆరోపించారు.దీనితో రికవరీలో మండలం వెనకబడిందన్నారు.వైద్యశాఖలో హాస్పటల్ అభివృద్ధి కమిటీ సమావేశాలు ఏమైనాయని ఆయన డా॥ శివసిద్ధప్పను ప్రశ్నించారు.ఇక నుంచి నిబంధనలమేరకు సమావేశాలుంటాయన్నారు. ప్రజలకు ఉపయోగపడని పనులు ఇంకా ఎన్నాళ్లు చేస్తారని ఏపీవో దయాసాగర్‌ని ఎంపీటీసీ నిలదీశారు.

### అధ్వానంగా అంగన్‌వాడీ కేంద్రాలు: ఎంపీడీవో

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ మండలంలో 53అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 1347పిల్లలు,147మందిగర్భవతులు,175 బాలింతలుకు కోడిగ్రుడ్లు,పాలు,చిక్కీలు,బాలామృతం తదితర పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీడీవో శంకరరావు మాట్లాడుతూ ఈ కేంద్రాలనిర్వహణ అధ్వానంగా ఉందన్నారు.ఇటీవల పలుకేంద్రాల పనితీరును తాను పరిశీలించానన్నారు.రికార్డులకు క్షేత్రస్థాయి పరిస్థితికి పొంతనలేదన్నారు.కార్యకర్తలు కనీసం రికార్డులు కూడా సరిగా మెయింటైన్ చేయడం లేదన్నారు.ఈకేంద్రాలను దారిలోపెట్టాలని ఆయన అధికారులకు సూచించారు .అంగన్‌వాడీ కేంద్రాలలో సన్నబియ్యం జాడే లేదని కలవళ్ల ఎంపీటీసీ స్వర్ణ నరసింహం అన్నారు.

### పన్ను చెల్లించండి: ఈవోఆర్డీ

ఇంటిపన్ను,విద్యుత్ పన్ను సకాలంలో చెల్లింపుకు సహకరించాలని ఈవోఆర్డీ ఎం.వి.నారాయణ రావు,విద్యుత్ ఏఈ మధుబాబు సభ్యులకు సూచించారు. పంచాయతీల విద్యుత్‌బకాయి వివరాలను తెలియచేయాలని విద్యుత్‌శాఖకు ఈవోఆర్డీ సూచించారు.మధుబాబు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల షాపులకు విద్యుత్ రాయితీ ఉందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలన్నారు.విద్యుత్ బకాయి చెల్లించాలని కోరారు.

### సిబ్బంది కొరత:ఎమ్మెల్యేకి విజ్ఞప్తి :

మండలంలో సిబ్బంది కొరత బాగా ఇబ్బందిగా ఉందని ఎంపీడీవో శంకరరావు తెలిపారు.21పంచాయతీలకు కేవలం 7గురే కార్యదర్శులున్నారని ఆయన వివరించారు.ఎదరవుతున్న ఇబ్బందులున అదిగమించెందకు ఉన్నతాధికారులతోపాటు స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశరరావుకు విజ్ఞప్తి చేశానన్నారు. పాఠశాలలను తరచూ పరిశీలించాలని ఎంఈవో మాల్యాద్రిరెడ్డికి ఎంపీడీవో సూచించారు.మండలంలో పల్లెపండుగ పథకంలో బాగంగా రూ.3.5కోట్లతో చేపట్టిన 22పనులు వివిద దశల్లోఉన్నాయని పీఆర్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.రోళ్లపాడు, కొండసముద్రం శింగమనేనిపల్లె, నలదలపూరు తదితర గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణం చివరిదశలో ఉందన్నారు. ప్యూటీ తహసిల్దార్ మధుసూదనరావు,ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజశేఖర్‌లు ఆయాశాఖల పనితీరు వివరించారు.ఈ కార్యక్రమం లో ఏవో నరేంద్రదేవ్ హౌసింగ్ సుబ్రహ్మణ్యంపలువురు ఎంపీటీసీలు,పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు

### నోరుమెదపని సభ్యులు:

త్వరలో ఎంపీటీసీలు సభ్యులు సర్పంచ్‌లు పదవీ కాలం త్వరలో ముగియనుంది. అయినా గత ఐదేళ్లగా ఒకరు అర మినహా మిగిలిన సభ్యులు ఎవరూ గ్రామాల సమస్యలపై సభలో గళమిప్పిన దాఖలాలు లేవు.గత ఎంపిక సమయంలో అప్పటి రాజకీయాల నేపద్యంలో స్థానికేతర నివాసముంటున్న వ్యక్తులుకు, ఇతర రంగాలలో స్థిరపడిన వ్యక్తులను సభ్యులుగా ఎంపికచేయడంతో వారు ఏనాడు సమస్యలపై మాట్లాడినా దాఖలాలులేవు.

## కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన టిడిపి నేతలు



**మార్కాపురం టౌన్, మార్చి 2, ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం నందు, కందుల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ అధికారుల తో కలిసి టిడిపి నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి,మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డిలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక మార్కెట్ యార్డు నందు ప్రారంభించిన ఈ కందుల కొనుగోలు కేంద్రాన్ని మార్కాపురం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కేంద్రం కంది సాగు చేసిన రైతులకు ఎంతో మేలు కలిగిస్తుందని సూచించారు. రైతుల సంక్షేమానికి టిడిపి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం పిఎసిఎస్ చైర్ పర్సన్ జవాజి రామాంజనేయులు రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చీరాలలో అనుమతులు లేకుండా సెల్ టవర్ నిర్మాణం

### - జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం

### - స్థానికుల ఆందోళన




**చీరాల, మార్చి 2, ప్రభాతవార్త**
చీరాల పట్టణంలోని వుడ్ నగర్ ప్రాంతంలో అనుమతులు లేకుండా సెల్ టవర్ నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ శశి బాబు నివాస సమీపంలో డాక్టర్ ఎక్స్ రే సెంటర్ ఎదుట ఉన్న బహుళ అంతస్తు భవనంపై ఈ టవర్ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు సమాచారం. స్థానికుల వాదన ప్రకారం, ఈ నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ అధికారుల అనుమతులు తీసుకోలేదని, అలాగే పరిసర ప్రాంత ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో 60 సంవత్సరాలు పైబడిన వైద్యులు, వృద్ధులు, కుటుంబాలు అధికంగా నివసిస్తున్నారని వారు పేర్కొన్నారు. సెల్ టవర్‌ల నుంచి వెలువడే ఎలక్ట్రోమాగ్నెటిక్ రేడియేషన్ వల్ల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు, నిద్ర లేమి, నరాల బలహీనత వంటి సమస్యలు ఉద్భవించవచ్చని వారు భయపడుతున్నారు. వృద్ధులు , ఇప్పటికే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఇది మరింత ప్రమాదకరమని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని స్థానిక వైద్యుడు డాక్టర్ శశి బాబు మున్సిపల్ కమీషనర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, తగిన స్పందన రాలేదని తెలిపారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాన్ని తేలికగా తీసుకోవడం సరికాదని వారు పేర్కొన్నారు. దీంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు బాపట్లలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. టవర్ నిర్మాణానికి సంబంధించిన అనుమతుల వివరాలు వెల్లడించాలని, నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి పూర్తి స్థాయి పరిశీలన చేయాలని వారు డిమాండ్ చేశారు.

### బైరెడ్డి సిద్దార్థరెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వైకాపా నాయకులు అంజిరెడ్డి



**కొనకనమిట్ల, మార్చి 2, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాప్ చైర్మన్, వైకాపా యూత్ నాయకులు బైరెడ్డి సిద్దార్థ రెడ్డి జన్మదిన వేడుకల్లో కొనకనమిట్ల మండల రైతు విభాగం అధ్యక్షులు, వైకాపా యూత్ నాయకులు పునుగోటి అంజిరెడ్డి పాల్గొన్నారు. సిద్దార్థరెడ్డికి శాలువా కప్పి, పూలమాలలు వేసి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## రాష్ట్ర పునర్నిర్మాణానికి సీఎం, డిప్యూటీ సీఎం శ్రీకారం

### - గత వైసీపీ హయాంలో నిర్వీర్యమైన వ్యవస్థలు

### - జిల్లాలో జనసేన పార్టీ పటిష్టతకు చర్యలు

### - జనసేన పార్టీలో బాలినేనికి సముచిత స్థానం

### - బాలినేనితో భేటీ అయిన కొణతాల రామకృష్ణ



**ఒంగోలు, ప్రభాతవార్త**
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన రాష్ట్ర పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు శ్రీకారం చుట్టారని జనసేన పార్టీ సభ్యత్వ ఒంగోలు పార్లమెంటు పరిశీలకుడు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం బాలినేని నివాస గృహంలో గంటపాటు జనసేన పార్టీ పటిష్టత గురించి కార్యకర్తల్లో ఉన్న అసంతృప్తిని పార్టీలో చేపట్టాల్సిన సభ్యత్వ నమోదు కార్యక్రమంగురించి ఇరువురు చర్చించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన వ్యవస్థలను అన్నింటిని మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం అధికారంలో వచ్చాక అభివృద్ధి, సంక్షేమ పథకాలు పరుగులు పెడుతున్నాయన్నారు. కూటమి ఏర్పాటులో కీలక భూమిక పోషించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అటు ప్రధాని మోదీని, ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఒప్పించి కూటమిని ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారని ఆయన అన్నారు. 15 సంవత్సరాల పాటు కూటమి పాలన ఉంటుందని, పవన్ కళ్యాణ్ అనేక సందర్భాల్లో చెప్పారన్నారు. అందువలనే కేంద్రం నుంచి జలజీవన్ వంటి పథకాలు నిధులు రావడం కూడా పవన్ కళ్యాణ్ వలనే వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలో వచ్చాక గతంలో ఎన్నడు లేని విధంగా విద్య, వైద్యం, వ్యవసాయం, పంచాయతీ రాజ్ శాఖలకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత నిధులు ఇచ్చి నిధులు కేటాయింపుతో పాటు అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ బలోపేతం చేసే దిశగా ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. జనసేన సభ్యత్వం ఇప్పుడు రాష్ట్రంలో 12 లక్షలు ఉండగా దానిని రెట్టింపు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. గతంలో సభ్యత్వ రుసుం రూ.500లు ఉండగా, ప్రస్తుతం రూ.400లకు తగ్గించడం జరిగిందన్నారు. ప్రకాశం జిల్లాలో సభ్యత్వ నమోదును పరిశీలించడంతో పాటు దిశ నిర్దేశం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. మాజీమంత్రి జనసేన రాష్ట్ర నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి ఎంతో రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి అని కొణతాల కొనియాడారు. జనసేన పార్టీలో బాలినేనికి ఎప్పుడు సముచిత స్థానం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో బాలినేనికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ హృదయంలో బాలినేనికి సముచిత స్థానం ఉందన్నారు. పార్టీని పటిష్టమైన పునాది వేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. పార్టీ పదవులు లేకపోయినా తాను 15 సంవత్సరాల పాటు ఇంటి దగ్గరే ఉన్నానని, ఇప్పుడు పవన్ కళ్యాణ్ పుణ్యమా అని ఎమ్మెల్యే అయ్యాయని తెలిపారు. ఐదు సార్లు బాలినేని ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా చేసిన అనుభవం ఉందన్నారు. బాలినేనికి పదవులు ముఖ్యం కాదని, బాలినేని బ్రాండే అతనికి చాలు అని, అయితే ఇప్పుడు సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుంది కాబట్టి, ఇది అయిన తరువాత పార్టీని పునర్నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. బాలినేనికి త్వరలోనే సముచిత స్థానం వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకముందు లాయర్ పేటలోని బాలినేని నివాసానికి వచ్చిన కొణతాల రామకృష్ణకు బాలినేని శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. సోమవారం ఏర్పాటు చేసిన జనసేన సభ్యత్వ నమోదు సమావేశానికి ఆహ్వానం, తదితర అంశాలపై పలువురు జనసేన పార్టీ నాయకులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో జనసేన్న నాయకులు రాయపాటి అరుణ, వంశీదీప్, తేళ్ల మనోజ్‌తో గొర్రెపాటి శ్రీనివాసరావు, ఒంగోలు కార్పొరేటర్లు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన జనసేన నాయకులు ఉన్నారు.

## ఇంటి పన్నులను చెల్లించాలి



**తాళ్లూరు, మార్చి 2, ప్రభాతవార్త**
ఇంటిపన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీఓ పి. అజిత తెలిపారు. సోమవారం తాళ్లూరు లో ఇంటిపన్నుల వసూళ్లపై డీపీఓ ఆదేశాలు మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వీఓఏ ఇంటిపన్ను చెల్లించారు.త్వరగా ఇంటిపన్నులు చెల్లించాలని, లేకుండా నోటీసులు జారీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు, ఏపీఎం దేవరాజు, సుజాత, రవి కుమార్,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


# దేవాదాయ ధర్మాదాయ శాఖ

**శ్రీ మాల్యాద్రి లక్ష్మినరసింహస్వామి వారి దేవస్థానం**
**మాలకొండ, వలేటివారిపాలెం మండలం, ప్రకాశం జిల్లా,**

**సీల్డ్ టెండర్ మరియు ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్స్**

శ్రీ మాల్యాద్రి లక్ష్మినరసింహస్వామి వారి దేవస్థానము నందు శానిటేషన్, అన్నదానసత్రం,రూమ్స్‌మరియు దేవాలయము వద్ద ప్రతి శుక్ర,శని,ఆదివారములలో పనిచేయుటకు మ్యాన్ పవర్ స్థిరమైన రోజువారీవేతనం చెల్లించుచు తేది.01.04.2026 నుండి 31.03.2028 వరకు మ్యాన్ పవర్ సప్లై చేయుటకు సీల్డ్ టెండర్ మరియు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్స్ కోరబడుచున్నవి.eprocurement వివరములకు eprocurement http://tender.appeprocurement.gov.in అను వెబ్ సైట్‌ను చూడగలరు.సీల్డ్ టెండర్ షెడ్యులను తేది 03.02.2026 నుండి 15.02.2026 వరకు ఇవ్వబడును. తేది17.02.2026న ఉదయం 10 గం॥లకు సీల్డ్ టెండర్ బాక్స్ నందు మీ యొక్క షెడ్యులను సమర్పించగలరు.తేది.16.02.2026 టెక్నికల్ బిడ్ ఓపెన్ చేయుట మరియు తేది.17.02.2026 ఫైనాన్షియల్ బిడ్‌ను ఓపెన్ చేయుట జరుగును.

**ఇతర వివరములకు 9491000732 సంప్రదించగలరు.**

శ్రీ స్వామి వారి సేవలో,డిప్యూటీ కమీషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి



# దేవాదాయ ధర్మాదాయ శాఖ

**శ్రీ మాల్యాద్రి లక్ష్మినరసింహస్వామి వారి దేవస్థానం**
**మాలకొండ, వలేటివారిపాలెం మండలం, ప్రకాశం జిల్లా,**

**సీల్డ్ టెండర్, ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన (3వసారి)**

తేది.01.04.2026 నుండి 31.03.2027 వరకు శ్రీ స్వామివారికి, అమ్మవారికి భక్తులు సమర్పించు వస్త్రములను ప్రోగు చేసుకొనుట మరియు అమ్ముకొను లైసెన్స్ హక్కునకు తేది.12.02.2026న ఉదయం 10గం॥కు మాలకొండలో బహిరంగ వేలంపాట జరుపబడును. తేది 03.02.2026 నుండి 11.02.2026 వరకు టెండర్ షెడ్యూల్ అమ్మబడును.టెండర్ షెడ్యూల్ తేది 12.02.2026న ఉదయం 10 గంటలకు టెండర్ బాక్స్ నందు సమర్పించగలరు.

eprocurement వివరములకుeprocurement http://tender.appeprocurement.gov.in అను వెబ్ సైట్ ను చూడగలరు. ఇతర వివరములకు 9491000732 సంప్రదించగలరు.

శ్రీ స్వామి వారి సేవలో,డిప్యూటీ కమీషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి,
శ్రీ మాల్యాద్రి లక్ష్మినరసింహస్వామి వారి దేవస్థానము, మాలకొండ

8_8.qxd 3/3/2026 12:46 AM Page 1



## 21 రోజుల్లో జనన- మరణాల నమోదు ఉచితం

### - ఆలస్యమైతే దశల వారీగా ఫీజులు




**కనిగిరి, మార్చి 2, ప్రభాతవార్త**

రాష్ట్రంలో జనన, మరణాల నమోదును మరింత కట్టుదిట్టంగా అమలు చేయడానికి ప్రభుత్వం ఏపీ బర్త్స్ అండ్ డెత్స్ రూల్స్-2025ను ప్రవేశపెట్టింది. కొత్త నిబంధనలు 17-02-2026 నుంచి అమల్లోకి వచ్చాయి. 1999 నాటికి పాత నియమాలు రద్దు కానున్నట్లు అధికారులు తెలిపారు. జననం లేదా మరణం జరిగిన తేదీ నుంచి 21 రోజుల్లోపు నమోదు చేస్తే ఎలాంటి ఫీజు ఉండదని స్పష్టం చేశారు. గడువు దాటిన తర్వాత మాత్రం దశల వారీగా ఫీజులు విధిస్తారు. 21 నుంచి 30 రోజుల్లోపు నమోదు చేస్తే రూ.25 ఫీజు రిజిస్ట్రార్ అనుమతితో చెల్లించాలి. 30 రోజులు దాటిన ఒక సంవత్సరం లోపు నమోదు చేస్తే రూ.250 ఫీజుతో జిల్లా రిజిస్ట్రార్ అనుమతి అవసరం. ఒక సంవత్సరం దాటిన తర్వాత నమోదు చేయాలంటే రూ.500 ఫీజుతో ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ లేదా ఆర్డీవో అనుమతి తీసుకోవాలి. ఆసుపత్రిలో జననం లేదా మరణం జరిగితే సంబంధిత ఆసుపత్రి నమోదు చేయాల్సి ఉంటుంది. ఇంటి వద్ద జరిగితే కుటుంబ సభ్యులు నమోదు బాధ్యత వహించాలి. శిశువు పేరు నమోదు విషయంలో కూడా మార్గదర్శకాలు జారీ చేశారు. పుట్టిన తేదీ నుంచి 12 నెలల లోపు పేరు నమోదు ఉచితం. 12 నెలలు దాటి 15 ఏళ్ల లోపు నమోదు చేస్తే రూ.250 లేట్ ఫీజు వర్తిస్తుంది. పిల్లల పేర్లు పూర్తి రూపంలో నమోదు చేయాలని, సంక్షిప్త రూపాలు వాడరాదని సూచించారు. రికార్డు వెతికేందుకు రూ.50 సెర్చ్ ఫీజు, అదనపు ప్రతి సంవత్సరానికి రూ.25 వసూళ్లు చేస్తారు. ప్రతి సర్టిఫికేట్ కాపీకి రూ.50 చెల్లించాలి. జనన నమోదు కోసం ఫారం-1, దత్తత పిల్లల కోసం ఫారం-1ఏ, మరణ నమోదు కోసం ఫారం-2, మరణ కారణాల మెడికల్ సర్టిఫికేట్‌కు ఫారం-4, నమోదు లభ్యం కానప్పుడు ఫారం-10 వినియోగించాలి. రికార్డులు శాశ్వతమైనవి అయితే తగిన ఆధారాలతో తప్పులు సవరించుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే రూ.1000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి పౌరుడు జననం, మరణం నమోదును సమయానికి పూర్తి చేయడం చట్టబద్ధ బాధ్యత అని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## కనిగిరిలో స్నేహహస్తం ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి



**కనిగిరి, మార్చి 2, ప్రభాతవార్త**

కనిగిరిలో ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రోజున స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమం ద్వారా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి బంధువులకు, నిరాశ్రయులకు, మతిస్థిమితం లేని వృద్ధులకు ఆహారం అందించారు. ట్రస్టు అధ్యక్షులు సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రతి సోమవారం గర్భిణీ స్త్రీలు, డయాలసిస్ చేయించుకునే కిడ్నీ వ్యాధిగ్రస్తులు, పేద ప్రజలకు మా వంతు సేవ అందిస్తాం. ఆకలితో ఉన్న పేదవారికి ఆహారం ఇవ్వడం మా బాధ్యతగా భావిస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది శంకర్, స్నేహహస్తం సభ్యులు అక్బర్ వలి, బాల చెన్నారావు, మీరా మొహిద్దిన్, కిషోర్ బాబు, ఇమామ్ హుస్సేన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఓపెన్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అధికారులు





**కనిగిరి, మార్చి 2, ప్రభాతవార్త**

ఇంటర్ ఓపెన్ పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పరిశీలకురాలు ఎన్.గీత తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కనిగిరి బాలికోన్నత పాఠశాల, చింతలపాలెం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి రాజాల కొండారెడ్డితో కలిసి పరిశీలించారు. పరీక్షల నిర్వహణ, హాజరు నమోదు, ప్రశ్నాపత్రాల భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ వంటి అంశాలను సమీక్షించారు. మార్కాపురం జిల్లా పరిధిలోని గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి పట్టణాలలో మొత్తం ఏడు పరీక్ష కేంద్రాలలో ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 2,909 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లు వివరించారు. పదవ తరగతి రెగ్యులర్, ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం పూర్తయిందని, కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, కూర్చోవడానికి సరైన వసతి, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.తనిఖీల అనంతరం కనిగిరి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అలాగే పాఠశాలలో 100 రోజుల పదవ తరగతి ప్రణాళిక అమలును సమీక్షించారు.

## తరగతుల్లేవ్.. పరీక్షలున్నాయి..!

### - కనిగిరిలో బీఈడీ పరీక్షల తంతుపై తీవ్ర విమర్శలు





**కనిగిరి, మార్చి 2, ప్రభాతవార్త**

బీఈడీ వంటి ఉపాధ్యాయ వృత్తికి పునాది వేయాల్సిన కోర్సులోనే అవకతవకలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తరగతులు లేకుండా పరీక్షలు అనే విధంగా కనిగిరి పట్టణంలో బీఈడీ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయన్న సమాచారం విద్యా వర్గాల్లో కలకలం రేపుతోంది. గత ఐదు రోజులుగా పట్టణంలోని ఐదు ప్రైవేటు బీఈడీ కళాశాలలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలుస్తోంది. వీరిలో రెగ్యులర్ విద్యార్థులతో పాటు సప్లిమెంటరీ పరీక్షల రాసేవారు ఉన్నారు. అయితే పరీక్షలకు హాజరవుతున్న వారిలో 85 నుంచి 90శాతం మంది ఒడిశా, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన వారేనని సమాచారం. స్థానిక విద్యార్థులు కేవలం 10 శాతం మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది.

**తరగతులు కాగితాల్లోనే..? :**

వాస్తవానికి బీఈడీ కోర్సులో రెగ్యులర్ తరగతులు, ప్రాక్టికల్స్, బ్లాక్ టీచింగ్ వంటి అంశాలు తప్పనిసరి. కానీ కనిగిరిలో మాత్రం ఈ విధానం అమలులో లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తరగతులకు హాజరు కాకుండానే, ప్రాక్టికల్స్ చేయకుండానే కేవలం పరీక్షల సమయంలో హాజరైతే సరిపోతుందని విద్యార్థులే వెల్లడిస్తున్నట్లు తెలిసింది.

**ఒక్కో సెమిస్టర్‌కు రూ.25వేలు..! :**

విద్యార్థి కళాశాలకు వచ్చినా రాకున్నా ఒక్కో సెమిస్టర్‌కు రూ.25వేల చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందని సమాచారం. పరీక్షల సమయంలో అదనంగా రూ.5వేల వరకు ప్రైవేటు కళాశాల యాజమాన్యానికి చెల్లించాల్సి వస్తోందని తెలుస్తోంది. ఇలా ఫీజులు చెల్లిస్తే తరగతులకు హాజరు, ప్రాక్టికల్స్ అవసరం లేకుండానే పరీక్షలు రాసే పరిస్థితి ఉందని ఆరోపణలు ఉన్నాయి.

**ఉన్నత విద్యా వ్యవస్థకు ముప్పు :**

బీఈడీ కోర్సు ఉపాధ్యాయ వృత్తికి పునాది. ఇలాంటి పరిస్థితుల్లో సరైన శిక్షణ లేకుండా సర్టిఫికేట్లు పొందుతున్న అభ్యర్థులు భవిష్యత్తులో బోధన ఎలా అందిస్తారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కనిగిరి మాత్రమే కాకుండా మార్కాపురం, గిద్దలూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనూ ఇదే తరహా పరిస్థితులు ఉన్నాయని సమాచారం. ఈ వ్యవహారం యూనివర్సిటీ స్థాయిలోనే జరుగుతుండటంతో స్థానికంగా చర్యలు తీసుకోవడం కష్టమవుతోందని వర్గాలు చెబుతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి విద్యా ప్రమాణాలను కాపాడాలని విద్యా నిపుణులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## గుంటూరులో జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలు



**కనిగిరి, మార్చి 2, ప్రభాతవార్త**

గుంటూరు నగరంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే, కుంఫు, టైక్వాండో పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిశాయి. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన వందలాది మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ప్రేక్షకులను అలరించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్, ప్రకాశం జిల్లా రీజియన్ సెక్యూరిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శెట్టిపల్లి కొండయ్య హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నేటి సమాజంలో ఆత్మరక్షణ విద్యల ప్రాముఖ్యత రోజు రోజుకు పెరుగుతోందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు మార్షల్ ఆర్ట్స్ వంటి ఆత్మరక్షణ విద్యలను తప్పనిసరిగా అభ్యసించాలన్నారు. మార్షల్ ఆర్ట్స్ కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక వికాసం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కొనియాడారు. క్రమబద్ధమైన సాధనతో యువత దేశానికి మంచి క్రీడాకారులుగా, బాధ్యతాయుత పౌరులుగా ఎదగగలరని పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ కనపరిచిన విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు ముఖ్య అతిథిని సన్మానించారు.

## అంధుల జీవితాల్లో వెలుగు నింపిన లూయిస్ బ్రెయిలీ



**కనిగిరి, మార్చి 2, ప్రభాతవార్త**

బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి సందర్భంగా సోమవారం కనిగిరి అంధుల సంక్షేమ కార్యాలయంలో వీరయ్య అధ్యక్షతన ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, ప్రముఖ వైద్యులు డాక్టర్ పెరుగు మురళి కృష్ణ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే చూపును కోల్పోయిన లూయిస్ బ్రెయిలీ నిరాశ చెందకుండా అంధుల విద్య కోసం ప్రత్యేక లిపిని కనుగొనడం గొప్ప విషయమన్నారు. ఆరు బిందువుల ఆధారంగా రూపొందిన బ్రెయిలీ లిపి అక్షరాలు, సంఖ్యలు, సంగీతాన్ని సులభంగా చదవగలిగే విధంగా ఉండి అంధుల విద్యా ప్రస్థానంలో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చిందని తెలిపారు. బ్రెయిలీ ఆధారంగా కంప్యూటర్లలో స్క్రీన్ రీడర్లు, టచ్ స్క్రీన్ పరికరాలు అభివృద్ధి చెందడం అంధులకు మరింత సౌలభ్యం కల్పించిందన్నారు. లూయిస్ బ్రెయిలీ సేవాభావం, అంధుల పట్ల ఆయన చూపిన అంకితభావం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. బ్రెయిలీ పేరు చరిత్రలో శాశ్వతంగా నిలిచి అంధుల హక్కుల కాంతివంతమైన చిహ్నంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ పెరుగు మురళికృష్ణ అన్నదానానికి ఆర్థిక సహాయం అందించారు. డాక్టర్ గురుబ్రహ్మం జ్ఞాపకార్థంగా అడ్వకేట్ శ్రీనివాసులు(వాసు) దుప్పట్లు పంపిణీ చేశారు. డాక్టర్ సుబ్బారెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో సిరి బట్టల షాపు వెంకటాద్రి చీరలు పంపిణీ చేశారు.

## తిరునాళ్ళలో పెద్ద ఎత్తున భక్తులు

### - అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్న ప్రజలు

### - విశేష అలంకరణతో భక్తులకు స్వామి వారికి దర్శనం









**అద్దంకి మార్చి 2, ప్రభాతవార్త**

తిరునాళ్ళ సందర్భంగా భక్తులకు స్వామి వార్లు విశేష అలంకరణతో దర్శనమిచ్చారు. ప్రధాన తిరునాళ్ళ సందర్భంగా సోమవారం ఉదయం నుండే ఆలయాలను భక్తులు సందర్శించి, స్వామి వార్లకు పూజలు నిర్వహించారు. కొండపై వేంచేసి యున్న శ్రీలక్ష్మీ నరసింహాస్వామి, శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వార్లు విశేష అలంకరణలతో భక్తులకు దర్శమిచ్చారు. లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో విశ్వక్‌సేన ఆరాధన, పుణ్యాహావచనం, ద్వార తోరణం, ధ్వజకుంభారాధన, కుంభాభి మర్శనమం, నిత్యహోమం, బలిహారణ, హారతిలతో కూడిన పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యంలో సందర్శించి, పూజలు నిర్వహించారు. ప్రసన్నాంజనేయస్వామికి సుప్రభాత సేవ ప్రారంభమై,రాత్రి రథోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలు అధిక సంఖ్యలో క్యూ లైన్ల ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక లడ్లును ప్రసాదంగా భక్తులకు అందజేశారు. ఆయా ఆలయ అధికారులు, పాలకమండళ్ళు, పలు శాఖల అధికారులు తిరునాళ్ళ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లను చేసి, భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. తిరునాళ్ళ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు.

## తిరునాళ్ళ ఏర్పాట్లుపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



**అద్దంకి, మార్చి 2,ప్రభాతవార్త**

సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయస్వామి 71వ వార్షిక తిరునాళ్ళ పురస్కరించుకొని ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తిరునాళ్ళ నిర్వహణ, ఏర్పాట్లపై ఆలయ అధికారులు, పోలీస్, రెవిన్యూ, అధికారులతో కలెక్టర్ రాజాబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ఈఒ తిమ్మానాయుడు, చైర్మన్ మురళీ సుధాకరరావు, తహశీల్దార్ శ్రీచరణ్, డిఎస్‌పి లక్ష్మీనారాయణ, పట్టణ సి.ఐ. సుబ్బరాజులతో కలెక్టర్ సమీక్షించి, ఆలయ పరిసరాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

## మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో

### అద్దంకి నియోజకవర్గంలోని రహదారులకు రూ. 6.05 కోట్లు మంజూరు



**అద్దంకి మార్చి 2,ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేసినట్లు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. రోడ్లు భవనాలు శాఖ ద్వారా నియోజకవర్గంలోని మొత్తం 11 రహదారి అభివృద్ధి పనులకు రూ. 6.05 కోట్లు కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆర్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరఫున మంత్రి గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. అద్దంకి అభివృద్ధి పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని స్పష్టం చేశారు.

**మంజూరైన ప్రధాన పనులు :**

ముప్పవరం బైపాస్ నిర్మాణానికి రూ. 2.15 కోట్లు, మేదరమెట్ల - రాచపూడి రహదారి అభివృద్ధికి రూ. 2.30 కోట్లు, ఇతర కీలక రహదారి పనులకు రూ. 1.75 కోట్లు మంజూరైనట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడతాయని, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు ప్రత్యక్షంగా లాభపడతారని మంత్రి తెలిపారు. పనులను త్వరితగతిన ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఇప్పటికే మంత్రి ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో కూడా అద్దంకి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు.

## స్వామివారి సేవలో తరించిన ప్రముఖులు











**బల్లికురవ, మార్చి 2, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లాలో భక్తుల పాలిట కొంగు బంగారమై బాసిల్లుతున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన సింగరకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వారి 71వ వార్షిక తిరుణాల మహోత్సవ వేడుకలు సోమవారం అత్యంత వైభవోపేతంగానిర్వహించారు.వేలాదిగా తిరుణాల మహోత్సవానికి తరలివచ్చే భక్తజన సందేహానికి ఏ విధమైన ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై ఆలయ చైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు,ఈవో తిమ్మనాయుడు పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాటు కొనసాగుతున్నాయి. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రాధిపతిగా శ్రీ ప్రసన్నాంజనేయస్వామి క్షేత్రపాలకుడిగా ఈ క్షేత్రంలో పూజలందుకుంటున్నారు. ప్రతి ఏటా పాల్గుణ మాసంలో అంగరంగ వైభవంగా తిరుణాల మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌లు ప్రసన్నాంజనేయస్వామికి,లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగాఈవో మాధమంచి తిమ్మానాయుడు వారికి స్వామివారి పట్టు వస్త్రాలు, చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతి ఏటా స్వామివారి తిరుణాల మహోత్సవంలో పాల్గొనడం మానసిక ప్రశాంతతను చేకూరుస్తుందన్నారు. దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ స్వామివారి సేవా భాగ్యం తిరునాళ్ల రోజున కలగటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

## సింగరకొండ తిరునాళ్ళ పూజలలో పాల్గొన్న ప్రకాశం ఎస్.పి.





**అద్దంకి , మార్చి 2, ప్రభాతవార్త**

సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయాన్ని ప్రకాశం జిల్లా ఎస్పి వినోద్‌కుమార్ సోమవారం దర్శించుకొని పూజలలో పాల్గొన్నారు. ఆలయ 71వ వార్షిక తిరునాళ్ళ పురస్కరించుకొని ఎస్పి ముందుగా స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆనంతరం వేదపండితులు, ఆలయ ఈఒ తిమ్మానాయుడు, చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావులు ఎస్.పి.ని శ్వేత వస్త్రంతో సత్కరించి, స్వామి వారి మెమోంటోను అందజేశారు. తీర్థ ప్రసాదాలతోపాటు ఆశ్వీరచనాలు అందజేశారు. అనంతరం ఆలయం ముందు చెరుకు గడలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్వామి ప్రాంగణాన్ని ఎస్పి సందర్శించారు. ఆయన వెంట డిఎస్‌పి, పలువురు సి.ఐ.లతోపాటు పట్టణ సి.ఐ సుబ్బరాజు తదితరులు వున్నారు.

## తిరునాళ్ళ ఏర్పాట్లను పరిశీలన, సమీక్ష

### - పలు సూచనలు చేసిన ఎస్.పి.





**అద్దంకి ,మార్చి 2,ప్రభాతవార్త**

సింగరకొండ ప్రధాన తిరునాళ్ళ ఉత్సవం సోమవారం రాత్రి జరుగగా ప్రకాశం జిల్లా ఎస్పి వినోద్‌కుమార్ మధ్యాహ్నం ఆలయాన్ని సందర్శించారు.అనంతరం స్థానిక పోలీస్ అధికారులు, ఆలయ అధికారులతో ఎస్.పి. సమీక్ష చేశారు. అనంతరం తిరునాళ్ళలో అటు అధికారులు, ఇటు పోలీసులు ప్రభల ఏర్పాటు ప్రాంతంలో పోలీసు బందోబస్తు విషయమై పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఆలయ సందర్శన విషయమై క్యూలైన్లు, భక్తుల రాకపోకల సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టిన చర్యలను ఆయా



అధికారులను ఎస్పి అడిగి తెలుసుకున్నారు. ఆలయ పరిసరాలను ఎస్పి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లును పరిశీలించిన ఎస్పి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆలయ అధికారులు, పాలకమండలి, పోలీస్ అధికారులు, ప్రభల ఏర్పాటు కమిటీ సభ్యులు, వున్నారు.

## సింగరకొండలో పూజలు నిర్వహించిన ప్రకాశం కలెక్టర్





**అద్దంకి ,మార్చి 2,ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం ప్రధాన తిరునాళ్ళ ఉత్సవ సందర్భంగా ప్రకాశంజిల్లా కలెక్టర్ రాజాబాబు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద కలెక్టర్‌కు ఆలయ అధికారులు, పాలకమండలి, రెవిన్యూ, పోలీస్ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ఆలయ ధ్వజస్తంభాన్ని సందర్శించుకొని గర్భాలయంలో స్వామి వారిని కలెక్టర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆశ్వీరచనాలతో కూడిని తీర్థ ప్రసాదాలను వేదపడితులు అందజేశారు. ఆలయ ఈఒ తిమ్మానాయుడు, చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, పాలకమండలి సభ్యులు, కలెక్టర్‌కు స్వామివారి శ్వేతవస్త్రాన్ని, చిత్రపటాన్ని అందజేశారు. వీరివెంట తహశీల్దార్ శ్రీచరణ్, పోలీస్ అధికారులు డిఎస్‌పి లక్ష్మీనారాయణ, పట్టణ సి.ఐ. సుబ్బరాజు, రూరల్ సి.ఐ. మల్లికార్జునరావు తదితరులు వున్నారు.

## తిరునాళ్ళలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు

### - సత్రాల ద్వారా అన్నదాన కార్యక్రమం

### - సేవా సంఘాల నుండి మజ్జిగ, మంచినీళ్ళు, అల్పాహారం పంపిణీ









**అద్దంకి మార్చి 2,ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ లక్ష్మీనరసింహాస్వామి, శ్రీ ప్రసన్నాంజనేయస్వామిల 71వ వార్షిక తిరునాళ్ళ ఉత్సవాలలో భాగంగా సోమవారం ప్రధాన ఉత్సవాన్ని పురస్కరించుకొని పలు సేవా సంఘాలు, పలు అన్నదాన సత్రాల నిర్వహకులు భక్తులకు అన్నదానం,మజ్జిగ, మంచినీళ్ళు, అల్పాహారాలను పెద్ద ఎత్తున అందజేశారు.వాసవీ వనితా క్లబ్, రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ, ఉష ఎంటర్‌ప్రైజస్ నిర్వహకులు జువ్వారీ డీలర్ ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీళ్ళు అల్పాహారాన్ని భక్తులకు అందజేశారు. అదే విధంగా తిరునాళ్ళ పరిధిలోని వివిధ సామాజిక వర్గాల సత్రాలలో అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున భక్తులకు అందజేశారు. ఉదయం నుండి,తిరునాళ్ళ రోజు తెల్లవారుజాము వరకు సత్రాలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు కూడ భక్తులకు పలు సేవలను అందజేశారు. సింగరకొండపాలెం గ్రామ పంచాయతీ నుండి కూడ తిరునాళ్ళ సందర్భంగా పలు సేవలు, వసతులను భక్తులకు కల్పించారు. తిరునాళ్ళ సందర్భంగా ఎప్పటికప్పుడు ఆలయ అధికారులు సమీక్ష నిర్వహిస్తూ, ఎక్కడా భక్తులకు ఆసౌకర్యం కలగకుండా వాకీ టాకీల ద్వారా ఎక్కడక్కడ సమాచారాన్ని అందజేస్తూ తిరునాళ్ళ నిర్వహణలో అప్రమత్తంగా పోలీస్, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తిరునాళ్ళను విజయవంతం చేసేందుకు కృషిచేశారు.

## వెంకయ్య ఆశ్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో అన్నదానం

**మార్టూరు, మార్చి 2, ప్రభాతవార్త**

మార్టూరు వెంకయ్య ఆశ్రమంలో గుంటూరు జిల్లా గుంటూరు వాస్తవ్యులు ముప్పవరపు నరేంద్రబాబు, సుధారాణి గొప్ప వరకు హంసినిల ఆశ్రమంలో అన్నదానం చేశారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమ అధ్యక్షుడు తన్నీరు శివ, రాజేష్ దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు అధ్యక్షులు మాదాల సాంబశివరావు, మాజీ అధ్యక్షులు జాష్టి, సాంబశివరావు, ఇతరులు పాల్గొన్నారు.



03-03pg 12 ONG_03-03pg10.qxd 02/Mar/26 11:33 PM Page 1



# ఒక్క కప్! 4జట్లు!!

## సంగ్రామానికి రంగం సిద్ధం | సెమీఫైనల్లో అసలు పరీక్ష



### సిక్స్‌ల మోత

పొట్టి ప్రపంచకప్‌లో సిక్స్‌ల మోత మోగుతోంది. స్టేడియాలు సిక్స్‌లతో హోరెత్తుతున్నాయి. బ్యాట్స్‌మన్ ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నారు. సిక్స్‌లు, ఫోర్ల పరంగా ఈ ప్రపంచ కప్ రికార్డు సృష్టిస్తోంది. ఇప్పటివరకు ఏకంగా 699 సిక్స్‌లు, 1340 బౌండరీలు పారాయి. వెస్టిండీస్ హిట్‌మ్యాన్ షిమ్రాన్ హిట్మైర్ సిక్స్‌ల మోత మోగించాడు. బౌలర్లకు చుక్క చూపిస్తూ 19 సిక్స్‌లతో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. ఫర్హాన్ 18 సిక్స్‌లు, మరో 37 బౌండరీలు బాదాడు. రికల్టన్(సౌతాఫ్రికా), షనక(శ్రీలంక) చెరో 15 సిక్స్‌లు.. సికిందర్ రజా(జింబాబ్వే), రూథర్ పోర్డ్(వెస్టిండీస్), జేసన్ హోల్డర్(వెస్టిండీస్) తలా 13 సిక్స్‌లు...అలెన్(న్యూజిలాండ్), విల్ జాక్స్(ఇంగ్లాండ్), బ్రెవిస్(సౌతాఫ్రికా), హార్దిక్ పాండ్యా(భారత్), ఇషాన్ కిషన్(భారత్) తలా 12 సిక్స్‌లు సాధించారు. శివమ్ దూబే ఇప్పటివరకు 11 సిక్స్‌లు బాదాడు.



### 5 శతకాలు

టీ20 ప్రపంచకప్‌లో శతకాల మోత తక్కువే. కేవలం అయిదు సెంచరీలే నమోదయ్యాయి. అందులో రెండు సెంచరీలు పాక్ ఓపెనర్ ఫర్హాన్ ఖాతాలో ఉన్నాయి. నమీబియా, శ్రీలంకలపై సెంచరీల మోత మోగించాడు. ఇక కెనడా యువరాజ్(110), శ్రీలంక ప్లేయర్ నిశాంక(100), ఇంగ్లాండ్ కెప్టెన్ బ్రూక్(100) సెంచరీలు చేశారు. మరో నలుగురు సెంచరీల దరిదాపుల్లోకి వచ్చారు. ఈ టోర్నీలో ఎక్కువ రన్స్ చేసిన బ్యాట్స్‌మెన్లలో ఫర్హాన్ (383) టాప్ ప్లేస్‌లో ఉన్నారు. అతను 7 మ్యాచ్‌ల్లో 160.25 స్ట్రయిక్ రేట్‌తో 383 రన్స్ చేశాడు. అందులో 2 సెంచరీలు, రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. జింబాబ్వే ప్లేయర్ బెన్నెట్ ఆరు మ్యాచ్‌ల్లో 134.56 స్ట్రయిక్ రేట్‌తో 292 రన్స్, దక్షిణాఫ్రికా కెప్టెన్ ఆడమ్ మార్‌క్రమ్ 7 మ్యాచ్‌ల్లో 175.16 స్ట్రయిక్ రేట్‌తో 286 రన్స్ సాధించారు.









**కోల్‌కతా:** భారత్, శ్రీలంక అతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్ చివరి అంకానికి చేరుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియాతో పాటు దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ సెమీస్ చేరుకున్నాయి. సూపర్8 గ్రూప్1 నుంచి దక్షిణాఫ్రికా, భారత్.. గ్రూప్2 నుంచి ఇంగ్లాండ్, న్యూజిలాండ్ సెమీఫైనల్లో ప్రవేశించాయి. గ్రూప్1లో టాపర్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా.. గ్రూప్2లో రెండో స్థానంలో నిలిచిన న్యూజిలాండ్‌తో మార్చి 4న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్‌లో తొలి సెమీఫైనల్ ఆడనుంది. గ్రూప్1లో రెండో స్థానం పొందిన టీమిండియా... గ్రూప్2 టాపర్ ఇంగ్లాండ్‌తో మార్చి 5న ముంబై వాంఖడేలో తలపడనుండి.అసలు సిసలు పరీక్ష ఎదుర్కోనుంది. ఫైనల్ మార్చి 8న ఆహ్మదాబాద్‌లో జరగనుంది.

### కూనలే అయినా సంచలనాలు

ఫిబ్రవరి 7న మొదలైన పొట్టి క్రికెట్ ప్రపంచకప్ పలు సంచలనాలకు వేదికగా నిలిచింది. మొత్తం 20 జట్లు తలపడగా... 8 జట్లు సూపర్8కు వచ్చాయి. మేటి జట్లలో ఒకటైన ఆస్ట్రేలియా గ్రూప్ స్టేజ్‌లోనే ఇంటిదారి పట్టగా.. జింబాబ్వే, వెస్టిండీస్ సంచలన విజయాలతో సూపర్8కు చేరి ఆశ్చర్యపరిచాయి. ముఖ్యంగా ఆస్ట్రేలియా, అతిథ్య శ్రీలంకలను ఓడించి సర్‌ప్రైజ్ విక్టరీలు సాధించిన జింబాబ్వే.. అదే జోరును సూపర్8లో కనబరచలేకపోయంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ పరాజయాలే చవిచూసింది. వెస్టిండీస్ మాత్రం జింబాబ్వేపై గెలుపొంది.. భారత్, దక్షిణాఫ్రికా చేతుల్లో ఓడింది.

టీ20 ప్రపంచకప్ అతిథ్య జట్లలో ఒకటైన శ్రీలంక... సొంతగడ్డపై బోల్తా కొట్టింది. గ్రూప్ స్టేజ్‌లో మూడు విజయాలతో సూపర్8కు వచ్చిన లంకేయులు... ఇక్కడ మాత్రం నిరాశాజనక ఆటతీరుతో మూడు సూపర్8 మ్యాచ్‌ల్లోనూ ఓడింది. ఇక పాకిస్థాన్... గ్రూప్ స్టేజ్‌లో దయాది భారత్ చేతిలో షాక్ తింది. నిలకడలేమీ ఆట తీరుతో నిరుత్సాహపరిచింది. సూపర్8లో న్యూజిలాండ్‌తో మ్యాచ్ వర్షార్పణం అవడం ఆ జట్టు సెమీస్ ఆశలపై ప్రభావం చూపింది. ఇంగ్లాండ్ చేతిలో ఓడినా తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో శ్రీలంకను ఓడించింది. మూడు పాయింట్లతో న్యూజిలాండ్‌తో సమంగా నిలిచింది. అయితే మెరుగైన నెట్ రన్‌రేట్ విషయంలో వెనకబడి పాకిస్థాన్... సెమీస్ పోరుకు ముందే వైదొలిగింది.



### వికెట్ల పంట

పొట్టి క్రికెట్ అంటే బ్యాట్స్‌మెన్ డామినేట్ గేమ్. కానీ ఈ ప్రపంచకప్‌లో బౌలర్లు కూడా తమవంత రోల్ పోషిస్తున్నారు. తమదైన రోజు బ్యాట్స్‌మెన్ గుండుల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. ఈ టోర్నీలో ఇప్పటివరకు వికెట్ టేకర్లుగా అమెరికా బౌలర్ వాన్ స్కాల్‌విక్, జింబాబ్వే బౌలర్ ముజర్బాని నిలిచారు. అమెరికా బౌలర్ నాలుగు మ్యాచ్‌ల్లో 13 వికెట్లు తీయగా అందులో రెండు సార్లు 4 వికెట్ల ఘనత ఉంది. ముజర్బాని 6మ్యాచ్‌ల్లో 13 వికెట్లు పడగొట్టారు. తరువాతి స్థానంలో 12 వికెట్లతో సౌతాఫ్రికా పేసర్ ఎంగిడి, టీమిండియా ఏస్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నారు. బాచ్(సౌతాఫ్రికా), తీక్షణ (శ్రీలంక), అదిల్ రషీద్(ఇంగ్లాండ్), జాన్సెన్ (సౌతాఫ్రికా) 11 వికెట్లతో తరువాతి స్థానంలో ఉన్నారు. యార్కర్ల కింగ్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా వికెట్ల వేటలో ఉన్నాడు. ఆరు మ్యాచ్‌ల్లో ఇప్పటివరకు 9 వికెట్లు తీశాడు.



### పరుగుల వరద

టీ20 ప్రపంచకప్‌లో పరుగుల వరద పారుతోంది. పలు జట్లు భారీ స్కోర్లు నమోదు చేస్తున్నాయి. ఇప్పటివరకు 11 సార్లు 200 ప్లస్ స్కోర్లు నమోదయ్యాయి. టీమిండియా రెండు సార్లు, శ్రీలంక 2 సార్లు 200మార్క్ దాటింది. టీ20 ప్రపంచకప్‌లో హైయెస్ట్ స్కోరు భారత్ ఖాతాలో ఉంది. చెన్నైలో జింబాబ్వేపై సూపర్8 మ్యాచ్‌లో టీమిండియా 4 వికెట్లకు 246 రన్స్ చేసింది. గ్రూప్ స్టేజ్‌లో నమీబియాపై ఢిల్లీలో సూర్య సేన చెలరేగి 209 రన్స్ చేసింది. ఇక జింబాబ్వేపై వాంఖడేలో వెస్టిండీస్ 6 వికెట్లకు 254 రన్స్ సాధించింది. ఇది ఈ టోర్నీలో సెకండ్ హయ్యెస్ట్ టీమ్ స్కోరు. శ్రీలంక కూడా రెండుసార్లు 200 ప్లస్ స్కోరు చేసింది. ఒమన్‌పై 225 రన్స్, పాకిస్థాన్‌పై 212 రన్స్ చేసింది. ఇక ఐర్లాండ్, పాకిస్థాన్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, స్కాట్లాండ్, ఇంగ్లాండ్, ఆఫ్ఘనిస్తాన్ తలా ఒకసారి 200 మార్కు దాటాయి.

## ఆఫ్ఘనిస్తాన్‌తో ఆరేళ్ల తర్వాత టెస్ట్

**ముంబై:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఆఫ్ఘనిస్తాన్‌తో ఎనిమిదేళ్ల తర్వాత టెస్ట్ మ్యాచ్ ఆడబోతోంది. దక్షి ణాఫ్రికా చేతిలో వైట్‌వాష్‌తో రేసులో వెనకబడిన టీమిండియా... జూన్‌లో సొంతగడ్డ పైనే ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడనుంది. రెండు ఫార్మాట్ల సిరీస్ కోసం భారత్‌కు రానుంది. ఏకైక టెస్టు మ్యాచ్‌తో పాటు మూడు వన్డేల సిరీస్‌లో భారత్, అఫ్ఘన్ తలపడనున్నాయి. టెస్ట్ మ్యాచ్ జూన్ 6 నుంచి న్యూఛండీఘర్‌లో ఆడనుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి వన్డే జూన్ 14న ధర్మశాలలో, రెండో వన్డే జూన్17న లక్నోలో, మూడో వన్డే జూన్20న చెన్నైలో జరగనుంది. ఈ మేరకు భారత క్రికెట్ బోర్డు సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. రెండు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్ చివరగా 2024లో జరిగింది. ఇక 2018లో చిన్నస్వామి స్టేడియంలో జరిగిన టెస్ట్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై ఇన్నింగ్స్ 262 పరు గుల తేడాతో టీమిండియా నెగ్గింది. సుదీర్ఘ విరామం తర్వాత టీమిండియాతో ఏకైక టెస్టు ఆడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు పేర్కొంది.

## ఒక్కో క్రికెటర్‌పై 17 లక్షల జరిమానా

**ఇస్లామాబాద్:** టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థానీ క్రికెటర్ల చెత్త ప్రదర్శనకు గాను ఆదేశ క్రికెట్ బోర్డు కన్నెర్ర చేసింది. ఒక్కో ప్లేయర్‌పై 17 లక్షల జరిమానా విధించింది. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్, పేస్ బౌలర్ షహీన్ అఫ్రీది, ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్‌పైన కూడా ఫైన్ వేసింది. ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో సరైన ఆటతీరును ప్రదర్శించని క్రికెటర్లకు ఈ జరిమానా వేసినట్లు తెలుస్తోంది. చక్కని ప్రదర్శన చేసిన ప్లేయర్లకు జరిమానా నుంచి మినహాయింపు ఇచ్చింది. చెత్త పర్ఫార్మెన్స్‌ను ఏమాత్రం సహించేది లేదని పీసీబీ వెల్లడించింది. భవిష్యత్తులో మెరుగైన ఆటను ప్రదర్శించిన క్రికెటర్లకు మాత్రమే ప్రోత్సాహకాలు ఉంటాయని పీసీబీ చెప్పింది. పొట్టి ప్రపంచకప్‌లో పాకిస్థాన్.. సెమీస్ చేరడంలో విఫలమైంది. గ్రూప్ స్టేజ్‌లో టీమిండియా చేతిలో చిత్తు చిత్తుగా ఓడింది. ఇటీవలి ఆసియాకప్‌లోనూ మూడుసార్లు తలపడితే పాక్‌కు భారత్ చేతిలో ఓటములే ఎదురయ్యాయి. దీనికి తోడు శ్రీలంకపై భారీ తేడాతో గెలవాల్సిన మ్యాచ్‌లో పాక్ బౌలర్లు చేజేతులా అవకాశాన్ని చేజార్చారు. దీంతో పాక్ క్రికెటర్లపై ఆ దేశం అభిమానులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. మాజీలు కూడా ఆటగాళ్లపై ఫైరవుతున్నారు.

వాణిజ్యం




## పింఛన్ వడ్డీరేటు ఈసారి 8.25శాతమే!

**న్యూఢిల్లీ, మార్చి 2:** ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ( ఈపీఎఫ్)పై ఇచ్చే వడ్డీని ఉద్యోగులు భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఒ) ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వడ్డీ రేటును 8.25 శాతంగా కొనసాగించాలని ఈపీఎఫ్ఓ నిర్ణయించింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మాన్‌సుఖ్ మాండవీయ అధ్యక్షతన సోమవారం జరిగిన 239వ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు (సిబిటి) సమావేశంలో వరుసగా మూడో ఆర్థిక సంవత్సరంలోనూ వడ్డీ రేటును మార్చకపోవడం గమనార్హం. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ పీఎఫ్ వడ్డీ రేటు 8.25 శాతంగానే అందించారు. ఈసారి పీఎఫ్ వడ్డీ రేటు తగ్గిస్తారనే అంచనాలు ఉన్నప్పటికీ ఎలాంటి మార్పులు చేకుండా ఊరట కల్పించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రావిడెంట్ ఫండ్‌కు చెల్లించే డబ్బులకు 8.25 శాతం వడ్డీ రేటు ఇవ్వాలని సోమవారం జరిగిన సమావేశంలో సీబీటీ నిర్ణయం తీసుకుంది. వడ్డీ రేటుకు సంబంధించి సీబీటీ ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు పంపిస్తారు. ప్రభుత్వం అధికారికంగా వడ్డీ రేటును నోటిఫై చేస్తుంది. ఆ తర్వాత ఈపీఎఫ్ చందాదారు అకౌంట్లకు వడ్డీ మొత్తం జమ చేస్తారు. ప్రస్తుతం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో 7 కోట్ల మందికిపైగా చందాదారులు ఉన్నారు. 2022 23 ఆర్థిక సంవత్సరంలో భవిష్య నిధిపై వడ్డీ రేటు 8.15 శాతంగా నిర్ణయించారు. ఆ తర్వాత 2023-24 ఆర్థిక సంవత్సరంలో 8.25 శాతానికి పెంచారు. అప్పటి నుంచి ఈ వడ్డీ రేటులో ఎలాంటి మార్పులు చేయలేదు. వరుసగా మూడో ఆర్థిక సంవత్సరంలో పీఎఫ్ వడ్డీ 8.25 శాతంగా యథాతథంగా కొనసాగిస్తున్నారు. మరోవైపు.. ఇనాక్టివ్‌గా ఉన్న ఈపీఎఫ్ ఖాతాల్లోని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లకు సంబంధించి సైతం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. తొలి దశలో రూ. 1000 కంటే తక్కువ మొత్తాలు ఉన్న 1.33 లక్షల అకౌంట్లను గుర్తించారు. అందులో ఉన్న రూ. 5.68 కోట్లను సెటిల్ చేయనున్నారు. ఆ తర్వాత రూ. 1000 పైన బ్యాలెన్స్ ఉన్న అకౌంట్లను గుర్తించి వారి వారి బ్యాంకు ఖాతాల్లో ఆ సొమ్మును జమ చేయనున్నారు. కేంద్ర కేబినెట్ సైతం ఇటీవలే ఈ విషయంపై నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నిష్క్రియంగా ఉన్న పీఎఫ్ ఖాతాల్లో సొమ్ము పేరుకుపోతున్న క్రమంలో ఆయా డబ్బులను వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు.

### భారీగా క్షీణించిన

## భారత్‌రూపాయి

### డాలర్ వర్సెస్ రూపాయి 91.50

**ముంబయి, మార్చి 2:** డాలర్‌తో రూపాయి చెలామణీ భారత నష్టం చవిచూసింది. ఒక్కసారిగా 42 పైసలు క్షీణించి సోమవారం ట్రేడింగ్‌ముగిసేనాటికి 91.50గా స్థిరపడింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై జరిపిన సంయుక్త దాడులు రూపాయి చెలామణిపైనా బ్రావంచూపించాయి. ముడిచమురుధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో అమెరికా డాలర్‌కు డిమాండ్ భారీ ఎత్తున పెరిగింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలోను, విదేశీ ఫండ్స్ ఇన్వెస్టర్లుకూడా భారీగా విత్‌డ్రాచేయడంతో భారత కరెన్సీ క్షీణించింది. విత్‌డ్రాలన్నింటికీ డాలర్ కరెన్సీ చెల్లింపుల వ్యవస్థ కావడంతో డిమాండ్‌పెరిగి ఇతర కరెన్సీలన్నీ ఒత్తిడికి లోనయ్యాయి. అందులోభాగంగానే భారత్ రూపాయిపైనా ఈ ప్రభావంచూపించింది. ఇంటర్‌బ్యాంకు విదేశీ కరెన్సీ ఎక్స్ఛేంజి రేటు ప్రకారం రూ. 91.23వద్ద ప్రారంభం అయి కనిష్ఠంగా ఇంట్రాడేలో 91.65వదదకు కూడా చేరింది. చివరకు 91.50వద్దముగిసింది. 42 పైసలు భారీగా క్షీణించినట్లు తేలింది. శుక్రవారం కూడా రూపాయి 17 పైసలు నష్టపోయి 91.08 వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణ, రాత్రికిరాత్రే చమురుధరలు పెరగడం వంటివి రూపాయీ క్షీణతకు కారణం అయ్యాయని షేర్‌ఖాన్ ప్రతినిది అనూజ్‌చౌదరి అన్నారు. ఇక బ్రెంట్‌ముడిచమురు 8.01శాతంపెరిగి బ్యారెల్‌కు 78.71 డాలర్లుగా కొనసాగింది. దీనివల్ల దిగుమతి బల్లులు పెరుగుతాయని, దీనికితోడు జలసంధి మూసి వేతతో చమురురవాణా వ్యయం కూడా మరింత పెరుగుతుందని అంచనావేస్తారు. వారాంతంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.7536.36 కోట్లు.

## టాప్‌గేర్‌లో ప్యాసింజర్ వాహనాల సేల్స్!

**ముంబయి, మార్చి 2:** ప్యాసింజర్ వాహన తయారీ సంస్థలు ఫిబ్రవరి చివరి నాటికి బలమైన అమ్మకాలను సాధించాయి. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ అన్ని విభాగాలలో స్థిరమైన డిమాండ్ కనిపించింది. అమ్మకాల వృద్ధికి యుటిలిటీ వాహనాలు ఎక్కువగా దోహదపడ్డాయి, ఇవి దేశీయ మార్కెట్లో మినీ కార్ల విభాగాన్ని అధిగమించాయి. చాలా వరకు ప్రధాన తయారీ సంస్థలు వార్షిక వృద్ధిని నివేదించాయి. ఈ నెలలో రిటైల్ వ్యాపారం బాగానే ఉందని, దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి డేటా ప్రకారం, కంపెనీ మొత్తంగా 1,61,000 దేశీయ ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది. ఇది గతేడాది అమ్ముడైన 160,791 యూనిట్ల కంటే కాస్త ఎక్కువ. కాంపాక్ట్ కార్ల విభాగంలో అమ్మకాలు తగ్గినప్పటికీ, యుటిలిటీ వాహనాల అమ్మకాలు గతేడాది 65,033 యూనిట్ల నుంచి 72,756 యూనిట్లకు పెరిగాయి. అమ్మకాలకు సంబంధించి, ఈ నెలలో మొత్తం అమ్మకాలు 2.14లక్షల యూనిట్లుగా ఉన్నాయని, దేశీయంగా టోకు అమ్మకాలు లక్షా 64 వేలు యూనిట్లుగా, రిటైల్ అమ్మకాలు గత సంవత్సరంతో పోలిస్తే 12 శాతం పెరిగాయని, డీలర్ ఇన్వెంటరీ 12 రోజులుగా ఉందని కంపెనీ తెలిపింది. తమ ఎగుమతుల్లో పశ్చిమాసియా దాదాపు 12.5 శాతం వాటా కలిగి ఉందని, దాదాపు 100 దేశాలలో షిప్‌మెంట్‌లు మారుతూ ఉన్నాయని



కంపెనీ తెలిపింది. ఫిబ్రవరిలో టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 34 శాతం పెరిగి 62,329 యూనిట్లకు చేరుకున్నాయి, ఇది దాని పోర్ట్‌ఫోలియో అంతటా నిరంతర డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది. స్వదేశీ ఎస్‌యువీ తయారీ సంస్థ మహింద్రా మహింద్రా అమ్మకాలకు సంబంధించి, కంపెనీ దేశీయ యుటిలిటీ వాహన అమ్మకాలలో 19 శాతం వృద్ధినిసాధించింది.

## ఒక్కడాలరుపెరిగినా భారత్‌కు రూ.13వేలకోట్ల నష్టం

### హర్మోజ్ జలసంధి మూసివేతతో చమురు గండం

**ముంబయి, మార్చి 2:** పశ్చిమాసియాలో ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమన్నాయి. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ అడ్డుకుంది. దీంతో సోమవారం మార్కెట్లు ప్రారంభమైన సమయంలో ఇంటర్‌కాంటినెంటల్ ఎక్స్ఛేంజీలో బ్రెంట్ క్రూడ్ ఏప్రిల్ కాంట్రాక్ట్ ఒక బ్యారెల్‌కు 10 శాతం పెరిగి 81.87 డాలర్ల గరిష్ఠానికి చేరింది. ఫ్యూచర్స్‌లో బ్రెంట్ క్రూడ్ 13 శాతం పెరిగి 82.37 డాలర్లకు పెరిగింది. 2025 జనవరి తర్వాత ముడిచమురు ధరలు ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. గల్ఫ్ తీరంలో మూడు చమురు ట్యాంకర్లను దెబ్బతీశామని ఇరాన్ ప్రకటించడంతో సరఫరా నిలిచిపోతుందనే భయంతో మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు వినియోగదారుగా ఉన్న భారత్‌కు ఈ ధరల పెరుగుదల శరాఘాతంగా మారింది. గతేడాది 160 బిలియన్ డాలర్ల మేర చమురును భారత్ దిగుమతి చేసుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధర కేవలం ఒక్క డాలర్ పెరిగినా, భారత్ ఏడాదికి అదనంగా రూ.13వేల కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. భారత్ రోజుకు 5.5 మిలియన్ బ్యారెళ్ల చమురును వినియోగిస్తుండగా, అందులో 1.5 నుంచి 2 మిలియన్ బ్యారెళ్ల వివాదాస్పద హోర్ముజ్ జలసంధి గుండానే దిగుమతి అవుతోంది. ఇప్పటికే రష్యా నుంచి సరఫరా తగ్గడంతో పశ్చిమాసియాపై ఆధారపడిన భారత్‌కు ఇప్పుడు ఈ యుద్ధం భారీ ఆర్థిక సంక్షోభాన్ని తెచ్చేలా కనిపిస్తోంది. భారత్ వద్ద వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి.

## మార్కెట్లను వెంటాడుతున్న యుద్ధభయాలు

### రూ.7.50 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి - సూచీలన్నింటికీ తప్పని భారీ నష్టాలు

**ముంబయి, మార్చి 2:** అంతర్జాతీయ పరిణామాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీగా నష్టపోయాయి. ప్రధానంగా అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఇన్వెస్టర్లలో ఆందోళన రేకెత్తించాయి. దీంతో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలన్నీ కుప్పకూలాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,048.34 పాయింట్లు నష్టపోయి 80,238.85 వద్ద స్థిరపడింది. ఇది సెప్టెంబర్ 2025 తర్వాత సెన్సెక్స్ నమోదైన కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. నిఫ్టీ కూడా312.95 పాయింట్లు కోల్పోయి 24,865.70 వద్ద ముగిసింది. మార్కెట్లో నెలకొన్న భయాందోళనలకు అద్దం పడుతూ అనిశ్చితి సూచీ ఏకంగా 25.01 శాతం పెరిగి 17.13కి చేరింది. నిఫ్టీ 50లో కేవలం బీఈఎల్, సన్ ఫార్మా, ఐటీసీ షేర్లు మాత్రమే లాభాల్లో ముగియగా ఇండిగో 6.25 శాతం నష్టంతో టాప్ లూజర్‌గా నిలిచింది. మారుతి సుజుకి, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఆటో ఇండెక్స్ అత్యధికంగా 2.20 శాతం పడిపోయింది. ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లలోనూ ఒత్తిడి కనిపించింది. అయితే, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ మాత్రం 0.24 శాతం లాభపడి సానుకూలంగా ముగిసింది. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా ప్రధాన సూచీల కంటే ఎక్కువగా నష్టపోయాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకునేందుకు వెనుకాడు తున్నారని, లాభాల స్వీకరణ వైపు చూస్తున్నారని మార్కెట్ వర్గాలు తెలిపాయి. యుద్ధ భయాలతో సోమవారం ట్రేడింగ్ మొదలు కాగానే సూచీలు తిరోగమించాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల విలువ ఒక్కరోజులోనే రూ.6.50 లక్షలకోట్లు తగ్గి రూ.457 లక్షల కోట్లకు పడిపోయింది. ఇన్వెస్టర్లకు ఒక్కరోజులోనే రూ.6.50 లక్షల నష్టం వాటిల్లింది. సెన్సెక్స్ ఇండెక్స్‌లో ఇండిగో, లార్సెన్ అండ్ టర్బో, అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. ఈ స్టాక్స్ 36 శాతం మేర నష్టపోయాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు 2 శాతం మేర లాభపడ్డాయి. ఇక ఎన్ఎస్ఈలో నిఫ్టీ ఆటో సెక్టార్ టాప్ లూజర్‌గా మారింది. 2.2 శాతం మేర పడిపోయింది. నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ సైతం 2 శాతం మేర పతనమైంది. ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ అత్యధికంగా 6.36 శాతం మేర నష్టపోయింది. ఆ తర్వాత లార్సెన్ షేర్లు 5 శాతం మేర నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ స్టాక్ 3.33 శాతం నష్టపోయింది. మారుతీ సుజుకీ స్టాక్ 3.16 శాతం పడిపోయింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps